thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 315 కరీంనగర్ బుధవారం, 21 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝాంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.



## భారత్ లక్ష్యంగా....

# పాకిస్తాన్ ఆర్మీ "రాకెట్ ఫోర్స్"!

ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్తాన్ భారత్‌ను ఎదుర్కొనే పనిలో పడింది. పహల్గామ్ దాడి తర్వాత, భారత్ జరిపిన ప్రతీకార చర్యల్లో పాకిస్తాన్ దారుణంగా భంగపడింది. 11 ఎయిర్ బేసులపై భారత్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇదే కాకుండా పీఓకే, పాకిస్తాన్ భూభాగాల్లో ఉన్న లష్కరేతోయిబా, జైషే మహ్మద్ ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో వందలాది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, ఈ దాడుల తర్వాత ఇప్పుడు పాకిస్తాన్ సైన్యం "రాకెట్ ఫోర్స్ కమాండ్" ఏర్పాటు చేయనుంది. పాక్ సైన్యం చీఫ్ అసిమ్ మునీర్ నేతృత్వంలో ఈ ఫోర్స్ రూపుదిద్దుకుంటున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. లాంగ్ రేంజ్ స్ట్రైక్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్(సీడీఎఫ్) అసిమ్ మునీర్ అధ్యక్షతన ఇటీవల జరిగిన కార్ప్స్ కమాండర్ల సమావేశంలో ఈ రాకెట్ ఫోర్స్ కమాండ్‌కు ఆమోదం లభించింది. రాబోయే కొన్ని నెలల్లో దీనిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయబోతున్నారు. పాకిస్తాన్ రాకెట్ ఫోర్స్ కమాండ్, 2015లో చైనా స్థాపించిన రాకెట్ ఫోర్స్ ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. ఈ కమాండ్‌కు లెఫ్టినెంట్ జనరల్(త్రీస్టార్) లేదా మేజర్ జనరల్ (టూ స్టార్) హోదా కలిగిన సీనియర్ పాక్ ఆర్మీ అధికారి నాయకత్వం వహించే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ప్రయోగించిన డ్రోన్లను, క్షిపణులు భారత ఎయిర్ డిఫెన్స్ సమర్థవంతంగా అడ్డుకుంది. ఇక భారత్ ప్రయోగించిన క్షిపణులను పాకిస్తాన్ వద్ద ఉన్న చైనీస్ డిఫెన్స్ నిలువరించలేకపోయింది. ఇదిలా ఉంటే, భారత్ కూడా శక్తివంతమైన రాకెట్ ఫోర్స్‌ను సృష్టించాలనుకుంటున్నట్లు సమాచారం. అయితే, అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. చైనా, పాక్ సరిహద్దుల్లో ఎదురవుతున్న భద్రతా సవాళ్ల దృష్ట్యా భారత్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ భారతదేశ సాయుధ దళాలను ఆధునీకరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. యుద్ధ స్వరూపం మారుతున్న నేపథ్యంలో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్ వంటి టెక్నాలజీతో సైన్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యాన్ని ఆయన వెల్లడించారు.

## ఫస్ట్ హరీష్.. నెక్స్ట్ కేటీఆర్.. ఆ తర్వాత కేసీఆర్..

# వన్ బై వన్!






## రేవంత్ టార్గెట్ ఫిక్స్!!

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి గులాబీ పార్టీ గద్దెలు మొత్తం కూలాలని ఇటీవల వ్యాఖ్యలు చేశారు. గులాబీ పార్టీని వంద మీటర్ల లోతులో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలు ఏదో రాజకీయ వ్యవహారంలో చేసినవని అందరూ అనుకున్నారు. కానీ, ముఖ్యమంత్రి వ్యాఖ్యల వెనుక లోతైన వ్యవహారం ఉందని ఇప్పుడు అందరికీ అర్థమవుతోంది. ఖమ్మం సభలో రేవంత్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. ఆ తర్వాత ఒక్కరోజు గ్యాప్ లోనే ఆ పరిణామాలు ఎలా ఉంటాయో గులాబీ పార్టీకి అర్థమైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి ఆక్టివ్ అయింది. ఈసారి మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేసింది. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద ఆయనకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారులు ఎదుట హరీష్ రావు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఏసిపి వెంకటగిరి ఈ నోటీసులను హరీష్ రావుకు అందించారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ టాపింగ్ జరిగిందని పదేపదే రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. చివరికి కేసీఆర్ కుమార్తె కూడా ఫోన్ టాపింగ్ జరిగిందని చెబుతున్నారు. తన భర్త ఫోన్ ను కూడా వదిలిపెట్టకుండా దుర్మార్గంగా వ్యవహరించారని కవిత ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఫోన్ టాపింగ్ వ్యవహారంపై వేగంగా అడుగులు వేస్తోంది. ఫోన్ టాపింగ్ వల్ల గత ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ప్రయోజనాలు పొందారు? నాటి ప్రభుత్వ పెద్దల కోసం పనిచేసిన వారు ఎలాంటి ఫలితాన్ని ఆశించారు? అనే విషయాలను బయట పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం కృషి చేస్తుంది. హరీష్ రావు కు సిట్ నోటీసు ఇవ్వడం సంచలనం కలిగించింది. ఈ కేసులో ముందుగా హరీష్ రావును, ఆ తర్వాత కేటీఆర్ ను, అనంతరం కేసీఆర్ ను విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏం చేస్తుంది అనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే చాలామందిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. విచారణలో సేకరించిన సమాచారం తర్వాత హరీష్ రావుకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. హరీష్ రావును విచారించి స్టేట్మెంట్ రికార్డు చేస్తారని తెలుస్తోంది. గతంలోనే తనకు నోటీసులు అందుతాయని హరీష్ రావు చెప్పారు.. పంచాయతీ ఎన్నికలకు ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్ కు నోటీసులు ఇచ్చారని.. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తనకు కూడా ఇస్తారని హరీష్ రావు చెప్పారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉ ండదని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే అది జరుగుతుందని హరీష్ రావు గతంలోనే వ్యాఖ్యానించారు.. ఇక ఈ వ్యవహారంలో ముందు నుంచి కూడా కేసీఆర్ పేరు వినిపిస్తోంది. త్వరలోనే ఆయనను విచారిస్తారని.. దానికంటే ముందు నోటీసులు పంపిస్తారని ప్రచారం జరుగుతోంది.



## సీఎం రేవంత్‌రెడ్డితో యూఏఈ మంత్రి భేటీ..

### పలు కీలక అంశాలపై చర్చ..

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో యూఏఈ మంత్రి దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తెలంగాణతో కలిసి పనిచేస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే.. తెలంగాణ లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూఏఈ- తెలంగాణ సంయుక్త టాస్క్?ఫోర్స్ ప్రతిపాదన చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ..** దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజు బిజీబిజీగా ఉంది. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ చైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ అయ్యారు. సీఎంతో పాటూ మంత్రులు శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్?తో పాటు హెల్త్ టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఎరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్?లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

**తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలి: మంత్రి శ్రీధర్ బాబు...** తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా పదిశాతం లక్ష్యంగా విజన్ రోడ్‌మ్యాప్‌లో ఉందని తెలిపారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం- 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, ఏఐ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.




హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. కొద్దిసేపటి క్రితం జూబ్లీహిల్స్ పీఎస్‌కు ఆయన చేరుకున్నారు. హరీశ్‌రావు వెంట న్యాయవాదులను పీఎస్ లోపలికి పోలీసులు అనుమతించలేదు. పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని హరీశ్‌రావుకు సోమవారం సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన జిల్లా పర్యటనలో ఉండటంతో సిట్ సిబ్బంది నోటీసులను కోకాపేటలోని ఆయన ఇంట్లో ఇచ్చి వెళ్లారు. దాదాపు రెండేళ్లుగా జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అనేక మలుపులు తిరుగుతున్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు, వ్యాపారులు మొదలు జడ్జీల ఫోన్లనూ ట్యాప్ చేశారని, వాటికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో 2024 మార్చిలో కేసు నమోదైంది.

అనంతరం జరిగిన పరిణామాల్లో ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు విదేశాలకు పారిపోవడంతో దర్యాప్తునకు ఆటంకం ఏర్పడింది. మిగతా నిందితులను అరెస్టు చేసినప్పటికీ ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో చాలాకాలంపాటు దర్యాప్తు నిలిచిపోయింది. గత జూన్?లో ప్రభాకర్‌రావు హైదరాబాద్ రావడంతో దర్యాప్తు ఊపందుకుంది.

## బడ్జెట్‌లో ఆదాయపు పన్నుపై గుడ్ న్యూస్ చెప్తారా ? ఉత్కంఠ..



ఈసారి కేంద్ర బడ్జెట్ కు గడువు దగ్గరపడుతోంది. పార్లమెంట్ లో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ పై ఇప్పటికే ఆర్థికమంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో ఈసారి కూడా ఆదాయపన్ను విషయంలోవేతన జీవులతో పాటు ఇతర వర్గాలు కూడా కేంద్రం వైపు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఈసారి ఆదాయపు పన్ను స్లాబ్ లలో ఉండబోయే మార్పులేంటి ?, ఇతర మార్పులేంటి, వీటి వల్ల తమకు ఏమైనా ప్రయోజనం ఉంటుందా లేదా అని వారు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి గతేడాది కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్నుకు సంబంధించి పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. పన్ను చెల్లింపుకు కనీస ఆదాయంగా ఉన్న 7 లక్షల స్లాబ్ ను కాస్తా ఏకంగా 12 లక్షలకు పెంచేశారు. అలాగే స్లాబ్ లలోనూ పలు మార్పులు చేశారు. రిబేట్ లోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. మొత్తంగా పాత పన్ను విధానం కొనసాగిస్తూనే కొత్త పన్ను విధానం వైపు పన్ను చెల్లింపుదారుల్ని మళ్లించేందుకు ఏం చేయాలో నిర్మలా సీతారామన్ అంతా చేశారు. ఆ తర్వాత ఆదాయపు పన్ను చట్టంలోనూ సవరణలు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. దీంతో ఈసారి కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్ను చట్టం విషయంలో పెద్దగా మార్పులు, చేర్పులు ఉండకపోవచ్చని నిపుణులు చెప్తున్నారు. ఉన్నా పరిమితంగానే ఉంటాయని వారు భావిస్తున్నారు. డిమాండ్?కు సంబంధించిన డేటాలో కనిపిస్తున్నట్లుగా జీఎస్టీ స్లాబ్ ల క్రమబద్ధీకరణ వినియోగదారుల నమ్మకాన్ని పునరుద్ధరించిందని నిపుణులు భావిస్తున్నారు.ప్రభుత్వం ఈ ఊపును కొనసాగించాలని, విధానపరమైన అవాంతరాలను నివారించాలని వారు కోరుతున్నారు.




## హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరయ్యే ముందు మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్తది కాదని.. గత రెండేళ్లుగా దీనిపై విచారణ జరుగుతోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. హరీశ్‌రావు పోరాటయోధుడిలా ఫీలవుతున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు ఫోన్లు ట్యాప్ చేయించారని ఆరోపించారు. "ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ముందు డ్రామా చేస్తున్నారని హరీశ్? బాధపడిపోతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని ఎలా వేధించారో తెలంగాణ ప్రజలకు తెలుసు. ఎన్నో కేసులు పెట్టి ఆయన్ను అణగదొక్కాలని చూశారు. సీఎంపై నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదు" అని అయిలయ్య అన్నారు. హరీశ్‌రావుకు నిజాయతీ ఉంటే తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకోలేదని ప్రమాణం చేయగలరా? అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు. తప్పు చేయకపోతే ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన బాధితుడైతే సంబంధిత వివరాలను సిట్?కు తెలపాలని.. బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్? చేశారు. "అధికారులతో తప్పుడు పనులు చేయించి తెలంగాణను అభాసుపాల్జేశారు. కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసం కావడానికి కేసీఆర్ కారణం. మేం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ నేతలు బయట తిరగలేరు. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది"అని దయాకర్ అన్నారు. హరీశ్‌రావు సిట్ విచారణకు వస్తూ హడావుడి ఎందుకని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. ఫోన్? ట్యాపింగ్? కేసులో చాలా మంది ఇబ్బందిపడ్డారని చెప్పారు. తప్పు చేయనప్పుడు భయమెందుకన్నారు.




గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది. అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్' తాజాగా గ్రీన్?లాండ్?కు సంబంధించి తమ సోషల్? మీడియా ఖాతాలో ఓ పోస్ట్? చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్? స్పేస్ బేస్‌కు చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. ఇక, అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ఆశలను ఉద్దేశిస్తూ.. ఫ్రాన్స్ బహిరంగ విమర్శలు చేసింది. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు దృష్టిసారించారనే దానిపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భవిష్యత్తులో రష్యా నుంచి వచ్చే ముప్పు నుంచి కాపాడుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేసింది. 'ఏదోఒక రోజు మంటలు చెలరేగితే.. అగ్నిమాపక సిబ్బంది రావాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడే ఇంటిని తగలెట్టేయడం మంచిది. ఏదో ఒకరోజు కారుకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి ఇప్పుడే కారుకు యాక్సిడెంట్ చేయడం మంచిది'' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరిందిఇక, గ్రీన్‌లాండ్ సాధించుకునేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలపై ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్యూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు ఈయూ, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య, ఆర్థిక సంబంధాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.




హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు సిట్ నోటీసులు ఇచ్చారని.. సీఎం ఆడుతున్న సిల్లీ డ్రామా ఇది అని వ్యాఖ్యానించారు. సిట్ విచారణకు హాజరయ్యే ముందు కోకాపేటలో మాజీ మంత్రి కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. "సోమవారం రాత్రి 9 గంటలకు నోటీసులు ఇచ్చి మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. చట్టాలపై గౌరవముంది.. పిలిచిన సమయానికి విచారణకు హాజరవుతా. నేను ఏ తప్పూ చేయలేదు.. భయపడను. రేవంత్? బామ్మర్ది బాగోతం, మున్సిపల్ ఎన్నికల ముందు అవినీతిని బయటపెట్టినందుకే నోటీసులు ఇచ్చారు. ఇలాంటివి నాకు కొత్త కాదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు ఎన్ని కేసులు పెట్టినా కేసీఆర్ నాయకత్వంలో పోరాడాం. ఆరు గ్యారంటీలు, ఇతర హామీల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. బొగ్గు కుంభకోణం, వాటాల పంచాయతీ ప్రజలకు అర్థమైంది. వాటి నుంచి ప్రజలు, మీడియా దృష్టి మళ్లించేందుకే ఇలాంటి చర్యలు చేపట్టారు. పంచాయతీ ఎన్నికల్లో రేవంత్ అంచనాలు తప్పాయి. వారు ఊహించని స్థాయిలో బీఆర్ఎస్‌కు స్థానాలు వచ్చాయి. కృష్ణా నీటిని ఆంధ్రాకు అప్పగిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఫోన్ ట్యాపింగ్‌పై డ్రామాలు ఆడుతున్నారు. గతంలో నాపై పెట్టిన కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టేశాయి. న్యాయం మావైపు ఉంది. సుప్రీంకోర్టే కొట్టివేసిన తర్వాత మళ్లీ నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడమేంటి? ఎన్నిసార్లు పిలిచినా వస్తాం. అవినీతి బాగోతాలను బయటపెడుతూనే ఉంటాం" అని హరీశ్‌రావు అన్నారు.

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ...** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వానికి సింగరేణిలో 49 శాతం వాటా ఉందని.. అక్కడ జరుగుతున్న అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డితో కుమ్మక్కు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డిని కోరారు. అన్ని ఆధారాలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.




వాహన చలాన్లపై ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్? పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

## ఈ నెల 24 లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్!




హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు.

గురువారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు. ఈనెల 24న లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఫోన్ ట్యాపింగ్.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై ఎంపీ లక్ష్మణ్ విమర్శలు



న్యూఢిల్లీ, జనవరి 20: ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ అయిందని తెలంగాణ మొత్తం కోడై కూస్తోందని ఎంపీ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కవిత కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని.. ఈ విషయమై కవితే స్వయంగా చెప్పారన్నారు. ముందు.. కవిత మాటలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్?కు పాల్పడుతోందని అనుమానాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు ఎంపీ లక్ష్మణ్. వారి అంతర్గత కలహాలతో ఆయా నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. దర్యాప్తులతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న దోషులు, బాధ్యులు ఎవరో నిర్ధారించకుండా రెండేళ్లు పూర్తి చేశారంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్.. కలహాలతో ముక్కలైపోయిందని, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని లక్ష్మణ్ అన్నారు. కవిత ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కోల్ బ్లాక్‌పై న్యాయపోరాటం కూడా చేసే అవకాశముందని చెప్పారు. బీఆరచవతీతీచస్ తిన్న మొత్తాన్ని కక్కిస్తామని రేవంత్ రెడ్డి అన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ పూర్తి దర్యాప్తు చేయాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ నేతలను విచారణ చేయొద్దని చట్టం ఏమైనా ఉందా?: బల్మూరి వెంకట్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారణకు పిలిస్తే.. తెలంగాణ జాతిపితలాగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. గతంలో తన ఫోన్ ట్యాప్ అయ్యిందని.. తనను కూడా విచారణకు పిలిచినట్లు చెప్పారు. సీఎల్పీ మీడియా సెంటర్ వద్ద బల్మూరి వెంకట్ మాట్లాడారు. "నా కుటుంబ సభ్యులతోపాటు మా ఇంటి వాచ్?మెన్? ఫోన్?ను కూడా ట్యాప్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో అత్యధిక కేసులు పెట్టింది నా పైనే. గాంధీ భవన్ లోపలికి వచ్చి మరి అరెస్ట్ చేశారు. మా ఎమ్మెల్యేలను బెదిరించి మీ పార్టీలో చేర్చుకున్నారు. మా ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న కేటీఆర్ ఆధారాలు చూపించాలి. మిమ్మల్ని విచారణ చేయవద్దని చట్టం ఏమైనా ఉందా?" అని బల్మూరి వెంకట్ ప్రశ్నించారు.




హైదరాబాద్, జనవరి 20: సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు హోం శాఖ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్??కు హైకోర్టు సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. గత ఆదేశాలను ధిక్కరిస్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ నంబర్ ఢబ్రా చీశీ.1518 శీట 2026పై అడ్వకేట్ విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు.

హోంశాఖ అధికారులు గత ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని వాదించారు. మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల రేట్లు పెంచిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాకుండా దాచిపెట్టారంటూ పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే సీవీ ఆనంద్‌కు హైకోర్టు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ సినిమాస్ రెగ్యులేషన్ యాక్ట్-1955 ప్రకారమే ధరల నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమాకైనా టికెట్ ధరల పెంపు నిర్ణయం తీసుకునేటప్పుడు 90 రోజుల ముందే ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది.

గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా మళ్లీ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

## హరీశ్‌రావును జైలుకు పంపాలని తహతహలాడుతున్నారు.. రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జనవరి20 : సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్?కు నోటీసులు ఇచ్చినా భయపడేది లేదన్నారు. ఇంకో వెయ్యి సెట్?లు వేసినా ఎదుర్కోవటానికి రెడీగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే రేవంత్ రెడ్డిని వదిలేది లేదని హెచ్చరించారు. తెలంగాణ భవన్?లో మంగళవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావును జైలుకు పంపాలని రేవంత్?రెడ్డి తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు కంటే రేవంత్‌రెడ్డి సిట్ పెద్దదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. బొగ్గు కుంభకోణంలో సీఎం బావమరిది సృజన్ రెడ్డి కింగ్ పిన్ అని ఆరోపణలు చేశారు. బొగ్గు కుంభకోణంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.


**బొగ్గు కుంభకోణంలో కిషన్‌రెడ్డికి వాటాలు..** బొగ్గు కుంభకోణంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కూడా భాగస్వామ్యం ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కోల్ మినిస్టర్ కిషన్.. ఈ విషయంలో మౌనంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి బావమరిది కుంభకోణం బయట పెట్టినందుకే హరీశ్‌రావును విచారణ పేరుతో వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లొసుగులు బయటపెట్టిన ప్రతిసారీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వాటాల పంచాయితీ వల్లే నైనీ బ్లాక్ టెండర్లను మల్లు భట్టి విక్రమార్క రద్దు చేశారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పెద్ద తప్పు అని కేటీఆర్ తెలిపారు. టెండర్లు వేస్తోన్న వారిపై సృజ?న్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. నైనీ ఒక్కటే రద్దు చేస్తే సరిపోదని.. సృజన్ రెడ్డి దక్కించుకున్న టెండర్లనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో రేవంత్ కేబినెట్?ను హరీశ్?రావు ఫుట్?బాల్ ఆడుకున్నారని సెటైర్లు వేశారు.

**రేవంత్ రెడ్డిది బురద బుద్ధే..** అదృష్టం అందలం ఎక్కిస్తే.. రేవంత్‌ది మాత్రం బురద బుద్ధినేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నాళ్లు లీకుల మీద బతుకుతారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్? కేసుపై ఎందుకు ఒక్క అధికారిక ప్రెస్‌మీట్ పెట్టరని నిలదీశారు. విచారణ పేరుతో బీఆరచవతీతీచస్ నాయకత్వాన్ని రేవంత్ సర్కార్ వేధిస్తోందని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి కొడుకు భూ అరాచకాలపై సిట్ ఎందుకు వేయటం లేదని ఆయన ప్రశ్నించారు. ఏఐసీసీ సెక్రటరీ అలంపూర్‌లో రూ.8 కోట్లు డిమాండ్ చేస్తే.. ఎందుకు సిట్ వేయరు.? అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగస్వామ్యమైన అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని సూచించారు. రేపు అధికారంలోకి వచ్చేది బీఆరచవతీతీచస్సేనని.. రేవంత్?రెడ్డి ఆడే రాజకీయ క్రీడలో అధికారులు బలి కావొద్దని హితవు పలికారు.

**అధికారులను వదిలేది లేదు..** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణలో పాల్గొన్న అధికారులను రిటైర్ అయిన తర్వాత కూడా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. కేబినెట్?లో దండుపాళ్యం బ్యాచ్ ఉందని ఎద్దేవా చేశారు. దందాల నుంచి దృష్టి మరల్చడానికే సిట్ విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. బీఆరచవతీతీచస్ జెండా గద్దెలను ముట్టుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. పేమెంట్ కోటాలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని.. ఇంకా ఆయనను సీఎంగా గుర్తించటం లేదని సెటైర్లు వేశారు. హార్వర్డ్?లో చదువుకున్న తర్వాతనైనా.. రేవంత్?రెడ్డి భాషలో మార్పు రావాలని హితవు పలికారు. ఆయనకు ఇంగ్లీష్ రాదని.. హార్వర్డ్?లో ఏం నేర్చుకుంటారో చూడాలని ఎద్దేవా చేశారు. జనవరి 31 తర్వాత రేవంత్‌లో కొత్త మనిషి.. కొత్త భాష వస్తుందేమో చూద్దామన్నారు కేటీఆర్.

# దళిత సాహిత్యోద్యమ రథసారథి ఆచార్య ఎండ్లూరి సుధాకర్

## - జనవరి 21... ఎండ్లూరి జయంతి



పత్రికా పాఠకులకు సుపరిచితులు డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. జీవితాంతం నిజాయితీ బాట లోనే నడిచారు. నిబద్ధతకు మారుపేరు గా నిలిచారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం సుధాకర్ కే సొంతం. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్ లోని పాముల బస్తిలో తన అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్యు లు, తెలుగు అకాడమీ సభ్యు లు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకులు. హైదరాబాద్ విశ్వ విద్యా లయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తిలో దేవయ్య, శాంతా బాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉ స్మానియా విశ్వ విద్యాలయంలో ఎం .ఏ . ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పి. హెచ్.డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు. 1990 అక్టోబరు 6 వ తేది నుంచి వివిధ పదవుల్ని నిర్వ హించారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచు రించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహి త్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించారు. జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్?లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా పాల్గొన్నారు. తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి...వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిల పరచు కొన్నారు. నేటికి ఆయనను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఆయన బాటలో పయనిస్తున్న వారు ఎందరో కవులు ఉన్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా అతి సామాన్య జీవితం గడపడం లాంటి ప్రత్యేకతలు ఆయనకే చెందుతాయని ఆయన తో పరిచయమున్న వారు చెపుతా రు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం, భావుకత లాంటి బహుముఖీన ప్రజ్ఞ సుధాకర్ లోనే కనబడుతుంది అంటే అతిశయోక్తి కాదు. దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సహ దర్మచారిణి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, వారి కూతురు ఎండ్లూరి మానస కథా రచయిత్రి, ఆమె రాసిన కథా సంపుటి "మిళిశీద" కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. లలిత కళా పరిషత్ పురస్కారం, నల్గొండ, స్లిష్టల వెంకటల్లు దీక్షితులు స్మారక సాంస్కృతిక సాహితీ కళా సమితి , యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్, కవికోకిల జాషువా, తిలక్ అవార్డు, బెంగళూరు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, సమతా రచయితల పురస్కారం అమలాపురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు, డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్ , సినారె పురస్కారం - కరీంనగర్ , నేదురుమల్లి జనార్ధన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాడే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, అద్దంకి, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి ఎన్ రెడ్డి మెమోరియల్ అవార్డు, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, లెక్క లేనన్ని అందు కున్నారు. 28 జనవరి 2022 (శుక్రవారం) తెల్లవారు జామున హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు. 63వ పుట్టిన రోజు తర్వాత వారం రోజుల కే ఈ లోకాన్ని వదిలి వెళతారని ఎవరూ హిస్తారు. సుధాకర్ ఆకస్మిక అకాల మరణం ఆధునిక తెలుగు సాహిత్యానికి తీరని లోటు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పాత్రికేయుల సమస్యలపై పోరాటమే శరణ్యం

-ప్రమాదం అంచున పత్రికా స్వేచ్ఛ -సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్

-సంఘం బలోపేతానికి సమిష్టిగా కృషి చేద్దాం -ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపు







హైదరాబాద్, జనవరి 21: జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుందని, పోరాటాల ద్వారానే సమస్యలు సాధించుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టులకు మరిన్ని గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని, అందుకు జర్నలిస్టులు అప్రమత్తమై ఫెడరేషన్ నాయకత్వంలో పోరాటం చేసేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ రాంనగర్ లోని రాజ్ ఫంక్షన్ హాలులో టీడబ్ల్యూజేఎఫ్ హైదరాబాద్ జిల్లా సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు ప్రమాదపు అంచుల్లో ఉన్నాయని,పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వం జర్నలిస్టులను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని, రివ్యూ కమిటీ పేరుతో కాలయాపన చేసి చివరికి జర్నలిస్టులకు ఆందోళన కలిగించే జీవో 252 జారీ చేసిందని అన్నారు.

రాబోయే ఒకటి, రెండు నెలలు జర్నలిస్టులకు కీలకమని, ఎందుకంటే అక్రెడిటేషన్ కార్డులను బాగా తగ్గిస్తారనే ప్రచారం జరుగుతోందని అన్నారు. అక్రెడిటేషన్లు తగ్గిస్తే ఊరుకునేది లేదని, రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేస్తామని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన పోరాటం చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.

మీడియా సంస్థలు, జర్నలిస్టుల జనాభా అధికంగా ఉన్న హైదరాబాద్ జిల్లాలో ఐక్యత కొరవడిందని, ఫెడరేషన్ ద్వారా జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయాలని అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కో- కన్వీనర్లు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, సీనియర్ సభ్యులు బొల్లం శ్రీనివాస్, సీహెచ్ వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ, హైదరాబాద్ లోని ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యులంతా కలిసిరావాలని, జర్నలిస్టుల సమస్యల సాధనకు రాబోయే రోజుల్లో నిర్వహించే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కె. పాండు రంగారావు, నాగరాజు, యర్రమిల్లి రామారావు, రఘురాం, హెచ్ యూజే నాయకులు వర్కాల కృష్ణ, గజ్జల వీరేశం, ఎన్ సీహెచ్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య పలువురు నూతన జర్నలిస్టులకు ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా సభ్యత్వం ఇచ్చారు. **టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పాటు..** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా సన్నాహక సమావేశంలో జిల్లా అడ్ హక్ కమిటీ ఏర్పాటైంది. కమిటీ కన్వీనర్ గా వి. రవికుమార్(బీజే టీవీ), కో- కన్వీనర్లుగా గజ్జల వీరేశం(సాక్షి), బి. గోపాల్ (ఆంధ్రజ్యోతి), వర్కాల కృష్ణయ్య (నమస్తే తెలంగాణ), కె. నర్సింగ్ రావు(సూర్య), ఆర్. వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రభ), వి. శ్రీనివాస్ (మనం బ్యూరో), రాజేష్ గౌడ్(వార్త), బి. శ్రీనివాస్(ప్రజాజ్యోతి), ఎం.శ్రీశైలం (వాయిస్ టుడే), ఆర్. శ్రీనివాస్ గౌడ్(సాక్షి డిజిటల్ న్యూస్), వెంకట్(యాప్స్ న్యూస్ ఇంగ్లీష్ డైలీ), సీహెచ్ బ్రహ్మం(ఏబీ న్యూస్), వేణుగోపాల్(హెచ్ డీఎస్), పి.సంతోష్(టీఆర్ 9 న్యూస్) తదితరులు అడ్ హక్ కమిటీలో ఉన్నారు.

# నైనీ కోల్ బ్లాక్ వివాదం: ఆరోపణలకంటే ముందే రద్దు నిర్ణయం



ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ రద్దు అంశం తెలంగాణ రాజకీయ-పరిపాలనా వర్గాల్లోనే కాక జాతీయ స్థాయిలోనూ గణనీయమైన చర్చకు దారితీసింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్? (ఎస్సీసీఎల్) నిర్వహణలో భాగంగా జరిగిన ఈ టెండర్ ప్రక్రియ, దానిపై వచ్చిన ఆరోపణలు, చివరకు తెలంగాణ ప్రభుత్వ డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీసుకున్న నిర్ణయం - ఇవన్నీ కలసి పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్య బాధ్యత, రాజకీయ నైతికత వంటి అంశాలపై విస్తృత చర్చకు కారణమయ్యాయి. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్? దేశంలోనే ప్రభుత్వ రంగానికి చెందిన ప్రముఖ బొగ్గు ఉత్పత్తి సంస్థలలో ఒకటి. తెలంగాణలోని బొగ్గు గనులకే పరిమితం కాకుండా, ఇంధన భద్రత అవసరాల దృష్ట్యా ఇతర రాష్ట్రాల్లోనూ గనులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా అడుగులు వేస్తోంది. ఆ క్రమంలోనే ఒడిశాలోని అంగుల్? జిల్లాలో ఉన్న నైనీ కోల్ బ్లాక్?ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించింది. ఈ గనిలో సుమారు వందల కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనాలు ఉండగా, వార్షికంగా కోట్ల టన్నుల ఉత్పత్తి సాధ్యమని సాంకేతిక నివేదికలు సూచిస్తున్నాయి. సింగరేణి ఆదాయంలో గణనీయమైన వృద్ధికి, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరాకు ఈ గని కీలకంగా భావించ బడుతోంది. నైనీ కోల్ బ్లాక్ అభివృద్ధి, తవ్వకాలు, రవాణా తదితర పనుల కోసం ఎస్సీసీఎల్? టెండర్లు పిలిచింది. సాధారణంగా ఇలాంటి టెండర్ ప్రక్రియలు కంపెనీ బోర్డు ఆమోదించిన నిబంధనల ప్రకారం, సాంకేతిక--ఆర్థిక అర్హతలను పరిగణనలోకి తీసుకుని జరుగుతాయి. అయితే ఈ టెండర్ విషయంలో కొన్ని మీడియా కథనాలు, రాజకీయ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. టెండర్లలో కొన్ని సంస్థలకు అనుకూలంగా నిబంధనలు రూపొందించారన్న అనుమానాలు, రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ప్రచారం జరిగింది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై ఉద్దేశ పూర్వకంగా ఆరోపణలు వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు తీవ్రమవుతున్న దశలోనే భట్టి విక్రమార్క స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని, టెండర్ ప్రక్రియలో మంత్రుల ప్రత్యక్ష జోక్యం ఉండదని స్పష్టం చేశారు. సింగరేణి ఒక స్వతంత్ర ప్రభుత్వ రంగ సంస్థగా, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ నిర్ణయాల ప్రకారమే వ్యవహరిస్తుందని వివరించారు. అయినప్పటికీ ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో, మీడియాలో అనుమానాలు తలెత్తిన పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం పారదర్శకతకు నిదర్శనంగా ఉండాలనే ఉద్దేశంతో టెండర్‌ను రద్దు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. 'డౌట్?కు చోటు లేకుండా ఉండాలి, ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి ప్రధాన బలం' అనే సూత్రం తోనే ఈ నిర్ణయం తీసుకున్నామని భట్టి వ్యాఖ్యానించారు. టెండర్ రద్దు నిర్ణయం ఒక్కసారిగా తీసుకున్నది కాదని, పూర్వాపరాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే ఈ చర్యకు శ్రీకారం చుట్టామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియలో పూర్తిగా పనులు ప్రారంభం కాలేదని, కాబట్టి రద్దు వల్ల సంస్థకు తక్షణ ఆర్థిక నష్టం పెద్దగా ఉండదన్న అంచనాలు ఉన్నాయి. మరోవైపు, తాజా నిబంధనలతో, మరింత పారదర్శకంగా, పోటీ పద్ధతిలో మళ్లీ టెండర్లు పిలవడం ద్వారా నాణ్యమైన సంస్థలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాజకీయంగా ఈ అంశం పెద్ద చర్చకు దారితీసింది. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేయగా, అధికార పార్టీ మాత్రం తక్షణ చర్య ద్వారా విమర్శలకు తావు లేకుండా చేసిందని వాదిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి తావు లేదన్న సంకేతాన్ని ఇవ్వాలన్న ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బొగ్గు కేటాయింపుల విషయంలో జరిగిన వివాదాలు, సుప్రీంకోర్టు తీర్పులు, కోల్ స్కామ్ నేపథ్యం కూడా ఈ వ్యవహారంపై ప్రజల అప్రమత్తతను పెంచింది. గణాంకాల పరంగా చూస్తే, నైనీ కోల్ బ్లాక్ ద్వారా భవిష్యత్తులో సింగరేణి వార్షిక ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధి సాధించే అవకాశం ఉంది. కొన్ని అంచనాల ప్రకారం, ఈ గనిలో తొలి దశలోనే సంవత్సరానికి 10-15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని, పూర్తిస్థాయి అభివృద్ధి తర్వాత ఇది మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇది తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, ఇతర రాష్ట్రాలకు బొగ్గు సరఫరాకు కూడా దోహదం చేయనుంది. అలాంటి కీలక ప్రాజెక్టులో చిన్న అనుమానం కూడా ప్రజాభిప్రాయాన్ని దెబ్బతీసే అవకాశముండటంతో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించినట్లు కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు ఘటన ఒక టెండర్ నిర్ణయానికి మించి పాలన తత్వాన్ని ప్రతిబింబించే అంశంగా మారింది. ఆరోపణలు వచ్చిన వెంటనే వాటిని తేలికగా తీసుకోకుండా, అవసరమైతే ఒక పెద్ద ప్రాజెక్టును తాత్కాలికంగా నిలిపి వేయడానికైనా సిద్ధపడటం ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుత పాలనకు ఉదాహరణగా చెప్పవచ్చు. అదే సమయంలో, మళ్లీ టెండర్ ప్రక్రియ వేగంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేసి, నైనీ గనిని ఉత్పత్తిలోకి తీసుకురావడం ప్రభుత్వానికి ఉన్న అసలైన సవాలు. ఈ సంఘటన భవిష్యత్తులో ప్రభుత్వ రంగ సంస్థల టెండర్ల నిర్వహణలో మరింత జాగ్రత్త, పారదర్శకత అవసరమనే సందేశాన్ని కూడా బలంగా ఇచ్చింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




**ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని సామాన్యులకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఏపీ సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆర్టీఐ ప్రధాన కార్యాలయంలో చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు, కమిషనర్లుగా ఇతర సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. వీరికి పూర్వ కమిషనర్ సునీల్ కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియాతో వజ్జా శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజలు అడిగిన సమాచారం అధికారులు ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు.**

# సంక్రాంతి రద్దీ..

## ఏపీఎస్ఆర్టీసీ సరికొత్త రికార్డు




అమరావతి: ఆదాయార్జనలో ఏపీఎస్ ఆర్టీసీ సరికొత్త రికార్డు నెలకొల్పింది. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో జనవరి 19న ఒక్కరోజే సంస్థకు రూ.27.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఒక్కరోజే 50.6 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ చరిత్రలో ఒకేరోజులో ఇంత ఆదాయం ఆర్జించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, సూపర్ వైజర్లను ఆర్టీసీ ఎండీ ప్రత్యేకంగా అభినందించారు.

చురకలు


## సంపాదకీయం

# నక్క తోక తొక్కిన చైనా!

అన్ని రంగాల్లోనూ తనదైన శైలిలో దూసుకుపోతూ, అమెరికాకున్న అగ్రరాజ్యం అనే టైటిల్ కు ఎప్పుడు చెక్ పెట్టేద్దామా అన్నట్లుగా ఎదురు చూస్తోన్న డ్రాగన్ కంట్రీ చైనాకు ప్రకృతి ఓ గుడ్ న్యూస్ చెప్పింది! ఇందులో భాగంగా... చైనా తూర్పు లియానింగ్ ప్రావిన్స్ లో దేశ చరిత్రలోనే అతిపెద్ద బంగారు గని కనుగొనబడింది. దీంతో.. చైనా బంగారు నక్క తోక తొక్కిందా అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అవును... 1949 తర్వాత చైనాలో తాజాగా ఓ అతిపెద్ద బంగారు నిక్షేపం కనుగొనబడింది. గత ఏడాది భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు కనుగొన్న గని కంటే ఇది చాలా పెద్దది. అది సుమారు 83 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దాచిపెట్టగా.. తాజా గనిలో సుమారు 1440 టన్నుల బంగారం నిల్వలున్నాయని.. దీని మొత్తం విలువ సుమారు 192 బిలియన్ డాలర్లు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే... భారత కరెన్సీలో సుమారు 17,08,000 కోట్ల రూపాయలు అన్నమాట! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్స్, అత్యాధునిక టెక్నాలజీతో ఈ గనిని గుర్తించారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టులో సుమారు వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 15 నెలలపాటు అన్వేషించి, తవ్విన తర్వాత ఈ స్థాయిలో భారీ బంగారు గని బయటపడిందని చెబుతున్నారు. గతంలో బంగారు గని అభివృద్ధి భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్న తర్వాత.. చైనా నేషనల్ గోల్డ్ గ్రూప్, లియోనింగ్ మినరల్ జియాలజీ గ్రూప్, యింగ్ కౌ మునిసిపల్ ప్రభుత్వం.. తాజాగా ఓ భారీ పారిశ్రామిక సముదాయాన్ని నిర్మించడం ద్వారా స్థానిక బంగారు పరిశ్రమను ప్రోత్సహించడానికి సుమారు 2.82 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నాయి.

**బహుశా ఎప్పటినుంచో వెతుకుతున్న 'ఎల్ డోరాడో' ఇదే కావొచ్చు!:** ఈ సందర్భంగా స్పందించిన సీపీసీ షెన్యంగ్ మున్సిపల్ పార్టీ స్కూల్ ప్రొఫెసర్ వాంగ్ యాన్.. చైనా డైలీతో మాట్లాడుతూ.. ఈ గనిలోని వెయ్యి టన్నులకు పైగా నిల్వలు జాతీయ బంగారు వ్యూహాత్మక నిల్వలను గణనీయంగా భద్రపరుస్తాయని అన్నారు. ఇది ప్రపంచ మార్కెట్ లో దాని పోటీతత్వాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే.. బహుశా మనం ఎప్పటినుంచో వెతుకున్న ఎల్ డొరాడో ఇదే కావొచ్చు అనే కామెంట్లు ఇప్పుడు చైనా నుంచి వినిపిస్తున్నాయి. కాగా.. ఎల్ డొరాడో అనేది ఒక పౌరాణిక నగరం! ఇది బంగారంతో నిండి ఉందని నమ్ముతారు. దీనికి స్పెయిన్ లోని పురాణగాథల నుంచి మూలాలు ఉన్నాయి.

# భక్తితో అమరత్వం: మార్కండేయుడి అద్భుత జీవితం - మాఘ శుద్ధ తృతీయ...మార్కండేయ జయంతి



సనాతన భారతీయ ఆధ్యాత్మిక పరంపరలో చిరంజీవులుగా కీర్తించబడిన మహర్షులలో మార్కండేయుడు ఒకరు. జన్మ--మృత్యు చక్రానికి అతీతంగా నిలిచిన భక్తి శక్తికి ప్రతీకగా, ధర్మ బోధకుడిగా, తపస్సు మహిమాన్వితంగా నిలిచిన మహాత్ముడి స్మరణే మాఘ శుద్ధ తృతీయ నాడు జరిగే మార్కండేయ జయంతి. ఈ పవిత్ర దినం భారతీయ ఆలోచనా సంప్రదాయంలో మానవ జీవితానికి సంబంధించిన మౌలిక ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తుంది. ఆయుష్షు పరిమితమా? మృత్యువు అపరాజితుడా? భక్తి మానవునికి ఏ మేరకు రక్షణగా నిలుస్తుంది? అనే ప్రశ్నలకు మార్కండేయ మహర్షి జీవితం సజీవ సమాధానంగా నిలుస్తుంది. మృకండు మహర్షి, మరుద్మతి దంపతులకు జన్మించిన మార్కండేయుడు చిన్ననాటి నుంచే అసాధారణమైన వైదిక సంస్కారాలతో, తపోనిష్ఠతో ఎదిగాడు. బ్రహ్మదేవుని వర ప్రభావంగా ఆయుష్షు పదహారు సంవత్సరాలకు పరిమితమైనా, ఆ కాలాన్ని సార్థకంగా మలచుకోవడమే లక్ష్యంగా ఆయన జీవితాన్ని తీర్చిదిద్దు కున్నాడు. ఆయుష్షు తక్కువనే వాస్తవం ఆయనను నిరాశకు గురి చేయలేదు. భక్తి ద్వారానే శాశ్వతత్వాన్ని పొందవచ్చన్న నమ్మకం ఆయన తపస్సుకు పునాది అయింది. చిన్న వయసులోనే శివారాధనలో లీనమై, ప్రాణాయామం, జపం, ధ్యానం ద్వారా తన అంతరంగ శక్తిని వికసింప జేశాడు. పదహారవ ఏట యముడు తన పాశంతో సమీపించిన సందర్భం భారతీయ పురాణ సాహిత్యంలో అత్యంత ఉద్వేగభరితమైన ఘట్టంగా నిలుస్తుంది. మృత్యువు ముఖాముఖి ఎదురైన వేళ మార్కండేయుడు భయపడలేదు. శివలింగాన్ని ఆలింగనం చేసుకొని, పరమశివుని శరణు వేడుతూ, నిరంతర జపంలో లీనమయ్యాడు. యమపాశం శివలింగాన్ని తాకిన క్షణమే, లింగాంతర్భూతుడైన శివుడు ఉద్భవించి, యముడిని శిక్షించి, మార్కండేయుడికి చిరంజీవిత్వాన్ని ప్రసాదించాడు. ఇది మృత్యువుపై విజయం కాదు భక్తి ద్వారా భయంపై సాధించిన విజయం. శైవ సిద్ధాంతంలో ఈ సంఘటన మృత్యుంజయ తత్వానికి మూలంగా భావించ బడుతుంది. "త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనరౌ" అనే మహామృత్యుంజయ మంత్రం ఆరోగ్య, ఆయుర్దాయ, మోక్ష ప్రదాయకంగా విశ్వసించ బడుతుంది. మార్కండేయుడి జీవితమే ఈ మంత్ర తాత్పర్యానికి సజీవ ఉదాహరణగా నిలుస్తుంది. మార్కండేయ మహర్షి పేరుతో అనుసంధానమై ఉన్న మహామృత్యుంజయ మంత్రం కేవలం శబ్ద సమూహం కాదు అది జీవన తత్వానికి ప్రతీక. ఆయుష్షు, ఆరోగ్యం, మనోబలం, మోక్షం అనే నాలుగు స్థాయిలను సమన్వయ పరిచే మంత్రంగా ఇది పరిగణింప బడుతుంది. ఈ మంత్రాన్ని ఆచరించిన భక్తుడే మార్కండేయుడని పురాణాలు చెబుతాయి. అందుకే మాఘ శుద్ధ తృతీయ నాడు ఈ మంత్ర జపానికి విశేష ప్రాధాన్యం కలదు. మార్కండేయుడు కేవలం భక్తుడే కాదు గొప్ప దర్శనికుడు, పురాణ వేత్త, ధర్మ ప్రచారకుడు. మార్కండేయ పురాణం ఆయన పేరుతోనే ప్రసిద్ధి చెందింది. ఇందులో దేవీ మహాత్మ్యం వంటి శక్తి ఉపాసనకు మూలమైన భాగాలు ఉన్నాయి. శైవ--శాక్త--వైష్ణవ సంప్రదాయాల మధ్య సమన్వయ దృష్టిని ప్రతిబింబించే గ్రంథమిది. మహాభారతంలో ఆయన ధర్మరాజు యుధిష్ఠిరునికి ఉపదేశించిన ధర్మబోధలు, భాగవత పురాణంలో ప్రళయ దర్శన ఘట్టాలు, ఆయన తత్వదృష్టికి నిదర్శనాలు. విశ్వ వినాశన సమయంలోనూ జీవ సత్యం ఎలా కొనసాగుతుందో ఆయన అనుభవాల ద్వారా పురాణాలు వివరిస్తాయి. మాఘ శుద్ధ తృతీయ నాడు మార్కండేయ జయంతిని అనేక ప్రాంతాల్లో శివారాధనతో జరుపుకుంటారు. శివాలయాల్లో రుద్రాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, మహామృత్యుంజయ హోమాలు నిర్వహించడం సంప్రదాయం. ఆయుష్షు వృద్ధి, వ్యాధి నివారణ, కుటుంబ శ్రేయస్సు కోసం భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారు. ఈ ఆచారాల వెనుక ఉన్న భావం భయ నివారణ, ఆత్మబల వికాసం. శరీరానికి మందులు అవసరమైనట్లే, మనసుకు విశ్వాసం అవసరమన్న సత్యాన్ని ఈ జయంతి గుర్తుచేస్తుంది. మార్కండేయ జయంతి యొక్క తాత్విక సందేశం నేటి సమాజానికి మరింత ప్రాసంగికం. వేగవంతమైన జీవన శైలి, అనిశ్చిత భవిష్యత్తు, వ్యాధులు, మానసిక ఒత్తిళ్లు మానవుణ్ని భయగ్రస్తుడ్ని చేస్తున్న వేళ, భక్తి ఒక పారాయణం కాదు అది జీవన ధైర్యమని మార్కండేయుడి జీవితం చాటి చెబుతుంది. మృత్యువు అనివార్యమైనప్పటికీ, మృత్యుభయానికి లోనుకాకుండా జీవించవచ్చని, ధర్మం--నమ్మకం--తపస్సు కలిసినప్పుడు మానవుడు అంతర్గతంగా చిరంజీవి అవుతాడని ఈ జయంతి బోధిస్తుంది. ఈ విధంగా మాఘ శుద్ధ తృతీయ మార్కండేయ జయంతి ఒక పురాణ స్మరణ మాత్రమే కాదు మానవ జీవితానికి దారిదీపంగా నిలిచే ఆధ్యాత్మిక చైతన్య దినం. ఆయుష్షు కన్నా ఆశయం గొప్పదని, భయం కన్నా భక్తి బలమైనదని, శరీరం నశించినా సత్యాన్వేషణ నిత్యమని మార్కండేయ మహర్షి జీవితం శాశ్వతంగా మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అసమాన నృత్య కళాకారిణి మృణాళిని - జనవరి 21... మృణాళిని సారాభాయ్ వర్ధంతి



ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత మృణా ళినీ సారాభాయ్ పేరు శాస్త్రీయ నృత్య రంగంలో ఎరుగని వారు అరుదు. శాంతినికేతన్లో గురు రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గర విద్యా భ్యాసం చేసిన మృణాళిని భరత నాట్యం, మోహినీ యాట్టం, కథాకళి నాట్య రీతులలో శిక్షణ పొందారు. నాట్యకారిణిగానే కాదు, కవయిత్రిగా, రచయితగా, నృత్య దర్శకురాలిగా ఆమె ఖ్యాతి పొందారు. మృణాళినికి భరతనాట్యం పంచ ప్రాణం. నాట్యమే సర్వస్వం. నాట్యం కోసం జీవితంలో అసలు పెళ్లే చేసుకో కూడదని అను కున్నారు. ఆమె కుటుంబానికి సన్నిహితులైన పరమాణు శాస్త్ర వేత్త హోమీ జహంగీర్ భాభానే ... మరో శాస్త్రవేత్త విక్రమ్ సారా భాయ్?ని మృణాళినికి పరిచయం చేశారు. విక్రమ్ ఆమెను కలిసిన తర్వాత ఆమె కూడా మారారు. తర్వాత... మృణాళిని విక్రమ్ పెళ్లి చేసుకున్నారు. మృణాళిని సారాభాయ్ (1918 మే 11 - 2016 జనవరి 21) భార తీయ సాంప్రదాయ నృత్య కళా కారిణి, నృత్య దర్శకురాలు, నృత్య గురువు. ఆమె "దర్పణ అకాడమీ ఆఫ్ పెర్?ఫార్మింగ్ ఆర్ట్స్"కు వ్యవ స్థాపకురాలు. అహ్మదాబాదు లోని ఈ సంస్థలో నృత్య రీతులు, నాట కాలు, సంగీతం, తోలుబొమ్మ పాటలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఆమె 18,000 మంది శిష్యులకు భరత నాట్యం, కథాకళిలలో శిక్షణ ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు. మృణాళిని కేరళ లోని మాజీ పార్లమెంట్ సభ్యులు, సామాజిక కార్యకర్త అయిన అమ్ము స్వామి నాథన్ కుమార్తె. ఆమె బాల్యం స్విడ్జర్లాండ్ లో గడిచింది. ఆమె "డాల్?క్రోజ్" పాఠశాలలో తొలి పాఠాలుగా పశ్చిమాది నృత్య భంగిమలను నేర్చుకున్నారు...ఆమె శాంతి నికేతన్?లో రవీంద్ర నాథ్ ఠాగూర్ మార్గదర్శకత్వంలో విద్యా భ్యాసం చేశారు. అక్కడ జీవిత యదార్థాలను గ్రహించే అవకాశాలు కలిగాయి. తర్వాత ఆమె కొంత కాలం అమెరికా సంయుక్త రాష్ట్రా లకు వెళ్ళి... అమెరికన్ అకాడమీ ఆఫ్ ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషన లాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా/డ్రామాటిక్ ఆర్ట్స్ లో చేరారు. తర్వాత భారత దేశానికి వచ్చి ఆమె దక్షిణాది సాంప్రదాయక నృత్యం అయిన భరత నాట్యాన్ని "మీనాక్షి సుందరంపిళ్ళై" ద్వారా, కథాకళి నృత్యాన్ని "తకఘి కుంచు కురూప్" ద్వారా శిక్షణ పొందారు. మృణాళిని 1948 లో దర్పణ అనే సంస్థను స్థాపించారు. ఒక సంవత్స రం తరువాత పారిస్? లో "థియేటర్ నేషనల్ డి చైల్లోట్" లో ప్రదర్శన ఇచ్చారు. మృణాళిని సుమారు మూడు వందలకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఆమె అనేక నవలలు, కవితలు, నాట కాలు, కథలు పిల్లల కోసం రచించారు. ఆమె గుజరాత్ రాష్ట్ర హాండీక్రాఫ్ట్స్ అండ్ హాండ్ లూం డెవలప్ మెంట్ సంస్థకు చైర్?పర్సన్ గా, గాంధీ ఆశయాల ప్రోత్సాహం కోసం యేర్పడిన, సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్ కు ఆమె ఒక ట్రస్టీగా కూడా ఉన్నారు. మృణాళిని సారాభాయ్ 1965లో పద్మశ్రీ, 1992 లో భారతదేశ విశిష్ట పురస్కారం పద్మభూషణ అవార్డు ను అందుకున్నారు. 1997 లో యు.కె లోని న్యూయాచ్ కు చెందిన అంగిలియా విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేష నలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా, మెడల్ అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1990 లో పారిస్ లోని ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ లో ఎగ్జిక్యూటివ్ కమిటీలో నామినేట్ చేయ బడ్డారు. 1994 లో న్యూఢిల్లీ లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మెక్సికో ప్రభుత్వం నుండి బంగారు పతకాన్ని పొందారు. సాంప్రదాయిక నృత్య రంగంలో "మృణాళినీ సారాభాయ్ అవార్డ్ ఫర్ క్లాసికల్ ఎక్స్?లెన్స్" అవార్డును ప్రకటించింది. 2013లో కేరళ ప్రభుత్వ వార్షిక పురస్కారమైన నిషాగంధి పురస్కారానికి ఆమె మొదటి గ్రహీత. మృణాళిని కుటుంబీకులు పేరు మోసిన వారు కావడం విశేషం. ఆమె తండ్రి డా.స్వామినాథన్ మద్రాసు హైకోర్టులో పేరు పొందిన బారిష్టరు. మద్రాసు లా కాలేజీలో ప్రిన్సిపాల్?గా పని చేశారు. అమె తల్లి అమ్ము స్వామినాథన్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు. మాజీ ఎం.పీ. మృణాళిని సోదరి డా. లక్ష్మీ సెహగల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ లోని "రాణి ఆఫ్ ఝాన్సి రెజిమెంట్" విభాగానికి కమాండర్ గా ఉండేది. ఆమె సోదరుడు "గోవింద స్వామినాథన్" మద్రాసు హైకోర్టులో పేరుమోసిన న్యాయవాది. ఆయన మద్రాసు రాష్ట్ర (తమిళనాడు) కు అటార్నీ జనరల్ బాధ్యతలు కూడా నిర్వహించారు. మృణాళిని భర్త భారతీయ భౌతిక శాస్త్రవేత్త విక్రం సారాభాయ్? కాగా, భారతీయ అంతరిక్ష కార్యక్రమ పిత విక్రం సారాభాయ్ తన భార్యకు తన కెరీర్ ను పెంపొందించు కునేందుకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. వారికి ఒక కుమారుడు కార్తికేయ సారాభాయ్, ఒక కుమార్తె మల్లికా సారాభాయ్ ఉన్నారు. కుమార్తె మల్లిక కూడా నృత్య కళాకారిణియే. మృణాళిని అహ్మదాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2016, జనవరి 21న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# హాస్య రస ప్రధాన చిత్ర దర్శకుడు ఇ.వి.వి - జనవరి 21...ఇ.వి.వి సత్యనారాయణ వర్ధంతి



టాలీవుడ్?లో అత్యంత విజయవంతమైన దర్శకుడిగా ఇ.వి.వి సత్యనారాయణ నిలిచాడు. అతను 80 మరియు 90 లలో చాలా సూపర్ హిట్స్ ఇచ్చాడు. రాఘవేంద్ర రావు సీనియర్ దర్శకునిగా దూసుకుపోతున్న రోజుల్లో ఆయనకు గట్టి పోటీ ఇచ్చి అంతకు మించిన హిట్లు అందుకున్నాడు ఇ.వి.వి.. రాఘవేంద్ర రావు స్టార్ హీరోలతో సినిమాలు తీస్తే, ఇ.వి.వి. చిన్న హీరోలు, మధ్యస్థ హీరోలతో తీసి, హిట్లు, సూపర్ హిట్లు సాధించాడు. అలా 70 కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ హిట్?లతో కె రాఘవేంద్రరావుకు గట్టి పోటీ ఇచ్చారు. ఆయన సినిమాల్లో కామెడీకి పెద్ద పీట వేసేవారు. అప్పట్లో చాలా బాధగా ఉంటే.. మద్యం వదిలేసి ఇ.వి.వి సినిమాలు చూడండి అంటూ జోకులు కూడా వేసుకునే వారట. ఆయన సినిమాల్లో నాన్ స్టాప్ కామెడీ ఉండేది. ఇప్పటికీ ఇ.వి.వి సినిమాలు చూసి ఎంజాయ్ చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. అయితే తొలుత ఇ.వి.వి తన మొదటి సినిమా ఇ.వి.వి రాజేంద్ర ప్రసాద్ ను హీరోగా పెట్టి తీసిన చెవిలో పువ్వు చిత్రం పెద్ద ఫ్లాప్ అయ్యింది. ఫ్లాప్ అయ్యిందనొ గోదావరిలో దూకి చావాలని అనుకున్నారట. ఓ సారి రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ అఘాయిత్యానికి పాల్పడడం అనుకుని.. మళ్ళీ తన పిల్లలు, భార్య గుర్తొచ్చి ఆగిపోయారట. తరువాత ఆయన ప్రతిభను గుర్తించిన నిర్మాత రామానాయుడు 'ప్రేమఖైది' అనే చిత్రం చేసే అవకాశం కల్పించారు. అది పెద్ద హిట్ అయ్యింది. దీంతో వరుస అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయొ అంటూ ఆయన చిన్న కొడుకు అల్లరి నరేష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పడం జరిగింది. ఇ.వి.విగా ప్రసిద్ధిచెందిన ఈదర వీర వెంకట సత్యనారాయణ (జూన్ 10, 1958 - జనవరి 21, 2011) తెలుగు సినిమా దర్శకుడు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించిన దర్శకుడు. జంధ్యాల శిష్యుడు. జంధ్యాల ఒరవడిలో హాస్యప్రధాన చిత్రాలు నిర్మించాడు. జంధ్యాల కంటే కొంతఘాటైన హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశ పెట్టాడు. రాజేంద్ర ప్రసాద్ తో ఆ ఒక్కటి అడక్కు, అప్పుల అప్పారావు, ఆలీబాబా అరడజనుదొంగలు వంటి చిత్రాలు, నరేష్తో జంబలకిడి పంబ మొదలైన చిత్రాలు తీశాడు. సీతారత్నంగారి అబ్బాయి, ఏవండీ ఆవిడ వచ్చింది (శోభన్ బాబు) లాంటి చిత్రాల తర్వాత ఆమె, తాళి వంటి మహిళాపరమైన చిత్రాలు తీశాడు. అగ్రనటులైన చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ లతో చిత్రాలు తీశాడు. తర్వాత కుమారులిద్దర్ని హీరోలుగా పరిచయం చేశాడు. సత్యనారాయణ పశ్చిమ గోదావరి జిల్లాలోని దొమ్మేరులో వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. నాన్న వెంకటరావు, అమ్మ వెంకటరత్నం. ఆయన కుటుంబానికి దొమ్మేరులో 70 ఎకరాల పొలం ఉండేది. బాల్యం నుండి సినిమాలంటే ఆసక్తితో కనీసం వారానికి రెండు సినిమాలైన చూసేవాడు. ఇంటర్మీడియట్ వరకు బుద్ధిగానే చదివినా, ఇంటర్?కు నిడుదవోలు వెళ్ళిన సత్యనారాయణ కాలేజికి వెళ్ళకుండా రోజూ ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట సినిమాలను చూడటం ఎక్కువై, హాజరు తక్కువై ఇంటర్మీయడ్ తప్పాడు. అప్పుడు సత్యనారాయణ తండ్రి ఆయన ను కాలేజీకి పంపించి లాభం లేదని నిశ్చయించి తండ్రితో పాటు పొలం పనులు చూసుకోవటానికి నియమించాడు. 19 యేళ్ళకే 1976లో సరస్వతి కుమారితో పెళ్ళైంది. తర్వాత ఇద్దరు కొడుకులు పుట్టారు. వారికి రాజేష్, నరేష్ అని పేరు పెట్టారు. కొన్నాళ్ళకు వ్యవసాయంలో పెద్ద నష్టాలు రావడంతో పొలాలు అమ్మేయ వలసిన పరిస్థితి కలిగింది. ఆ పరిస్థితుల్లో అక్కడ ఉండటానికి సత్యనారాయణ ఇబ్బంది పడి ఎక్కడికైనా మరో ఊరికి వెళ్ళిపోవాలను కున్నాడు. ఇ.వి.వి స్నేహితుడు నిర్మాత నవతా కృష్ణంరాజు మేనల్లుడైన సుబ్బరాజును సంప్రదించి ఒక సిఫారుసు ఉత్తరం పట్టుకుని మొదటిసారి మద్రాసు వెళ్ళాడు. నవతా కృష్ణంరాజును కలిసి ఉత్తరం ఇవ్వగా ఆయన సినీరంగంలో జీవితం అనుకున్నంత సులభం కాదని, తిరిగి సొంత ఊరికి వెళ్ళిపొమ్మని హితవు చెప్పాడు. దాంతో పూర్తిగా నిరాశచెందిన సత్యనారాయణ, తిరిగి వెళ్ళినా చేసేదేమీ లేదనుకుని మద్రాసులోనే ఉండి వివిధ ప్రదేశాలు తిరుగు తుండేవాడు. పాండీ బజారుకు వెళ్ళి అక్కడ సహాయ దర్శకులు చెప్పుకునే మాటలు వినేవాడు. ప్రతి ఉదయం నవత కృష్ణంరాజు కార్యాలయం గేటు వద్ద నుంచుని ఉండేవాడు. ఒక నెలరోజుల తర్వాత కుర్రవాని పట్టుదలను చూసి ఏం చెయ్యగలవు అని అడిగాడు. సహాయ దర్శకున్ని అవుతానని చెప్పిన ఇ.వి.విని కనకాల దేవదాసు క్రింద ఓ ఇంటి భాగోతం సినిమాకు సహాయ దర్శకునిగా అవకాశం కల్పించాడు. రంభ, రచన, ఊహ, రవళి నటీమణులను తెలుగు చిత్ర సీమకు అయన పరిచయం చేశాడు. చెవిలో పువ్వు (1990), ప్రేమ ఖైదీ (1991), అప్పుల అప్పారావు (1991), సీతారత్నం గారి అబ్బాయి (1992), 420 (1992), జంబలకడిపంబ (1992), ఏవండీ ఆవిడ వచ్చింది (1993), వారసుడు (1993), ఆ ఒక్కటీ అడక్కు (1993), అబ్బాయి గారు (1993), ఆలీబాబా అరడజను దొంగలు (1994), హలో బ్రదర్ (1994), మగ రాయుడు (1994), ఆమె (1994), అల్లుడా మజాకా (1995), ఆయనకి ఇద్దరు (1995), తెలుగు వీర లేవరా (1995), ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు (1996), అదిరింది అల్లుడు (1996), అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (1996), చిలక్కొట్టుడు (1996), వీడెవడండీ బాబు (1997), నేను ప్రేమిస్తున్నాను (1997), తాళి (1997), మా నాన్నకి పెళ్ళి (1997), ఆవిడా మా ఆవిడే (1998), మావిడాకులు (1998), కన్యాదానం (1998), నేటి గాంధీ (1999), సూర్యవంశం (1999), పిల్ల నచ్చింది (1999), చాలా బాగుంది (2000), గొప్పింటి అల్లుడు (2000), అమ్మో ఒకటో తారీఖు (2001), మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది (2001), థాంక్యూ సుబ్బారావ్ (2001), వీడెక్కడి మొగుడండి (2001), హాయ్ (2002), తొట్టిగ్యాంగ్ (2002), ఆడంతే అదోటైపు (2003), మా అల్లుడు వెరీగుడ్డు (2003), ఆరుగురు పతివ్రతలు (2004), ఎవడి గోల వాడిది (2005), నువ్వంటే నాకిష్టం (2005), కితకితలు (2006), అత్తిలి సత్తిబాబు ఎల్ కెజి (2007), పెళ్ళైంది కానీ... (2007), ఫిట్టింగ్ మాస్టర్ (2009), బెండు అప్పారావ్ ఆరచవతీతీచంపి (2009), బురిడి (2010), కత్తి కాంతారావు (2010) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## చివరి దశకు పత్తి కొనుగోళ్లు

జమ్మికుంట : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పత్తి విక్రయాలు చివరి దశకు చేరుకున్నాయి. రోజు వారీ ధరల వ్యత్యాసాలతో రైతులు పత్తిని విక్రయించేందుకు సీజన్ మొదటి నుంచి చివరి దాకా నిరీక్షించారు. ఉమ్మడి జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసుకొని పత్తిని మద్దతు ధరకు ఖరీదు చేసింది. నిబంధనలు, కపాస్ కిసాన్‌యాప్ ద్వారా స్లాట్ బుకింగ్‌లో మొదట్లో రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. అవసరమైన పత్రాలు, నిబంధనలు పాటిస్తూ అధిక శాతం రైతులు సీసీఐకే పత్తిని విక్రయించారు.

**సిరిసిల్లలోనే అధికం**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,63,030 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. 19,56,360 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేశారు. కరీంనగర్ జిల్లాలో 44,875 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 5.38 లక్షల క్వింటాళ్లు దిగుబడి



అంచనా వేశారు. 14,958.51 మెట్రిక్ టన్నులు సీసీఐ కొనుగోలు చేసింది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్‌లోనే సీసీఐ రూ.118.87 కోట్ల విలువ చేసే అత్యధిక పత్తిని కొనుగోలు చేసింది.

**తగ్గిన పత్తి విక్రయాలు**

గత ఏడాది అక్టోబరు నుంచే పత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. జమ్మికుంట మార్కెట్‌కి 15 రోజులుగా 20 ట్రాలీల పత్తి కూడా రావటం లేదు. క్రమేణా విక్రయాలు పడిపోయాయి. మరో నెల రోజులు వ్యాపారం సాగవచ్చని వ్యాపారులు అంటున్నారు. జిన్నింగ్ చేసిన దూది బేళ్లను తమిళనాడుకు వ్యాపారులు తరలిస్తున్నారు. సీసీఐ నోటిఫై చేసుకున్న మిల్లుల నుంచి బేళ్లను సంబంధిత గిడ్డంగులున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో కేవలం 450 బేళ్లను విక్రయానికి తరలించినట్లు ఓ జిన్నింగ్ వ్యాపారి తెలిపారు.

## స్త్రీనిధి బకాయిలపై నజర్

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పంపిణీ చేస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా తీసుకున్న రుణాల చెల్లింపునకు పలు సంఘాలు మొండికేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రుణ బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. మొండికేసిన బకాయిదారులపై రెవెన్యూ రికవరీ చట్టం(ఆర్ఆర్) అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘాల్లోని మహిళల ఆస్తులు జప్తు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కొత్త చట్టంతో బకాయిలు వసూలయ్యే అవకాశం ఉంది.

**ఏటా రూ.70 కోట్ల రుణాలు**

ప్రైవేటు ఆగడాలను నుంచి రక్షించేందుకు స్త్రీనిధి రుణాలు మహిళలకు ఆర్థిక బాసటగా నిలుస్తున్నాయి. ఈ పథకంలో మహిళలకు అయిదు రకాల రుణాలు అందిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మెప్మా, గ్రామీణంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏటా రూ.70 కోట్ల రుణాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది మెప్మా ద్వారా రూ.18.43 కోట్లు లక్ష్యంగా ఉండగా ఇప్పటి వరకు రూ.18.48 కోట్లు పంపిణీ చేశారు. సెర్ప్ రూ.51.56 కోట్లకు రూ.44.08 కోట్లు పంపిణీ చేశారు. జిల్లాలో 10 వేల సంఘాల్లో లక్షకుపైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు

**రూ.8.89 కోట్లు..**

రుణాలు చెల్లించేందుకు విముఖత చూపడంతో మొండి బకాయిలు (నాన్ ఫర్ఫార్మెన్స్ అసెట్స్) సంఖ్య ఏటా పెరుగుతోంది. వీటిని



రాబట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సంఘాల్లోని సభ్యులకు ముందుగా నోటీసులు జారీ చేస్తున్నారు. సెర్ప్ ఏపీలు, డీపీఎలు, స్త్రీనిధి సిబ్బంది గ్రామైఖ్య సంఘాల్లోని మహిళలకు రుణాల వసూళ్లపై అవగాహన కల్పిస్తున్నారు. రుణాలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేయనున్నామని వివరిస్తున్నారు. జిల్లాలో మెప్మాలో రూ.11.16 కోట్లకు రూ.10.45 కోట్లు, సెర్ప్ రూ.25.99 కోట్లకు రూ.18.06 కోట్ల వసూళ్లు అయ్యాయి. జిల్లావ్యాప్తంగా రూ.37.16 కోట్లకు రూ.28.51 కోట్లు వసూలుకాగా రూ.8.89 కోట్ల బకాయిలు ఉన్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

స్త్రీనిధి రుణాల రికవరీ చట్టంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. బకాయిలు చెల్లించేలా ప్రోత్సహిస్తున్నాం. వాయిదా పద్ధతిలో చెల్లిస్తే బకాయిలు తగ్గనున్నాయి. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## స్కూల్ కాంప్లెక్స్‌లకు ఊతం

రాజపేట : స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారంతో పాటు, రిపోర్టులు, కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించాలంటే పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులు ఇప్పటి వరకు ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా ప్రైవేటు నెట్ సెంటర్ల చుట్టూ తిరిగి నివేదికలు, వేతన బిల్లులు చేయించాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. తమ పాఠశాల నుంచే త్వరితగతిన నివేదికలు పంపించనున్నారు. ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ ద్వారా జిల్లాలోని ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్, ప్రింటర్ అందించింది. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సాంకేతికంగా వెసులుబాటు కలిగింది.

**తొలగనున్న ఇబ్బందులు..** కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను పరిశీలించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల బోధన విధానం, పాఠ్యప్రణాళిక రాస్తున్నారా? బోధనోపకరణాలు వాడుతున్నారా? తదితర పలు అంశాలు పరిశీలిస్తారు. పాఠశాలల సముదాయ సమావేశ వివరాలతో పాటు వాటి నిర్వహణ, యూడైస్, లిప్, విద్యాసంబంధ కార్యకలాపాల నిర్వహణ పూర్తి వివరాల నివేదికను ఉన్నతాధికారులకు తరచూ పంపాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్, ప్రింటర్ అందుబాటులోకి రావడంతో వారికి ఆ ఇబ్బంది తొలగనుందని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి.

ఉమ్మడి జిల్లా స్కూల్ కాంప్లెక్స్‌ల వివరాలు.. నల్గొండ : 100
సూర్యాపేట : 64 యాదాద్రి : 50

## గ్రామసింహాల గాండ్రింపు.. ఏదీ తరలింపు?



హైదరాబాద్: వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలపై కుక్క కాటు ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అయినా జీహెచ్ఎంసీ స్పందించడం లేదు. మొక్కుబడి చర్యలు, కాకి లెక్కలతో కాలం గడుపుతోంది. రద్దీ ప్రాంతాల్లోని శునకాలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలని సుప్రీంకోర్టు మూడు నెలల కిందట ఆదేశించినా.. బల్దియా అధికారులు కేవలం 2,700 వీధి కుక్కలను మాత్రమే పట్టుకొని సంరక్షణ కేంద్రాలకు తరలించినట్లు చెబుతున్నారు.

**ఇప్పుడు 8 లక్షలు..**

పాత జీహెచ్ఎంసీ పరిధిలో 4.5 లక్షల వీధి శునకాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఓఆర్ఆర్ వరకు విస్తరించడంతో 8 లక్షల వరకు ఉంటాయని అంచనా. ఇలాంటి పరిస్థితుల్లో.. కనీసం లక్ష శునకాలకైనా మెరుగైన వసతులతో ఆశ్రయం కల్పించే సంరక్షణ కేంద్రాలు అవసరం. పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఐదు జంతు సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 2,500 శునకాలకు మాత్రమే వసతి సదుపాయం ఉంది. మరోవైపు కుక్కలను తరలించే చర్యలను పలు స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవో) అడ్డుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. కొత్త సంరక్షణ కేంద్రాలకు జోన్ల వారీగా స్థలాలను ఎంపిక చేయాలని గ్రేటర్ కమిషనర్ కర్ణన్ ఆరుగురు జడ్సీలను ఆదేశించగా.. కేవలం ఇద్దరు మాత్రమే స్థలాలను ఎంపిక చేశారు.

**కోర్టుకు చేరిన వీడియోలు..**

సుప్రీంకోర్టు ఆదేశాలంటూ జీహెచ్ఎంసీ వీధి కుక్కలను చంపుతోందని పలు ఎన్జీవోలు ఇప్పటికే కోర్టులను ఆశ్రయించాయి. తాజాగా ఓ స్వచ్ఛంద సంస్థ అంబర్‌పేట జంతు సంరక్షణ కేంద్రంలోని కళేబరాల వీడియోలను న్యాయస్థానానికి అందజేసింది. ఆ వీడియోలపై అధికారులు విచారణ జరిపారు. ఎన్జీవోల నుంచి డబ్బు తీసుకుని, తప్పుడు వీడియోలను వ్యాప్తి చేశారనే కారణంతో సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

## ఇసుక తరలుతోంది.. నీరు చేరనంది



రామడుగు: రామడుగు మండలంలోని మోతెవాగు ఇసుక అక్రమ రవాణాతో ఖాళీ అవుతోంది. పగటి వేళ నిఘా పెడుతున్నారని అక్రమ రవాణాదారులు రాత్రి దందా నడిపిస్తున్నారు. రామడుగు, షానగర్, కోరిటపల్లి, గోలిరామయ్యపల్లి, మోతె, రుద్రారం, కొక్కెరకుంట, వన్నారం గ్రామాలగుండా ఉన్న మోతె వాగులో ఇప్పటికే నాణ్యమైన ఇసుక ఖాళీ అయింది. నిత్యం వందలాది ట్రాక్టర్లలో అందినంత ఇసుక తవ్వుకోవడంతో మోతె వాగు గోతులను తలపిస్తోంది.

ప్రధానంగా రామడుగు, కోరిటపల్లి, గోలిరామయ్యపల్లి, రుద్రారం, వన్నారం గ్రామాల నుంచి కరీంనగర్‌తోపాటు సమీప మండలాలకు ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్లను అధికారులు పట్టుకోకుండా చరవాణిలో సమాచారాన్ని ముందస్తుగానే పంచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అడ్డగోలు ఇసుక తవ్వకాలతో భూగర్భ జలమట్టం తగ్గిపోతుందని ఆవేదన చెందుతున్నారు.

**భూగర్భ జలాల కొరతతో..**

2022లో వరదలతో మండలంలోని చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. ఎనిమిది గ్రామాల రైతులకు చెందిన సుమారు 80 ఎకరాల పంట భూమి కోతకు గురైంది. ఇప్పుడు మోతెవాగుకు ఆనుకుని వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాల కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

**'గుర్తింపు' ఉన్నవాటికే!**

ఇసుక అక్రమ రవాణా నిరోధించాలని అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసం 'గుర్తింపు' కలిగిన ట్రాక్టర్లకు అనుమతి లభిస్తుందనే విమర్శ ఉంది. సదరు గుర్తింపు కలిగిన ట్రాక్టర్లకు ఎక్కడా తనిఖీ బెడద ఉండకపోవడంతో అక్రమ రవాణా సాఫీగా సాగుతోందని ఆరోపణలున్నాయి.

**ఇందిరమ్మ ఇళ్ల టోకెన్ లేని వాటిపై చర్యలు**

రామడుగు మండలం మోతె వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్లకు టోకెన్ కలిగిన వారు, ప్రభుత్వ నిర్మాణాలకు అనుమతి కలిగిన వారికి మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతి ఉంది. మిగతా వారికి ఇసుక తరలించే అనుమతి లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం. – కె.రాజు, ఎస్సై, రామడుగు

## కార్చిచ్చుల నుంచి కాపాడేదెలా?



సారంగాపూర్ : నిధుల కేటాయింపులు లేకపోవడం అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అడ్డంకిగా మారింది. అటవీ సంరక్షణకు ఏటా వేసవికి ముందు ఫైర్‌లైన్లు(అగ్గిరేఖలు) ఏర్పాటు చేస్తుంటారు. రెండు, మూడేళ్లుగా పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవటంతో ఏటా వాటిని తగ్గిస్తూ వస్తున్నారు. జంతువుల దాహార్తి తీర్చటం కోసం గతంలో అడవుల్లో ఏర్పాటు చేసిన నీటి కుండీలతోనే సరిపెడుతున్నారు. వాటిలో పంచాయతీ ట్రాక్టర్ల సహాయంతో నీటిని నింపుతున్నారు.

**554.91 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం**

జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, రాయికల్, కొడిమ్యాల, మెట్‌పల్లి అటవీ రేంజ్‌లు ఉన్నాయి. ఆయా రేంజ్ పరిధిలో 554.91 చదరపు కిలోమీటర్ల పొడవున అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. రెండేళ్ల క్రితం వరకు జిల్లాలో దాదాపు 300 కిలోమీటర్ల వరకు అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసేవారు. టేకు వృక్షాలు ఉన్న ప్రాంతాల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే మళ్లీ ఆకులు రాలుతుండటంతో ఫైర్‌లైన్లు మళ్లీ ఏర్పాటు చేయాల్సి వచ్చేది. అయినా గతేడాది కేవలం 60 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్‌ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం నిధుల సమస్యతో ఒక్కసారి కూడా ఏర్పాటు చేయటం ఇబ్బందిగా మారింది. అడవుల అభివృద్ధికి కంపా, తదితర నిధులతో ఏటా రూ.3 కోట్ల వరకు వివిధ అభివృద్ధి పనులు చేసేవారు.. ప్రస్తుతం అవి కూడా నిలిచిపోయాయి.

**50 ఫైర్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

అయిదు రేంజ్‌ల పరిధిలో 50 కిలోమీటర్ల చొప్పున ఫైర్‌లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. రేంజ్‌కు ఒకటి లేదా రెండు అగ్గి ఆర్పే యంత్రాలు మాత్రమే ఉన్నాయి. ప్రమాదాలను నిలువరించటం కష్టంగా మారడంతో జిల్లాలోని 24 సెక్షన్లకు ఒకటి చొప్పున అందించాలని అధికారులు నివేదించారు. కొంతకాలంగా పలు సెక్షన్లలో బీట్ అధికారుల ఖాళీలు భర్తీకి నోచుకోవటం లేదు. ఒక్కో బీట్ అధికారికి రెండుమూడు సెక్షన్లు ఉండడంతో అడవుల సంరక్షణ ఇబ్బందిగా మారింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో అత్యధికంగా టేకు వృక్షాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆకులు రాలుతున్నాయి. ఎక్కడా కొద్దిగా నిప్పు పడినా అడవంతా బూడిదవుతుంది. ముందస్తు చర్యలు చేపట్టినప్పుడే అడవుల సంరక్షణ సాధ్యమవుతోంది.

**అవగాహన కల్పిస్తున్నాం**

అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామస్థులు, పశువుల కాపరులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. మంటలు అంటుకుంటే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. నిధుల సమస్యతో ఫైర్‌లైన్ల ఏర్పాటులో ఆలస్యం జరుగుతోంది. జిల్లాలో టేకు వృక్షాలు ఎక్కువగా ఉండటంతో ఆకులు రాలిపోయి వెంటనే మంటలు అంటుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక శాటిలైట్ నిఘా కేంద్రం ఏర్పాటు చేసి అడవుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. రవికుమార్, డిప్యూటీ రేంజర్

## పడకేసిన సుందరీకరణ.. రూ.కోటి చెరువుపాలు!

గోదావరిఖని : చెరువుల సుందరీకరణ పేరిట ప్రభుత్వం సుమారు తొమ్మిదేళ్ల కిందట రామగుండం నగరపాలక ప్రాంతంలో చేపట్టిన కార్యక్రమాన్ని నిధుల లేమితో నిలిపివేసింది. దీంతో అప్పటి వరకు వెచ్చించిన సుమారు రూ.కోటి నిధులు చెరువులో పోసినట్లయింది. వివిధ కారణాలతో అంచనాలను సుమారు సగం వరకు తగ్గించి మల్కాపూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టగా.. నిధులు సరిపోకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అభివృద్ధి పనులు పూర్తికాకపోవడం, పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో చెరువు శిఖం ఆక్రమణలకు గురవుతుండటంతో పాటు కట్ట పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మిషన్ కాకతీయ–2లో భాగంగా నగరంలోని మల్కాపూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా సుందరీకరించాలనే సంకల్పంతో రూ.1.97 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. వివిధ కారణాలతో కేవలం రూ.1.01 కోట్లు మాత్రమే కేటాయించి చెరువు అభివృద్ధి పనులకు 2017 ఫిబ్రవరి 4న శంకుస్థాపన చేశారు. నిధులు సుమారు సగానికి తగ్గించడంతో అభివృద్ధి పనులను అర్ధాంతరంగానే నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో అప్పటి వరకు చెరువు కట్ట అభివృద్ధి, బతుకమ్మఘాట్, మత్తడి పనులకు కేటాయించిన నిధులు వృథా అయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చెరువు మత్తడి నుంచి కట్ట మీదుగా శిఖం నుంచి తిరిగి మత్తడికి చేరుకునేలా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్స్, గ్రిల్స్, రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం కట్టపైన మట్టిపోసి వదిలేశారు. శిఖంలో కనీసం మట్టి రోడ్డు సైతం వేయకపోవడంతో ఆక్రమణలకు గురవుతోందనే



ఆరోపణలున్నాయి. కట్టపైన విద్యుత్తు దీపాలు, ఓపెన్ జిమ్, బెంచీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సప్తగిరి కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ నుంచి చెరువు కట్ట వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

చెరువు కట్టమీదుగా గోదావరిఖని ప్రశాంత్‌నగర్, సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు శ్రీనగర్ కాలనీ, మల్కాపూర్ వెళ్లేందుకు చాలా దగ్గరి దారి అయినప్పటికీ ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రామగుండం నగరపాలక ప్రాంత సుందరీకరణతో పాటు సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం మినీ ట్యాంకు బండ్ అభివృద్ధి పనులను పూర్తి చేసి నగర ప్రజలకు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


## ప్రయోగ పరీక్షలకు వేళాయె..!

నడిగూడెం : ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షల ముందు నిర్వహించే ప్రయోగ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 21 నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. 21న ప్రథమ, 22న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ చదువుతున్న జనరల్, వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్షలు రాయాలి.

ఆంగ్లం సబ్జెక్ట్ 100 మార్కుల పేపర్‌లో 20 మార్కులు ప్రయోగ పరీక్ష, 80 మార్కులు థియరీ పరీక్షకు కేటాయించారు. విద్యార్థులకు ఆంగ్లంపై భయం పోయేలా, సులభంగా మార్కులు పొందేలా రెండేళ్ల క్రితం నుంచి ఆంగ్ల ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయోగ పరీక్షకు సంబంధించిన రికార్డులు సైతం విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. 23న బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఎథిక్స్ పరీక్ష, 24న ప్రథమ సంవత్సరం జనరల్, వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులకు పర్యావరణ విద్యపై వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. 100 మార్కులకుగాను విద్యార్థులు 60 మార్కులు రాత పరీక్ష, 40 మార్కులకు రికార్డు, ప్రాజెక్ట్ పని సంబంధించిన నోట్సులను పరీక్ష కేంద్రంలో అప్పగించాలి. ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు క్వాలిఫై అయితేనే వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫలితం ప్రకటిస్తారు.

**ఫిబ్రవరి 2 నుంచి..**

జనరల్ కోర్సులు చదువుతున్న ద్వితీయ సంవత్సరం సైన్సు విద్యార్థులు, వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం వారికి ఫిబ్రవరి 2 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్‌బోర్డు షెడ్యూలు ప్రకటించింది. మూడు విడతలుగా పరీక్షలు నిర్వహించేం



దుకు సన్నాహాలు చేశారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల్లో పరీక్షలు జరుగుతాయి. వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. ఈసారి నిఘానీడలో ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు కసరత్తు చేసింది. ఈ మేరకు అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

**తప్పనిసరిగా హాజరు కావాలి: డి.విజయనాయక్, ప్రిన్సిపల్, కేఎల్ఎన్ ప్రభుత్వ కళాశాల**

ఆంగ్ల ప్రయోగ, పర్యావరణ విద్య పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ పరీక్షలు రాయకపోతే థియరీలో ఉత్తీర్ణులైనా ఫలితం వెలువడదు. ఇప్పటికే ఈ పరీక్షలకు సంబంధించిన రికార్డులను విద్యార్థులతో సంబంధిత అధ్యాపకుల పర్యవేక్షణలో సిద్ధం చేయాలని ఆదేశించాం. విద్యార్థులు సంసిద్ధంగా ఉండాలి.

# కూలీలు కావలెను!

నల్గొండ: యాసంగి సాగు జోరందుకున్న వేళ.. రైతులకు నాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. డిసెంబరు రెండోవారం నుంచి నారుమళ్లు చల్లుకున్న వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఒక్కరోజు ఒక్కో కూలీకి గరిష్ఠంగా రూ.800 వరకు చెల్లిస్తామని చెబుతున్నా.. దొరకని పరిస్థితి. ఒకవైపు నాగార్జునసాగర్, మూసీ, డిండి, ఎస్సారెస్పీ, ఇతరత్రా ప్రధాన జలాశయాలు, చెరువుల్లో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. బోర్ల నిండా నీటి లభ్యత ఉంది. ఎటొచ్చి కూలీల కొరతే వేధిస్తుండటంతో రైతులు నాట్లు వేసే ప్రక్రియను వాయిదా వేస్తున్నారు.
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.15 లక్షల మంది రైతులు 12 లక్షల ఎకరాల్లో వరి, 2 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. యాసంగిలో గరిష్ఠంగా 2.5 లక్షల మంది రైతులు 11 లక్షల వరకు వరి సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.
నల్గొండ, వేములపల్లి, నేరేడుచర్ల, కనగల్, హాలియా, రాజాపేట, ఆలేరు, గరిడేపల్లి, తుంగతుర్తి ప్రాంతాల్లో ఎకరానికి గరిష్ఠంగా రూ.6వేల వరకు చెల్లిస్తామని, నాట్లు వేయమని పిలిచినా కూలీలు దొరకడం



లేదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌తో పాటు ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చే ఒడిశా, రాజస్థాన్ కూలీలతో నాట్లు వేయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వారూ రానుపోను ప్రయాణ ఖర్చులు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.
ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు గంటకు రూ.1,800 వరకు వసూలు చేస్తున్నారు. ఎరువుల బస్తా రూ.1,450లకు, డీఏపీ, ఇతరత్రా కలుపు మందులు కలిపి మొత్తం రూ.1,900 వరకు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

**సాగు ఖర్చుల భయంతో ప్రకృతి వ్యవసాయం**

రావిరెడ్డి, రైతు, చందనసపల్లి
పెరిగిన సాగు పెట్టుబడి వ్యయంతో సేద్యం చేయడం ఇబ్బందికరంగా ఉంది. ఇతర రాష్ట్రాల కూలీలు కూడా సకాలంలో దొరకడం లేదు. సీజన్‌లో ఒక్కో కూలీకి రూ.800 వరకు ఇస్తామని చెప్పినా రావడం లేదు. ఎకరానికి రూ.6వేల వరకు ఖర్చవుతున్నాయి. యూరియా, పురుగు మందుల ఖర్చు భయంతో నాకున్న ఐదెకరాల పొలంలో కేవలం గోఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని కుటుంబంతోనే నాట్లు వేసుకుని సాగు చేసుకుంటున్నాం.

# అతివకు భరోసా

రాజపేట: అతివల భద్రతకు ప్రభుత్వం భరోసా కేంద్రాలు నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికల భద్రతకు జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్సీ) ఏర్పాటు చేయనున్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. తొలుత జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు మండలాలను ఎంపిక చేసి కార్యాచరణకు పూనుకుంది. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో పోలీస్, మహిళా, శిశు సంక్షేమ, ఇతర శాఖలు జెండర్ రిసోర్స్ కేంద్రాల నిర్వహణలో భాగస్వామ్యం కానున్నాయి.
**కార్యక్రమాలు ఇలా..** గ్రామస్థాయిలో ముగ్గురు, మండల స్థాయిలో ఐదుగురు సామాజిక కార్యాచరణ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రతి గురువారం జీఆర్సీ కేంద్రాల్లో కమిటీ సభ్యులు గృహహింస, లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, వరకట్న వేధింపులపై ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామస్థాయిలో సామాజిక ఆర్థిక సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. షీ టీం, సఖి, బాలిక సాధికారత



కేంద్రాల సేవలు వివరిస్తారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండాకే వివాహం, బాలికలందరినీ చదివించడం, అంటరానితనం నిర్మూలించడం అనే అంశాలపై సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తారు.
బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు అరికట్టడం, తక్షణ పోలీస్ సహాయం, లైంగిక దాడి బాధితులకు వైద్యం, న్యాయం, పోలీస్ సేవలను ఒకే చోట అందించనున్నారు.

బాధితులకు తక్షణ సాయం అందుతుంది
నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ
మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. జెండర్ రిసోర్స్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుంది. ముఖ్యంగా గృహహింస, లింగ వివక్ష, వేధింపులు, సామాజిక, ఆర్థిక సమస్యలకు సంబంధించి తక్షణ సాయం అందనుంది.

# కార్పొరేషన్‌లో ఖరారు!

నల్గొండ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పుర నుంచి మహానగరపాలక సంస్థగా ఆవిర్భవించిన తర్వాత మొదటిసారి ఎన్నికలు జరగనున్నాయి. డివిజన్ల రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు జనాభా సంఖ్య, బీసీలకు కుల గణనను పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్లను నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్లను కలెక్టర్ ఆధ్వర్యంలో డివిజన్ల వారీగా రిజర్వేషన్లు నిర్ణయించినట్లు తెలిసింది. రాజకీయపార్టీలు మహిళలకు దక్కాల్సిన డివిజన్లను లాటరీ పద్ధతిలో కేటాయించి అధికారికంగా విడుదల చేసే అవకాశముంది. తెలిసిన రిజర్వేషన్లు ఖరారు కానుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

# అక్రమాలు నిజమే.. కాదంటే గ్యాసే



మూసాపేట: చమురు సంస్థలు సరఫరా చేసే గ్యాస్ రెండు రకాలు. ఒకటి గృహ అవసరాలకు.. మరొకటి వాణిజ్య అవసరాలకు. దీన్ని ఎవరు అతిక్రమించినా చట్టరీత్యా బాధ్యులవుతారు. అయినా పలు గ్యాస్ సంస్థలకు చెందిన సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై వంటగ్యాస్ సిలిండర్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా సాగుతున్న ఈ వ్యవహారంలో తరచూ దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఆయా సందర్భాల్లో విలువైన ఆస్తినష్టంతో పాటు కొన్నిసార్లు ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి. ఈ నెల 13న కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, కేపీహెచ్‌బీకాలనీ మూడో ఫేజ్‌లో వేర్వేరుగా జరిగిన ఘటనల్లో భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఈ రెండు చోట్లా గ్యాస్ రీఫిల్లింగ్ చేసే క్రమంలో జరగడం గమనార్హం.

**డెలివరీ బాయ్స్ దందాతో.**

చమురు సంస్థలకు సంబంధించిన గ్యాస్ ఏజెన్సీల నుంచి గృహ అవసరాలు, వాణిజ్య విభాగం సిలిండర్లు బయటకు రావాలంటే డెలివరీ బాయ్స్ (సరఫరా సిబ్బంది)ది కీలకపాత్ర. తమ వద్దకు వచ్చే సిలిండర్లను వినియోగదారులకు అందించకుండా అక్రమదందాకు తెరలేపుతున్నారు. సాధారణంగా గ్యాస్ ఏజెన్సీల్లో 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండరుకు రూ.905లు తీసుకుంటారు. ఇందులోంచే డెలివరీ బాయ్స్‌కు రూ.18లు చెల్లిస్తారు. ఇది చాలదన్నట్లు వినియోగదారుల వద్దా వారు అదనంగా డబ్బులు తీసుకుంటుంటారు. ఇంకా ఒక్కో సిలిండరును రూ.1,500 నుంచి రూ.2 వేల దాకా హోటళ్లు, ఇతర వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమర్షియల్ సిలిండర్లను అందజేస్తోంది. 19 కిలోల సిలిండర్‌కు రూ.1,920లుగా నిర్ణయించారు. తక్కువధరకు వస్తున్నాయనే కారణంతో డెలివరీ బాయ్స్‌తో కుమ్మక్కవుతున్న కొందరు వ్యాపారులు గృహ అవసరాలకు వినియోగిస్తున్న సిలిండర్లను వాడుతున్నారు.

**కొంప ముంచుతున్న రీ ఫిల్లింగ్**

కొందరు దుకాణదారులు అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్‌కు పాల్పడుతున్నారు. డెలివరీ బాయ్స్ నుంచి కొనుగోలు సిలిండర్లలో ఒక్కో దాని నుంచి మూడు, నాలుగు చిన్న సిలిండర్లలోకి నింపి మార్కెట్‌లో రూ.500–రూ.750ల దాకా విక్రయిస్తున్నారు. తద్వారా వారికి రెండుమూడురెట్లకు పైగా ఆదాయం వస్తుంది. గ్యాస్ కనెక్షన్లు లేని నివాసితులు, పేదలు ఈ తరహా సిలిండర్లను నింపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు రీఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రశాంత్‌నగర్ ఘటనలో దుకాణంలో నిల్వ ఉంచిన 12 సిలిండర్లు బాంబుల తరహాలో వరుసగా పేలడం గమనార్హం.

# అనుమతుల్లో వేగం.. అభివృద్ధికి పునరుజ్జీవం



హైదరాబాద్: నగరంలో అభివృద్ధి పనులు పట్టాలెక్కే సమయం వచ్చింది. ఏళ్ల తరబడి భూసేకరణ వద్ద నిలిచిపోయిన రోడ్డు విస్తరణ, పైవంతెనల నిర్మాణ పనులు త్వరలో వేగం పుంజుకోనున్నాయి. మూసీ పునరుజ్జీవ పనులకూ మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ అనుమతుల నిబంధనలను సవరిస్తూ.. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్)కు డిమాండ్ పెంచుతూ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుతో.. ఆయా ప్రయోజనాలు కలగనున్నట్లు అధికార యంత్రాంగం ధీమా వ్యక్తం చేస్తోంది.
**నిధుల సమస్య నుంచి ఉపశమనం..** హెచ్–సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టదలచిన రోడ్డు విస్తరణ, పైవంతెనల నిర్మాణం కోసం, వ్యూహాత్మక నాలాల అభివృద్ధి (ఎస్ఎన్‌డీపీ) కింద వరద నాలాల విస్తరణ పనుల కోసం భూసేకరణ ప్రతిపాదనలూ సర్కారు వద్ద ఉన్నాయి. వాటన్నింటికీ కలిపి రూ.1000 కోట్ల నిధులు అవసరం. భూసేకరణకు నగదు రూపంలో కాకుండా, అభివృద్ధి బదలాయింపు హక్కు (టీడీఆర్) ద్వారా పరిహారం చెల్లించే విధానం గ్రేటర్‌లో అమలవుతోంది. ఉదాహరణకు కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ బ్రిడ్జీల నిర్మాణం, ఉప్పల్ కూడలిలో పైవంతెనల నిర్మాణం, తదితర ప్రాజెక్టులు భూసేకరణ సమస్య వల్ల ముందుకు సాగట్లేదు. ప్రభుత్వం టీడీఆర్‌కు డిమాండ్ పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో.. భూ యజమానులు టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా పరిహారం తీసుకునేందుకు ముందుకొస్తారని, తద్వారా పనులు ముందుకుసాగుతాయని జీహెచ్ఎంసీ అంచనా వేస్తోంది.
**మూసీ నదికి అస్త్రం..** మూసీ నదిని అభివృద్ధి చేయాలంటే దాదాపు 3వేల ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే.. నగరంలో టీడీఆర్ వినియోగానికి డిమాండ్ పెంచుతున్నామని, మూసీకి అవసరమైన భూసేకరణకు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ఈ నెల 14న జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రా, ఇతర శాఖల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.
**ప్రస్తుతం 300 ఎకరాలకుపైగా..** 300ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్లో ఉన్నాయి. ఐదేళ్ల కిందట టీడీఆర్ ధర కనిష్ఠంగా 18శాతానికి పడిపోయింది. ప్రస్తుతం 50శాతానికి పెరిగింది. సర్కారు తీసుకొచ్చిన కొత్త నిబంధనతో.. టీడీఆర్ ధర, వినియోగం పెరుగుతుందని నగర ప్రణాళిక విభాగం పేర్కొంటుంది.

# రోడ్డు వేస్తాం.. తవ్వేస్తాం



హైదరాబాద్: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఉప్పల్‌లోని సూర్యనగర్ కాలనీ. సరిగ్గా ఏడు నెలల కిందట కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు అదే రోడ్డును తవ్వుతున్నారు. ఇదేంటని అడిగితే.. పాత డ్రైనేజీ పైపులను తొలగించి.. కొత్తవి ఏర్పాటు చేస్తామని గుత్తేదారులు సమాధానమిస్తున్నారు. మురుగునీటి పైపులైను వేసి.. మొక్కుబడిగా సీసీ రోడ్డు వేస్తారు. రెండు నెలల్లో ఆ ప్రాంతం గుంతలుగామారుతుంది. మరో ఆర్నెల్లకు జీహెచ్ఎంసీ మళ్లీ రోడ్డు నిర్మిస్తుంది. ఇలా ప్రజా ధనాన్ని దోచేందుకు పలువురు ఇంజినీర్లు, గుత్తేదారులు కలిసి చేస్తోన్న దందా ఇది. ఒకే మ్యాన్‌హోల్, ఒకే రోడ్డుకు.. ఏడాది పొడవునా మరమ్మతులు చేస్తూ.. ఏటా రూ.200కోట్లకు పైగా నిధులను అవినీతి అధికారులు దారి మళ్లిస్తున్నారనే విమర్శలున్నాయి.
ముందస్తు వ్యూహమేనా? మేము రోడ్లు వేస్తుంటే జలమండలి అధికారులు తవ్వేస్తున్నారని జీహెచ్ఎంసీ ఇంజినీర్లు.. వాళ్లు సమాచారం ఇవ్వకుండా రోడ్లు వేస్తారని జలమండలి ఇంజినీర్లు పరస్పరం విమర్శలు చేసుకుంటుంటారు. కానీ.. సదరు అధికారులు ముందస్తు వ్యూహంలో భాగంగానే విమర్శలు చేసుకుంటారని.. జలమండలి ఆఫీసు సమీపంలోని రోడ్ల దుస్థితే అందుకు నిదర్శనమని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.
ఇవిగో ఉదాహరణలు..బంజారాహిల్స్ రోడ్డు నం.7లో గతేడాది మేలో జీహెచ్ఎంసీ రోడ్డును తవ్వింది. భూగర్భ నాలా పొడవునా సీసీ రోడ్డు నిర్మించింది. ఆ రోడ్డును జలమండలి అధికారులు ఇప్పుడు తవ్వుతున్నారు. అమీర్‌పేట్ ప్రధాన రహదారి నుంచి ఎల్లారెడ్డి గూడకు ఆర్నెల్ల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు.. ఆ రోడ్డులోని వరద నీటి మ్యాన్‌హోళ్ల మరమ్మతులకు రోడ్డును ఇష్టానుసారం తవ్వుతున్నారు.
అమీర్‌పేట్ ఎంసీహెచ్ మార్కెట్ రోడ్డును.. సగటున ఆర్నెల్లకోసారి నిర్మిస్తుంటారు. ఇప్పుడు నెల కిందట నిర్మించిన సీసీని కూడా తవ్వుతున్నారు. ఇలాంటివి నగరంలో అడుగడుగునా కనిపిస్తున్నాయి.

# రోగులు రెట్టింపు.. లేని పట్టింపు!

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లో స్థానికంగా ఉన్న ఏరియా ఆసుపత్రి అతిపెద్దది కావడంతో రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. సాధారణంగా ఓపీ 500 నుంచి 600 ఉండగా.. కొన్ని రోజుల్లో 800 నుంచి 1000 వరకు ఉంటుంది. దవాఖానాలో వైద్యులు రోగులకు రక్త, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ వంటివి రాసి పంపుతారు. పరీక్షలు చేయించుకొని ఫలితాలు తీసుకొచ్చిన రోగి వైద్యుల కోసం వెతకాల్సిన వస్తోంది. రక్త పరీక్షల ఫలితాలు వచ్చే



సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటుతుంది. అప్పటికే వైద్యులు సమయం ముగిసిందని వెళ్లిపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామాలకు వెళ్లి తిరిగి మరుసటి రోజు పరీక్ష ఫలితాలను తీసుకొని సంబంధిత వైద్యున్ని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొందరు రోగులు ఆ పరీక్ష ఫలితాలను తీసుకొని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి, జేబులు ఖాళీ చేసుకునే దుస్థితి నెలకొంది. పీహెచ్‌సీల్లో సరైన పరికరాలు, నిపుణులు అందుబాటులో లేకపోవడంతో డివిజన్ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు అగ్ని పరీక్షగా మారాయి. అధికారుల తీరు మారాలని రోగులు వాపోతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్‌ను వివరణ కోరగా.. రక్త పరీక్షలు ముగించుకొని రిపోర్టును తీసుకొచ్చిన రోగి అత్యవసర వార్డులో ఉన్న వైద్యున్ని సంప్రదించి, మందులను తీసుకోవాలని, అత్యవసర విభాగంలో వైద్యుడు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

# సెలవుల అదను.. అక్రమాలకు పదును

జిన్నారం: సంక్రాంతి పండగ సందర్భంగా వరుస సెలవులొచ్చాయి. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అక్రమార్కులు అదే అదనుగా భావించారు. ఏకంగా 50 వరకు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఐదారు రోజుల్లోనే ఇళ్లు వెలిశాయి. జిన్నారం మండలం ఖాజీపల్లి శివారు 174, 181 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న దందా ఇది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక నేతలు వీరికే వంత పాడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. తాజాగా ఖాజీచెరువు కట్టపైనా నిర్మాణాలు వెలుస్తున్నాయి.

**ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు**

ఖాజీపల్లి శివారులో 174, 181 సర్వే నంబరులోని సుమారు రెండు ఎకరాల గుట్టను కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో చదును చేస్తున్నారు. ఇందులో కొంత రెవెన్యూ స్థలం, మరికొంత నీటిపారుదల శాఖకు చెందిన శిఖం, అటవీశాఖ స్థలాలు ఉన్నాయి. ఈ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. ఇక్కడ చిన్న ప్లాట్లుగా చేసి విక్రయిస్తుండగా.. నిర్మాణాలు వెలుస్తున్నాయి. వాటికి వెంటనే ఇంటి నంబర్లు కేటాయిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పార్కు జాగా పరాధీనం**

ఖాజీపల్లి గ్రామానికి ప్రత్యేకంగా గుట్టపై స్థలంలో పార్కు నిర్మించి బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని గత పంచాయతీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. కొంత మేరకు పనులు చేపట్టారు. ఈ స్థలం ఇప్పుడు పరాధీనమవుతూ.. ఇళ్లు వెలుస్తున్నా.. అడ్డుకునే వారే కరవయ్యారు.

**సమస్య మా దృష్టికి వచ్చింది**

ఖాజీపల్లి శివారులో అక్రమ నిర్మాణాల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత కబ్జాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. వరుస సెలవుల నేపథ్యంలో కొందరు అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించినట్లు తెలిసింది. దేవదాసు, తహసీల్దార్, జిన్నారం

# ఖజానాకు కన్నం.. విచారణ వేగవంతం

సంగారెడ్డి: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సొమ్మును దారి మళ్లించిన ఘటనలు జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వెలుగుచూశాయి. ఈ తరహా అక్రమాలు ఉమ్మడి మెదక్ జిల్లాల్లోనూ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు సమగ్ర విచారణ చేస్తున్నారు. **ఎక్కడెక్కడ.. ఎలా..**
సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, కంది, సదాశివపేట, జిన్నారం మండలాల్లో జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ)లను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో నిర్దేశించిన మేర స్టాంపు డ్యూటీ (రుసుం) చెల్లించకుండా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.
ఎంత మేర ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారనే దానిపై ఆరా తీస్తున్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు జరిగిన జీపీఏల క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగినట్లుగా రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే కంది మండలంలో జరిగిన 86 జీపీఏలపై విచారణ ప్రారంభించి దస్త్రాలను పరిశీలిస్తున్నారు.
మండల రెవెన్యూ అధికారులు మాత్రం అన్నీ సక్రమంగానే ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. సీసీఎల్ఏ యంత్రాం గం మాత్రం నిర్దేశించిన మేర సొమ్ములు జమకాలేదని పేర్కొంటూ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.
రామచంద్రాపురం, గుమ్మడిదల మండలాల్లోనూ రిజిస్ట్రేషన్ రుసుంల చెల్లింపుల్లో కొంతమేర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలొస్తున్నాయి.

**అక్రమాల పాత్రధారులపై కూడా**

నాలుగు మండలాల్లో జీపీఏలను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో యజమానులు నిర్దేశిత రుసుం చెల్లించినప్పటికీ మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులు సాంకేతికత ఆధారంగా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు భావిస్తున్నారు. దీంతో అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

**తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ యంత్రాంగం ఆరా**

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2018 నుంచి జరిగిన భూముల లావాదేవీలకు సంబంధించిన దస్త్రాల పరిశీలన చేపట్టే కార్యక్రమాన్ని సీసీఎల్ఏ(భూ పరిపాలన కమిషన్) ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం చేపట్టింది. దీంతో గత వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో ఐదేళ్లుగా భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. జిన్నారం, గుమ్మడిదలతో పాటు అమీన్‌పూర్, రామచంద్రాపురం, సదాశివపేట మండలాల్లో ప్రభుత్వ భూములను సైతం బైనంబర్లతో రిజిస్ట్రేషన్లు పూర్తికానిచ్చినట్లు వెలుగులోకి వచ్చాయి. వీటికి సంబంధించి రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చురకలు



## నీటి'బొట్టు'... జల'సిరి'కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రైయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

# కన్నేసి.. కలిపేసి



హైదరాబాద్ :దుకాణ సముదాయాలకు కలిసొస్తుందని.. కొందరు అక్రమార్కులు దుండిగల్‌లో ఎస్టీ విద్యార్థులకు కేటాయించిన వసతిగృహ భూముల హద్దులు మార్చేశారు. రహదారికి సమీపంలో వాణిజ్య సముదాయాలుంటే కలిసొస్తుందన్న అంచనాతో ఎకరం భూమిని అక్రమించారు. కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది సాయంతో రోడ్డువైపున్న వసతిగృహం భూములు వెనక్కి జరిపారు. కొద్దిరోజుల క్రితం నాలుగు వైపులా ప్రహరీ నిర్మించారు. వారు కబ్జా చేసిన భూమి విలువ రూ.20 కోట్ల పైమాటే. ఎకరం స్థలంలో రోడ్డు వైపు 18 దుకాణాలు నిర్మించేందుకు వారు సన్నాహాలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భూమిలో గోడ నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**ఇలా తెలుసుకొని..**

గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ వైపు వెళ్లే మార్గంలో సర్వే నంబరు 120లో 158.23 ఎకరాల ప్రభుత్వ భూమిని దశాబ్దాల క్రితం మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధిత కుటుంబాలకు ఇచ్చారు. 91 ఎకరాలను పేదలకు ఇవ్వగా.. సాగుచేసుకోని కారణంగా 45 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో 2.25ఎకరాల భూమిని ఎస్టీ వసతి గృహం కోసం కేటాయించారు. నిధులు విడుదల కాకపోవడంతో స్థలం ఖాళీగా ఉంది. రోడ్డుకు సమీపంలో ఉండడంతో కొందరు కబ్జా చేసేందుకు నాలుగేళ్ల క్రితం ప్రయత్నాలు చేశారు. సాధ్యం కాకపోవడంతో రోడ్డుకు సమీపంలో నోటరీ పట్టాలున్న వ్యక్తులను కలిశారు. భూమిని ఇప్పిస్తామంటూ వారికి చెప్పారు. వారి స్థలాలను కొనుగోలు చేసినట్టు పత్రాలు సృష్టించారు. **అటూ.. ఇటూ మార్చారు..**

ఎస్టీ వసతి గృహానికి ప్రభుత్వం కేటాయించిన స్థలం రోడ్డువైపు ఉంది. రికార్డుల్లోనూ సర్వే నంబరు 120/11లో హద్దులు ఉన్నాయి. రోడ్డువైపు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రైవేటు వ్యక్తులు రెవెన్యూ అధికారులను సంప్రదించారు. హద్దులు మార్చితే ప్రతిఫలం ఇస్తామంటూ మాట్లాడుకున్నారు. నోటరీ దస్తావేజులున్న వారి అభ్యర్థన మేరకు కిందిస్థాయి రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది సర్వే చేశారు. భూమి హద్దులను గుట్టుచప్పుడు కాకుండా మార్చేశారు. రోడ్డు వైపున్న ఎకరం భూమిని తీసుకుని ప్రహరీ నిర్మించారు. ఎస్టీ సంక్షేమ అధికారులు వసతి గృహం నిర్మించేందుకు ముందుకొస్తే.. సర్వేనంబరు ప్రకారం 1.25 ఎకరాల భూమి మాత్రమే ఉంటుంది.

## ఇళ్లకు ఇసుక తిప్పలు

సూర్యాపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇసుక కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకం జిల్లాలో అమలు కావడం లేదు. లబ్ధిదారులకు సమాచారం అందించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.జిల్లాలో 8,112 మందికి ఇందిరమ్మ ప్రొసీడింగ్‌లు అందించగా.. ఇప్పటి వరకు 6,892 మంది ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిర్మాణం ప్రారంభించడంతో ఇసుక కూడా అంతే మొత్తం అవసరం పడుతోంది. వీరితో పాటు ఇతరులు కూడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. లబ్ధిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, దూరభారాన్నిబట్టి ట్రాక్టర్ ఇసుకకు రూ.6500 నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. మరీ అత్యవసరమైతే రూ.10 వేలు తీసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత తీర్చేందుకు మండలానికి ఓ ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. ఆ దిశగా అడుగులు పడటం లేదు. ప్రస్తుతం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి, నాగారం, టేకుమట్ల నుంచి సరఫరా అవుతోంది. మిగతా ప్రాంతాల్లో తక్కువ ధరకు సరఫరా చేస్తున్నా...గోడల నిర్మాణానికి అది ఉపయోగ పడటం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు.

సూర్యాపేటకు చెందిన ఓ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రెండు నెలల క్రితం ఇంటి పనులను మొదలుపెట్టగా ప్రస్తుతం గోడల



వరకు పూర్తయింది. ఇప్పటి వరకు ట్రాక్టరుతో అయిదు ట్రిప్పుల ఇసుకను తోలించాడు. మొదట్లో కొరత పేరుతో ట్రిప్పునకు రూ.8 వేలు వెచ్చించాడు. ప్రస్తుతం సులువుగా లభిస్తుండటంతో రూ.6 వేల చొప్పున తోలిస్తున్నాడు. ఇప్పటి వరకు ఇసుకకే రూ.40 వేలు ఖర్చు చేశాడు. నిరీ?త స్థలంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి 35 మెట్రిక్ టన్నుల ఇసుక పరిమాణం అవసరమని అధికారులు అంచనా వేశారు. అందుకోసం ఒక్కో ఇంటికి పునాది, పిల్లర్లు, స్లాబు, గోడల నిర్మాణ దశల్లో ఎనిమిది ట్రాక్టర్ల ఇసుక సరఫరా చేయాలని నిర?యించారు. రీచ్‌ల వద్ద సొసైటీలకు నిరీ?త రుసుము, కిలో మీటరుకు రూ.5 చొప్పున లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది. ఉచిత ఇసుక కోసం మన ఇసుక-మన వాహనం యాప్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేయడం లేదా గృహ నిర్మాణ శాఖ ఏఈలకు ఇండెంట్ ద్వారా నిరీ?త సమయంలో ఇసుక సరఫరా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇళ్ల మంజూరు : 8112

పనులు ప్రారంభం: 4273

పునాదుల దశలో: 1980

ప్రహరీ: 762

స్లాబు: 924

పూర్తయ్యింది: 154

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి , మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850

ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20

యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు

చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

# కొంత మార్పు.. కొత్త రూపు




హైదరాబాద్: బృహత్‌నగరం డివిజన్ల పునర్విభజన గురువారం అధికారికంగా పూర్తయింది. డివిజన్ల హద్దులు, పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడంతో.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ గురువారం తుది నోటిఫికేషన్ ఇచ్చారు. దాంతోపాటు.. జోన్లు, సర్కిళ్ల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేస్తూ.. 12 జోన్లు, 60 సర్కిళు, వాటి పరిధిలోని డివిజన్ల పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం జివో.ఎంఎస్.నెం.292ను విడుదల చేసింది. దాంతో.. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన డివిజన్ల పునర్విభజన, పరిపాలన సౌలభ్యం కోసం నూతన జోన్లు, సర్కిళ్ల ఏర్పాటు ప్రక్రియ అధికారికంగా పూర్తయినట్లయింది.

**మారిన పరిపాలన పటం**

పాత జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎల్బీనగర్, చార్మినార్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ పేర్లతో ఆరు జోన్లు ఉండగా.. పునర్విభజనలో పరిపాలన సౌలభ్యం కోసం.. కొత్తగా మల్కాజిగిరి, ఉప్పల్, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ, కుత్బుల్లాపూర్ జోన్లను ఏర్పాటు చేశారు. కొన్ని పాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పేర్లను మార్చి.. ఆయా స్థానిక సంస్థల పరిధిలో ఏర్పాటైన డివిజన్లను కొత్త సర్కిళ్లుగా ఏర్పాటు చేశారు. కొత్త జోన్లలో కనిష్ఠంగా 4 సర్కిళ్లు, గరిష్ఠంగా ఏడు సర్కిళ్లు ఉన్నాయి.

జడ్సీలు వచ్చేశారు..

డివిజన్ల పునర్విభజన, జోన్లు, సర్కిళ్ల పునర్ వ్యవస్థీకరణను ఎంత వేగంగా పూర్తి చేశారో.. అంతే వేగంగా కొత్త జోన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను జోనల్ కమిషనర్లు(జడ్సీ)గా నియమిస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

**యథాతథంగా పాలన**

కొత్త జోనల్ కమిషనర్లు వెంటనే బాధ్యతలు తీసుకుంటారని, పరిపాలన స్తంభించకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ 'ఈనాడు'తో తెలిపారు.

అభ్యంతరాలు పరిశీలించి

డివిజన్ల పునర్విభజనపై సుమారు రెండు వారాల పాటు జీహెచ్‌ఎంసీ అభ్యంతరాలు స్వీకరించింది. వాటిని పరిశీలించి.. పలు డివిజన్ల హద్దులు, పేర్లను సవరించింది.

ప్రస్తుత జీహెచ్‌ఎంసీ పరిధిలో పూర్తిగా, స్వల్పంగా భాగమైన జిల్లాలు 5, మండలాలు 47, గ్రామాలు 311, పార్లమెంటు స్థానాలు 6, అసెంబ్లీ స్థానాలు 28

పేరు మారిన డివిజన్లు: 30

హద్దులు మారినవి: 104

జోన్లవారీగా సర్కిళ్లు..

మల్కాజిగిరి: కీసర, అల్వాల్, బోయినపల్లి, మౌలాలి, మల్కాజిగిరి

ఉప్పల్: ఘట్‌కేసర్, కాప్రా, నాచారం, ఉప్పల్, బోడుప్పల్

ఎల్బీనగర్: నాగోల్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్

శంషాబాద్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్

చార్మినార్: సంతోష్‌నగర్, యాకుత్‌పుర, మలక్‌పేట్, చార్మినార్, మూసారాంబాగ్

గోల్కొండ: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్

ఖైరతాబాద్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్

సికింద్రాబాద్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

శేరిలింగంపల్లి: నార్సింగి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి

కూకట్‌పల్లి: మాదాపూర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్

కుత్బుల్లాపూర్: చింతల్, జీడిమెట్ల, కొంపల్లి, గాజులరామారం, నిజాంపేట్, దుండిగల్, మేడ్చల్

## వచ్చే సారథులు.. ఇదిగో వనరులు

రాజపేట : గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. మొదటి విడత ప్రచారం ముగియగా.. రెండు, మూడో విడతల్లో జరిగే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారం ముమ్మరం చేశారు. మరి కొద్ది రోజుల్లో పంచాయతీలకు నూతన పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. విజేతలైన వారికి పంచాయతీలకు అందుబాటులో ఉండే ఆర్థిక వనరులు ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండటం సహజం. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులే ప్రధానం. వీటితో పాటు సొంతంగా సేకరించే సాధారణ నిధులతో గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుంది.

**కేంద్ర ఆర్థిక సంఘం**

పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేస్తుంది. గ్రామ పంచాయతీలోని ఒక్కో వ్యక్తికి నెలకు రూ.80 నుంచి రూ.90 చొప్పున కేటాయిస్తుంది. ప్రతి మూడు మాసాలకు ఒకసారి, ఏడాదిలో నాలుగు విడతలుగా నిధులను అందజేస్తుంది.

**రాష్ట్ర ఆర్థిక సంఘం**

రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు సైతం క్రమం తప్పకుండా మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇవి కూడా పంచాయతీలోని జనాభా



ప్రాతిపదికన ఇస్తారు. కొన్నాళ్లుగా ఇవి విడుదల కావడం లేదు. దీనికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు, విద్యుత్తు బిల్లులు చెల్లిస్తుండటం గమనార్హం.

**ఉపాధిహామీ పథకం ద్వారా**

గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారు. కూలీలు చేసే పనులకు 60 శాతం, మరో 40 శాతం నిధులు మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరు చేస్తారు. వీటితో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఇంకుడుగుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

**సాధారణ నిధులు**

గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే వాటిని సాధారణ నిధులకింద గుర్తిస్తారు. ఈ నిధులు పెంచుకోవడానికి పంచాయతీలు ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాల్సి ఉంటుంది.

**జిల్లా సమాచారం..**

మొత్తం గ్రామ పంచాయతీలు : 427

వార్డుల సంఖ్య : 3704

మొత్తం ఓటర్లు : 5,32,240

మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాలు : ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, ఆత్మకూర్(ఎం) బొమ్మలరామారం, తుర్కపల్లి

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..

ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

# బుల్కాపూర్ నాలా భారీగా పూడ్చివేత



రాయదుర్గం : మణికొండ సరిహద్దుల్లో బుల్కాపూర్ నాలా.. నగరంలోని వివిధ ప్రాంతాలను ముంపు నుంచి కాపాడుతోంది. అలాంటి కీలక నాలాను సంరక్షించాల్సిన నీటి పారుదల శాఖ అధికారులే మట్టి పోసి చదును చేస్తున్నారు. అధికారుల అనాలోచిత చర్యలతో భవిష్యత్తులో ముంపు సమస్యలు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి నుంచి ఎక్కడికంటే.. శంకర్‌పల్లి బుల్కాపూర్ చెరువు నుంచి ప్రారంభమై గండిపేట కోకాపేట, మణికొండ, రాయదుర్గం, షేక్‌పేట హకీంపేట, ఫస్ట్ లాన్సర్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్‌సాగర్ వరకు నాలా ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రాంతాల్లో కబ్జాకు గురైంది. రాయదుర్గం, మణికొండ సరిహద్దులో కిలోమీటరు పొడవునా 50అడుగుల వెడల్పు ఉంటుంది. తాజాగా ఇక్కడే భారీగా మట్టి పోసి, చదును చేసి పది అడుగులకు తగ్గించారు. ఇక్కడ బాక్స్ డ్రైన్ నిర్మించాలని నిర్ణయించారు. ఓ చోట అడ్డంగా పైపులు వేసి మట్టిపోసి దారి ఏర్పాటుచేశారు. సమీపంలో ప్రైవేటు వెంచర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఇలా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పెరగనున్న ముంపు ముప్పు..

ఇప్పటికే భారీ వర్షాల సమయంలో నాలా పొంగి దిగువ ఉన్న పంచవటి కాలనీ ముంపునకు గురవుతోంది. పది అడుగులకు కుదిస్తే ముంపు ముప్పు తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంది. విషయాన్ని నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నాలా పరిస్థితిని పరిశీలిస్తామన్నారు.

## దారి మార్చి.. ఏమార్చి

రామభద్రపురం : గంజాయి అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోతోంది. అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఒడిశా నుంచి విచ్చలవిడిగా విశాఖ, విజయనగరం తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. పోలీసుల వలకు చిక్కినవారు కొందరైతే.. చిక్కని వారు ఎందరో. రామభద్రపురం మండలం కొటక్కి, ఎస్.కోట మండలం బొడ్డవర కూడలి, పాచిపెంట మండలం పి.కోనవలస వద్ద జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు అడ్డంకిగా మారడంతో స్మగ్లర్లు కొత్తదారులు వెతుకున్నారు. నిర్మాణంలో ఉన్న విశాఖ- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని అవకాశంగా మలుచుకుంటున్నారు.

రామభద్రపురం మండలం కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద ఈనెల 10న 15 కిలోలు, గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో కాకర్లవలస వద్ద ఈనెల 12న 5.7 కిలోల గంజాయి పట్టుకున్నారు. నాలుగు ద్విచక్రవాహనాలు, 12 మంది యువకులను అరెస్టు చేశారు. ఒడిశా, పార్వతీపురం, సాలూరు, వంగర, రాజాం, తెర్లాం మండలం వెలగవలస, విశాఖ ప్రాంతాలకు చెందిన యువకులుగా పోలీసులు తెలిపారు. ఇలా దొరికినది కొంతైతే దొరకనిది ఎక్కువ.

ఎస్.కోట మండలం బొడ్డవర కూడలి చెక్‌పోస్ట్ వద్ద ఏటా 20కిపైగా కేసులు నమోదయ్యేవి. గత మూడు నెలల్లో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం.



**హరిత రహదారిపై రయ్.. రయ్..**

విశాఖ- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంలో ఉంది. ఈ మార్గంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కొంతమంది అక్రమ రవాణా సాగిస్తున్నారు. పాచిపెంట వద్ద ఇంటర్‌ఛేంజిలో హరిత రహదారి ఎక్కి విజయనగరం, కొత్తవలస చేరుకుంటున్నారు. జామి వద్ద ఇంటర్ ఛేంజి వరకు వచ్చి విజయనగరం చేరుకుని వివిధ మార్గాల్లో తరలిస్తున్నారు. స్థానికంగా కొంతమంది ఏజెంట్లకు చేరవేస్తున్నారు. సాలూరు, రామభద్రపురం, మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం వంటి ప్రాంతాలు ఒడిశాకు దగ్గరగా ఉండడం మరో కారణం. మూలాలు గుర్తిస్తున్నాం.. వాహన తనిఖీలు మరింత విస్తృతం చేస్తాం. కీలక రహదారులను జల్లెడ పడుతున్నాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఒడిశా నుంచి మైదాన ప్రాంతానికి సరకు వస్తోంది. గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై రామభద్రపురం మండలం కాకర్లవలస వద్ద కొత్తగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. గంజాయి మూలాలను అన్వేషిస్తున్నాం.
భవ్యారెడ్డి, డీఎస్పీ, బొబ్బిలి

## మీ సామగ్రి.. మా బాధ్యత

విజయనగరం : బ్రహ్మపురకు చెందిన ఓ యువకుడు ముఖాముఖి కోసం హైదరాబాద్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బంధువుల ఇంటికని విజయనగరంలో రైలు దిగాడు. తొందరలో విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు విలువైన వస్తువులు మరిచిపోయాడు. అప్రమత్తమయ్యేసరికే బండి కదిలిపోవడంతో రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారు వివరాలు పరిశీలించి, కొన్ని గంటల్లోనే అందించారు. విజయవాడ వెళ్లేందుకు ఓ కుటుంబం విజయనగరం స్టేషన్‌కు వచ్చింది. రైలు ఎక్కే హడావుడిలో ఓ బ్యాగు వదిలేశారు. కొంతదూరం వెళ్లాక 139కు కాల్ చేసి విషయం చెప్పారు. హెల్ప్‌లైన్ సిబ్బంది సమాచారంతో సిబ్బంది బ్యాగును తీసుకుని విశాఖ పంపించి, అక్కడ అందేలా చూశారు.

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట : నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో సామగ్రి, బ్యాగులు, విలువైన వస్తువులు మరిచిపోతుంటారు. కొందరు రైలెక్కాక మరి దొరకదేమోనన్న ఆలోచనతో వదిలేస్తున్నారు. మరికొందరు కంగారులో బండి దిగి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆ పరిస్థితి లేకుండా తామే తీసుకొచ్చి అందిస్తామని చెబుతోంది రైల్వే శాఖ. మీ సామగ్రి.. మీ బాధ్యత.. అని కాకుండా.. మీ సామగ్రి బాధ్యత మాదే అని పేర్కొంటోంది.

**మర్చిపోతే ఏం చేయాలి..**

రైలు.. స్టేషన్లలో లగేజీ, విలువైన వస్తువులు మర్చిపోతే సమీపంలోని జీఆర్పీ లేదా ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేయాలి. వారు స్పందించకపోతే ఉన్నతాధికారులకు చెప్పొచ్చు. రైలులో ప్రయాణిస్తుంటే 139ను సంప్రదించవచ్చు. వివరాల ఆధారంగా సకాలంలో వస్తువులు చేరేలా చూస్తారు.

**వీడియో కాల్..**

139ను సంప్రదిస్తే నేరుగా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. పేరు, చరవాణి నంబరు, రైలు పేరు, బెర్తు సంఖ్య తదితర వివరాలు చెప్పాలి. వారు ప్రయాణికుల సమీపంలో ఉన్న ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తెలియజేస్తారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో సిబ్బంది రంగంలోకి దిగి వస్తువులను గుర్తిస్తారు. సరిపోల్చడానికి వీలుగా వీడియో కాల్ చేస్తారు.

**అప్రమత్తత అవసరం..**

రైలు ప్రయాణాల్లో చాలామంది చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలను మరిచిపోతుంటారు. కొందరు బ్యాగులను వదిలేస్తారు. అప్రమత్తంగా ఉంటే ఆ పరిస్థితి ఉండదు. ఒకవేళ పొరపాటున వదిలేసినా మేం అండగా ఉంటున్నాం. గతేడాది జనవరి నుంచి ఈనెల 13 వరకు 139 మంది ప్రయాణికులు ఇలా వస్తువులు పోగొట్టుకున్నారు. రూ.28.34 లక్షల విలువైనవి తిరిగి అందించాం.
ఆర్‌కే రావు, రైల్వే ఇన్‌స్పెక్టర్

## జీతాలివ్వండి సారూ

శృంగవరపుకోట : గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు.. స్వచ్ఛ సంక్రాంతి పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించిన కార్మికుల కళ్లల్లో పండగ కనిపించలేదు. వ్యర్థాల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న వారికి నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీల్లో 2 నుంచి 6 నెలల వరకు జీతాలు రావాలి. ఈమేరకు రూ.1.51 కోట్ల మేర బకాయిలున్నాయి. కొన్నిచోట్ల రెండు నెలలకు బిల్లులు పెట్టినా చెల్లింపునకు అనుమతి రాలేదు. పెద్ద పంచాయతీ అయిన ఎస్.కోటలో ఆరు నెలలు, కొత్తవలసలో 2 నుంచి అయిదు నెలలు బకాయిలున్నాయి.

సాధారణ నిధుల్లేకే..పంచాయతీల్లో రెగ్యులర్, ఒప్పంద కార్మికులు, క్లాప్‌మిత్రలు పేరుతో కార్మికులు పనిచేస్తున్నారు. రెగ్యులర్, ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పంచాయతీ సాధారణ నిధులు(జనరల్ ఫండ్), క్లాప్‌మిత్రల వేతనాలు ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లిస్తారు. సాధారణ నిధుల్లేక బకాయిలు పేరుకుపోయాయి. క్లాప్‌మిత్రలకు ఆర్థిక సంఘం నిధుల నుంచి డ్రా చేస్తున్నా ప్రభుత్వ అనుమతులు రావడం లేదు.ఇల్లు గడిచేదెలా..తెలుగింటి పండగల్లో ప్రధానమైనది సంక్రాంతి. కొత్త దుస్తులు, పిండివంటలు, కూతుళ్లు, అల్లుళ్లకు కానుకలు ఇలా అధికంగా ఖర్చులు ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీ వచ్చే సరికి జీతం రాకపోతే అప్పులు, వాయిదాలు వాళ్ల ఒత్తిడి అధికంగా ఉంటుంది. దీంతో ఇల్లు ఎలా గడుస్తుందని సతమతమవుతున్నారు.

# కోళ్ల పోరు.. పందేల జోరు !



అనకాపల్లి : సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా జూదాలు, కోడిపందేలు జోరుగా సాగాయి. పందెంరాయుళ్లను ఆకట్టుకునేలా పలు ప్రాంతాల్లో భారీ బరులు ఏర్పాటు చేశారు. భోగి రోజు ఉదయం నుంచి మొదలుకొని మూడురోజులపాటు రూ. కోట్లలో చేతులుమారాయి. కోడిపందేలతోపాటు గుండాట, నంబర్లాట, కాయ్‌రాజాకాయ్ వంటి జూదాలు విచ్చలవిడిగా నిర్వహించారు. తెరవెనుక నుంచి స్థానిక రాజకీయ నేతల అండదండలు ఉండటంతో పోలీసులు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో మాత్రం డ్రోన్లు వినియోగించి పట్టుకున్నారు.

పాయకరావుపేట మండలం శ్రీరాంపురం, పి.ఎల్.పురం, సత్యవరం, రాజగోపాలపురం, వెంకటనగరంలో పండగ మూడురోజులు కోడిపందేలు, జూదం నిర్వహించారు. నక్కపల్లి మండలంలోని.. వేంపాడు, ఉపమాక, డి.ఎల్.పురం, ముకుందరాజుపేట చిన్నచిన్న గ్రామాల్లో భారీగా టెంట్లు వేసి పోటీలు నిర్వహించారు. ప్రతి చోటా రూ. లక్షల్లోనే పందేలు సాగాయి. గత మూడు రోజుల్లో ఈ మండలంలో 9 కేసులు కట్టారు. రాంబిల్లి మండలం వెంకటాపురం, లోవపాలెం, కట్టుబోలులో కోడిపందేలు జరిగాయి. గుండాట భారీ స్థాయిలో జరిగింది. అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో భారీ బరి ఏర్పాటు చేశారు.

నక్కపల్లి మండలం వేంపాడులోని పెద్ద ఎత్తున గ్యాలరీలు, స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో శిబిరానికి మండల పరిసర ప్రాంతాల నుంచి భారీగా పందెంరాయుళ్లు వచ్చారు. ఇక్కడ పార్కింగ్, ఇతర స్టాళ్ల నుంచే రూ. లక్షల్లో వసుల చేశారు. ఒక్కో బరిలో రూ. 5 వేల నుంచి రూ. లక్షకు పైగా పందేలు జరిగినట్లు తెలుస్తోంది.

ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం పెద్దస్థాయిలో డబ్బులు చేతులు మారాయి. జూదాలకు అడ్డుకట్ట వేస్తామని ప్రకటించినా పోలీసులు కనీసం కన్నెత్తి చూడలేదు. గ్రామాల్లో చిన్నాచితకా కేసులు మాత్రం పెట్టి చేతులు దులుపుకొన్నారు. పందెం బరుల వద్ద గొలుసు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు సైతం జోరుగా సాగాయి.

తీర్థాలపైనా కన్ను: సంక్రాంతి పండగ మొదలుకొని దాదాపు నెల రోజుల వరకు గ్రామాల్లో తీర్థాలు, ఆ తర్వాత మరో రెండు నెలలు గ్రామదేవతల పండగలు, జాతరలు జరుగుతాయి. పండగ సందర్భంగా ఇప్పటికే గ్రామాల్లో కోడిపందేల ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మారుమూల శివారు గ్రామాల్లో పండగ ముందు నుంచే పందేలు జరుగుతున్నాయి. రావికమతం మండలం దొండపూడి, మేడివాడ, రావికమతం, గుమ్మళ్లపాడు, చినపాచిల, పొట్టిదొరపాలెం, సీతయ్యపేటల్లో గుండాటల నిర్వాహకులు ఉన్నారు. తీర్థాలు జరిగే చోట రాత్రి వేళల్లో గుల్లాటలు వేసేందుకు నిర్వాహకులకు రూ.వేలల్లో చెల్లించేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

# గుత్తగా కట్టబెట్టి.. గుట్టుగా కట్టిపెట్టి



శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి లోపిస్తోంది. ఏ పని తలపెట్టినా కాలయాపన జరుగుతోంది. నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయకున్నా గుత్తేదారులకు ఇంజినీర్లు వంత పాడుతున్నారు. ఫలితంగా అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. శ్రీశైలంలో ఏటా వివిధ పనుల పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో రూ.3 లక్షల నుంచి రూ.40 లక్షల వ్యయంతో తరచూ సివిల్ వర్క్‌ల కోసం టెండర్లు పిలుస్తుంటారు. క్లాస్-1, 2, 3, 4, 5 అర్హత కలిగిన గుత్తేదారులు పాల్గొంటారు. గడువులోపు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ గుత్తేదారులు సకాలంలో పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించే అధికారులు, గుత్తేదారులపై చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

**అధికారుల అత్యుత్సాహం**

శ్రీశైల దేవస్థానానికి సంబంధించి దోర్నాలలో శ్రీశైల సదన్ ఉంది. రెండేళ్ల కిందట షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపం నిర్మాణానికి టెండర్లు పిలిచారు. షాపింగ్ కాంప్లెక్స్ పూర్తైనా కల్యాణ మండపం పనులు మందగించాయి. గుత్తేదారు పునాదులు వేసి పిల్లర్లు వేయడానికి ప్రయత్నం చేశారు. ఆలోపే ఇంజినీర్లు రూ.40-50 లక్షల మేర బిల్లులు చెల్లించినట్లు సమాచారం. ఆ తర్వాత గుత్తేదారుడు పనులు ఆపేశారు.

**నిబంధనలు పట్టక..**

రూ.1.20 కోట్లతో చేపట్టిన నక్షత్రం వనం పనులు అస్తవ్యస్తంగా జరిగాయి. కొండ ప్రాంతాన్ని అంచనా వేసి అక్కడ ‘0’ లెవల్ నుంచి డ్రాయింగ్ ఇవ్వాల్సి ఉండగా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. పనుల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. నక్షత్ర వనానికి ప్రీకాస్ట్‌తో ప్రహరీ పనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేశారు. పనులు చేయని గుత్తేదారును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల నక్షత్ర వనం వద్ద భారీ ఎత్తున అర్ధనారీశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ధర్మకర్తల మండలిలో తీర్మానం చేయడం కొసమెరుపు.

రెండేళ్ల కిందట గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రూ.80 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆ తర్వాత దాని స్థానంలో భ్రమరాంబాదేవి ఆలయం వెనుక గ్యాలరీ నిర్మించారు. మరలా గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు బీటీ రోడ్డు నిర్మించారు. తర్వాత కాలయాపన చేసి బీటీ రోడ్డును పక్కన పెట్టి సిమెంటు నిర్మాణాలు చేపట్టారు. కాలువల నిర్మాణాలను గాలికొదిలేశారు.

గణేశ్ సదన్ పక్కన ‘ఈవో బంగ్లా’ నిర్మించారు. ఇది సాంకేతిక అనుమతుల వివాదంలో చిక్కుకుంది. ప్రహరీ ఊసే లేకుండా పోయింది.

# చదువులమ్మ గుడికి.. అపూర్వ సంక్రాంతి!



భీమవరం : ఉద్యోగాలు, వ్యాపారాలు, పారిశ్రామిక రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సంక్రాంతి వేళ తప్పనిసరిగా సొంతూళ్లకు వస్తుంటారు. ఇలాంటి వారంతా తాము విద్యాబుద్ధులు నేర్చిన సర్కారు బడుల్లో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు బాల్య మిత్రులంతా కలిసి సందడి చేస్తున్నారు. అంతటితో ఆగకుండా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూతనిచ్చి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. పశ్చిమలో గత కొన్నేళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా ఆత్మీయ సమ్మేళనాల సందర్భంగా పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులకు విరాళాలు ప్రకటించారు. కొన్ని చోట్ల గతంలో చేపట్టి పూర్తి చేసిన నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు చేశారు.భీమవరం ఏఆర్‌కేఆర్ పురపాలకోన్నత పాఠశాల ఆవరణలో 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఇటీవల రూ.2 లక్షలతో సరస్వతీమాత, లక్ష్మీదేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మొగల్తూరు మండలం కేపీపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు 2005-06 బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50 వేలతో వంట, భోజన సామగ్రి సమకూర్చారు.

పోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమకూర్చిన రూ.30 వేలతో అభివృద్ధి చేశారు. మైక్‌సెట్ ఇచ్చేందుకు ఇటీవల తీర్మానించారు.

ఆచంట మండలం వల్లూరు పాఠశాల ప్రాంగణంలో రేకుల షెడ్డుకు 1978-79 బ్యాచ్ విద్యార్థులు సీలింగ్ వేయించారు. పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు సమకూర్చారు.

శృంగవృక్షం జడ్పీ పాఠశాలల ప్రాంగణంలో 1991-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.11.25 లక్షలతో మధ్యాహ్న భోజనశాల నిర్మించారు. ఇలా జిల్లాలో చాలా పాఠశాలలకు పూర్వ విద్యార్థులు సాయమందిస్తున్నారు. భీమవరం పీఎస్ఎం, ఝాన్సీ లక్ష్మీబాయి బాలికోన్నత పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ప్రతిభ కలిగినవారికి ఏటా రూ.2.50 లక్షల వరకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. మొగల్తూరులో పెన్మెత్స రంగరాజు జడ్పీ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థులు గతంలో రూ.20 లక్షల వరకు సమకూర్చారు. కేపీపాలెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ నిర్మాణానికి, ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలలో భోజనశాల, సౌర విద్యుత్తు ప్లాంటు, సైకిల్‌స్టాండ్ల నిర్మాణాలకు పూర్వ విద్యార్థులే నిధులు సమకూర్చారు.

## పశ్చిమ ప్రకాశం.. ప్రమాదాల ప్రయాణం..

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం (మార్కాపురం జిల్లా)లోని ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖకు చెందిన ప్రధాన రహదారులు (మేజర్ రోడ్లు), రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో పాటు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**తిప్పాయిపాలెం దాటితే చాలు..**

మార్కాపురంలో ఉన్న అమరావతి- అనంతపురం జాతీయ రహదారి (544-డి)లో మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం గ్రామం దాటిన తర్వాత, మిట్టమీదపల్లె అడ్డరోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి ఎత్తుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు చెబుతున్నారు.

ఈ రహదారిలో అయిదేళ్లలో ఇప్పటి వరకు 15 మంది వరకు మృతి చెందగా వందల మంది గాయపడ్డారు. మండలంలోని చింతకుంట, కోమటికుంట సమీపంలోని జంక్షన్ వద్ద అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం మరో కారణం.



జాతీయ రహదారి 565పై మండలంలోని దేవరాజుగట్టు- దరిమడుగు గ్రామాల మధ్య ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేకపోయారు.

**పెద్ద పెద్ద గుంతలు, భారీ మలుపులు**

మార్కాపురం- తర్లుపాడు రహదారిలో సీతానాగులవరం నుంచి తర్లుపాడు వరకు రహదారి పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా ఉండి ప్రమాదాలు ఏర్పడుతున్నాయి.

ఒంగోలు- కర్నూలు హైవే రోడ్డులో తాడివారిపల్లె గ్రామం దాటిన తర్వాత ఘాట్ రోడ్డులో భారీ మూలమలుపు వద్ద తరచూ లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు ప్రమాదానికి గురి అవుతున్నాయి.

కొనకనమిట్ల మండలంలోని పొదిలి- గిద్దలూరు రహదారిలోని చిన్నారి కట్ల వద్ద ఆరు నెలల్లో 15 ప్రమాదాలు జరిగాయి. చిన్నారి కట్ల జంక్షన్ కాగా, ఎలాంటి సూచికలు లేవు.

పొదిలి- ఒంగోలు రహదారిలోని మర్రిచెట్లపాలెం వద్ద ఉన్న ముసి వంతెన ప్రాంతం అంతా గుంతలమయం. దీంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో అయినా అధికారులు మరమ్మతులు చేపట్టి, సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## సమన్వయ లోపం... అందని రక్షిత జలం

యర్రగొండపాలెం : శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణా కొరవడడంతో యర్రగొండపాలెం వాసులకు రక్షిత జలాలు సక్రమంగా అందడం లేదు. వివరాల్లోకి వెళ్తే... త్రిపురాంతకం మండలం నడిగడ్డలోని ఎస్.ఎస్.ట్యాంకు ద్వారా యర్రగొండపాలెం పట్టణంతో పాటు మండలంలోని పన్నెండు గ్రామాలకు సాగర్ నీరు సరఫరా చేస్తున్నారు. పథకం నిర్వహణ చూస్తున్న గుత్తేదారుకు జిల్లా పరిషత్ నుంచి ఏటా దాదాపు రూ.కోటి చెల్లిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా గత నాలుగేళ్లుగా పైపులు దెబ్బతిన్నా, కుళాయిలు విరిగినా, పెద్ద మొత్తంలో జలాలు వృథాగా పోతున్నా పట్టించుకున్న వారు కరవయ్యారు. నీటి శుద్ధి, క్లోరినేషన్ సైతం పెద్దగా చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల స్థానికులే పైపులైనుకు మరమ్మతులు చేయిస్తున్నారు. పరిస్థితి ఇలా



ఉన్నా ఇటు పంచాయతీ వారు కాని, అటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఆర్‌డబ్ల్యూఎస్ X పంచాయతీ**

సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు స్పందిస్తూ... ‘పథకం పనులు పూర్తయ్యాక నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలకు అప్పగించాం. పైపులైను మరమ్మతులు వంటివి వారే చూసుకోవాలి. మాకు సంబంధం లేద’ని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య మాట్లాడుతూ... పథకాన్ని అప్పగించలేదని, మరమ్మతులతో మాకు సంబంధం ఉండదని తెలిపారు. నీరందక కొన్ని ప్రాంతాల వారు ఇబ్బంది పడుతుంటే... మానవతా దృక్పథంతో స్పందించి బాగు చేయిస్తున్నట్లు వెల్లడించారు. విషయం ఏదైనా శాఖల మధ్య సమన్వయం లేక ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఉన్నతాధికారులైన స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## తోడేస్తూ పోతే.. కన్నీళ్లు తాగాల్సిందే!

నెల్లూరు : జిల్లాలో భూగర్భ జల వినియోగం విపరీతంగా పెరిగింది. అవసరానికి మించి తోడేస్తుండటంతో కొన్ని గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. సోమశిల, కండలేరు జలాశయాలు, సంగం, నెల్లూరు బ్యారేజీలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ నీటి లభ్యత పుష్కలంగా ఉన్నా.. తగిన జాగ్రత్తలు, పరిరక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

**15 గ్రామాల్లో దారుణం**

ఒక నీటి సంవత్సరంలో.. ఒక గ్రామంలో సగటున 100 యూనిట్ల భూగర్భ జలాలు రీఛార్జి అయ్యాయనుకుంటే.. ఆ ఊరిలో ఆ ఏడాది 70 యూనిట్ల కంటే తక్కువగా భూగర్భ జలాలు వాడుతున్నట్లు లెక్క. అంటే వినియోగం సమర్థంగా ఉన్నట్లు లెక్కిస్తారు. అదే 70-80 యూనిట్ల మధ్య తోడేస్తుంటే ‘ప్రమాదకర(సెమీ క్రిటికల్)’ సంకేతంగా, 90 నుంచి 100 యూనిట్ల మధ్య తోడేస్తుంటే.. ‘అత్యంత ప్రమాదకర(క్రిటికల్) ధోరణిగా నిర్ణయిస్తారు. కొన్ని పల్లెల్లో 110 యూనిట్లు కూడా వాడుతున్నారు. దీన్ని ‘అతి దారుణ’ స్థాయిగా గుర్తిస్తారు. గత నీటి సంవత్సరంలో చేసిన అధ్యయనం మేరకు.. జిల్లాలోని 15 గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితులు, మరో 35 గ్రామాల్లో పరిధిని మించి నీళ్లు వాడుతున్నట్లు గుర్తించారు.

**ప్రత్యేక దృష్టిసారిస్తేనే...** జిల్లాలోనూ వేసవిలో తాగునీటికి తహతహలాడే పల్లెలు, కి.మీ. దూరం నుంచి నీళ్లు తెచ్చుకునే దృశ్యాలు కనిపిస్తాయి.

# మత్స్యకారులకు భరోసా



అనంతపురం : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) పథకం కింద మత్స్యకారులతోపాటు లైసెన్సులు ఉన్న వారందరికీ వర్తింపజేశారు. ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. చేపల వేటలో మృతి చెందిన మత్స్యకారులకు రూ.10 లక్షలు, బీమా పరిహారం అందజేస్తారు. మత్స్యకారుడు సాధారణ మరణంతోపాటు ఇతర ప్రమాదాల్లో మృతి చెందిన వారికి కార్మికశాఖ ద్వారా రూ.2 లక్షల చొప్పున బీమా పరిహారం ప్రకటించారు. అయితే ఈ-శ్రమ్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.

**పీఎంఎంఎస్‌వై అర్హులు ఎవరు?**

మత్స్యసహకార సంఘంలో సభ్యులై ఉండాలి. చేపల వేట లైసెన్సు ఉన్నవారికి వర్తిస్తోంది. చేపల వేట ప్రమాదంలో మరణించిన మత్స్యకారుడికి రూ.10 లక్షల బీమా అందజేస్తారు. కార్మికశాఖ ద్వారా ఈ-శ్రమ్ కార్డు పొందితే మత్స్యకారుడు సాధారణ, ఇతర ప్రమాదాల్లో మరణిస్తే రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తారు.

**ఆధారాల సమర్పణ**

ఆధార్‌కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, శవపంచనామా పత్రం, రేషన్‌కార్డు, మత్స్యసహకార సంఘం ధ్రువీకరణ పత్రం, సంఘం తీర్మానపత్రం సమర్పించాలి.

**ఎక్కడ సమర్పించాలంటే..**

జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలోని అధికారులకు కాని, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని గానీ కలిసి నకళ్లను సమర్పించాలి. అధికారులు వాటిని పరిశీలించి, విజయవాడ రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు.

**సద్వినియోగం చేసుకోండి**

పీఎంఎంఎస్‌వై పథకాన్ని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల బీమా పరిహారం ప్రకటించింది. చేపల వేటలో మత్స్యకారుడు చనిపోతే రైతు సేవా కేంద్రాల్లో కాని, మత్స్య అభివృద్ధి అధికారులను (ఎఫ్‌డీవో) తక్షణమే సంప్రదించాలి.

చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జిల్లా మత్స్యఅభివృద్ధిశాఖ అధికారి

అనంతపురం జిల్లాలో గుర్తింపు పొందిన మత్స్యకారులు 4,330

శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్నవారు 2,992

## ఈ-పంట.. ఏఐ అండ!

ఉంగుటూరు : ఈ-పంట నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఖరీఫ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే యాప్ తీసుకురాగా.. తాజాగా రబీలో కృత్రిమ మేధ(ఏఐ)ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

అత్యధికంగా వరి.. జిల్లాలో పంట కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లినప్పుడు పరిహారం పొందాలన్నా.. ప్రభుత్వ పథకాలు అందాలన్నా.. ఈ-పంట నమోదు తప్పనిసరి. ప్రస్తుతం సర్వే నంబర్లను ల్యాండ్ పార్సిల్స్‌గా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు.

లింక్ ఓపెన్ చేయగానే.. రైతుల ఫోన్లకు సంక్షిప్త సందేశం(మెసేజ్) పంట వివరాల నమోదు ముందు, చేసిన రోజు, ఆ తర్వాత ధ్రువీకరణతో సమాచారం వస్తోంది. రైతులకిచ్చిన సంక్షిప్త సందేశంలో లింక్



ఓపెన్ చేసి ఈ- పంటలో నమోదైన వివరాలు సరిచూసుకోవచ్చు. భూ విస్తీర్ణం తగ్గిన, పంట రకం తప్పుగా నమోదైతే.. అందులోనే నేరుగా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించింది.

జిల్లా రబీ సమాచారమిలా(ఎకరాల్లో)..

సాధారణ సాగు విస్తీర్ణం: 2,38,605

ఇప్పటి వరకు సాగైంది: 1,01,600

ఈ-పంట నమోదుకు గుర్తింపు: 3,54,476

ఇప్పటి వరకు నమోదైంది:15,069

ఈ-పంటలో నమోదు:24,620, రైతులు:8,844

## కో'ఢీ'.. ఎక్కడా తగ్గలే!

రాజమహేంద్రవరం : సంప్రదాయాల పండగ సంక్రాంతిని ఆసరాగా చేసుకొని ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహించగా.. రూ.వందల కోట్లు చేతులు మారాయి. తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని దాదాపు ప్రతి మండలంలో కనీసం పది చొప్పున బరులు ఏర్పాటుచేశారు. ఈ మూడు రోజుల్లో దాదాపు రూ.500 కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఫ్లడ్‌లైట్ల వెలుగులో డ్రోన్ కెమెరాల చిత్రీకరణతో ఎల్‌ఈడీ తెరలపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ తరహా ఏర్పాట్లలో ఐ.పోలవరం మండలం మురమళ్ల బరి ముందు వరుసలో ఉంది. ఇక్కడ సుమారు 20 ఎకరాల్లో భారీ బరి నిర్వహించగా పెద్ద ఎత్తున నగదు చేతులు మారింది. 50 మంది వరకు బౌన్సర్లను బందోబస్తుకు నియమించగా,



నగదు లెక్కింపునకు పదుల సంఖ్యలో మెషిన్లు తీసుకువచ్చారు. ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక, పేరవరం, లొల్ల, ర్యాలీ, తాడిపూడిలో పోటీలు నిర్వహించారు. కొత్తపేట, లొల్లలో అశ్లీల నృత్యాలు సైతం ఏర్పాటుచేయడం గమనార్హం. పందేలు మూడు రోజుల పాటు నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగగా.. పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

ప్రతి బరిలోనూ ఆరు నుంచి 10 వరకు గుండాట బోర్డులు ఏర్పాటుచేశారు. రూ.500కు తక్కువ లేకుండా కాసేలా కొందరు నిబంధనలు పెట్టారు. గుండాట ఏర్పాటుకు వేలం నిర్వహించగా గోపాలపురం, కాకినాడ గ్రామీణంలో రూ.30 లక్షల వరకు చెల్లించి దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

రాజానగరం, కొత్తపేట, అమలాపురం, రాజమహేంద్రవరం గ్రామీణం, నిడదవోలు, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన బరుల్లో కార్లు, బుల్లెట్లు విజేతలకు అందించారు. గోపాపురంలో కోళ్ల టోర్నమెంట్ నిర్వహించారు. చెరోవైపు అయిదేసి కోళ్లను బరిలోకి దించి పోటీ పెట్టారు. విజేతకు రూ.8 లక్షలు అందజేశారు.

నిడదవోలు నియోజకవర్గంలో 40 వరకు బరులు ఏర్పాటు చేశారు. ఈ మూడు రోజుల సమయంలో సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేర, గోపాలపురం నియోజకవర్గంలో సుమారు 32 బరులు ఏర్పాటు చేయగా మూడు రోజుల్లో రూ. 6 కోట్ల నుంచి 8 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా.

పందేలు చూసేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో వచ్చారు.

ప్రతి బరిలోనూ గొలుసు దుకాణాలు ఏర్పాటుచేసి నచ్చిన ధరకు మద్యం విక్రయించారు. కొందరైతే వాహనాల్లో మద్యం కేసులు తెచ్చి తాగుతూ అక్కడే పందేలు నిర్వహిస్తూ కనిపించారు.

## కాలం చెల్లిందా.. పరీక్షలు తప్పనిసరి

రావులపాలెం : లారీ, కారు, ద్విచక్రవాహనం, లారీలు, ఇలా ఏదైనా వాహనం ఏళ్లు గడిచినా వాడుతున్నారా.. కాలం చెల్లినా రోడ్లపై దర్జాగా తిరుగుతున్నారా.. ఇకపై అలా తిరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిందే. ఒక్కోదానికి స్లాబ్ ప్రకారం భారీ మూల్యం చెల్లించాల్సిందే. 15 ఏళ్లు దాటినా వినియోగించాలంటే ఫిట్‌నెస్ (సామర్థ్యం) పరీక్షలు తప్పనిసరి రవాణా శాఖ అధికారులు, ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రాల్లో ఫీజులు చెల్లించి పరీక్ష చేయించుకోవాలి. అనుమతి తీసుకున్న తర్వాతే తిప్పాలి. ఈ పరీక్షలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఫీజు పెంచింది. సర్టిఫికెట్ ఫీజు, గ్రాంట్, రెన్యూవల్‌కు తోడుగా జీఎస్టీ ఛార్జీలు జోడించింది.

చాలామంది ఇతర రాష్ట్రాల నుంచి పాత వాహనాలను కొనుగోళ్లు చేసి స్థానికంగా తిప్పుతున్నారు. అక్కడి రిజిస్ట్రేషన్ నంబరుతోనే తిరుగుతున్నారు. ఇకపై వారు సైతం దీనిపై దృష్టి సారించాలి.

స్వాధీనం చేసుకుంటాం..

రిజిస్ట్రేషన్ కాలం పూర్తయిన వాహనాలను కచ్చితంగా రెన్యూవల్ చేయించుకోవాలి. రెన్యూవల్ చేయించుకోకపోతే స్వాధీనం చేసుకుంటాం. దేవిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా రవాణాశాఖాధికారి

# చేపాచేపా.. అమ్మేదెలా..?



పుత్తూరు: జిల్లాలోని పుత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీలు ఏర్పడి 20 ఏళ్లయింది.. ఆయా పట్టణాల్లో కనీసం మౌలిక వసతులూ కరవే. ప్రధానంగా మార్కెట్లు లేక రైతులు రోడ్లపై తాము పండించిన పంట ఉత్పత్తులు విక్రయించుకోవాల్సిన దుస్థితి. గత పాలక వర్గాలు కనీసం మార్కెట్లకు స్థలాలైనా కేటాయించలేదు. ఈ నేపథ్యంలో రోడ్లపైనే క్రయవిక్రయాలతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లాలోని పుత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీలు మేజర్ పంచాయతీల నుంచి 2005 పురపాలక సంఘాలుగా ఆవిర్భవించాయి.. పట్టణాలుగా అవి మారినా మౌలిక వసతులు నేటికీ సమకూరనేలేదు.. ముఖ్యంగా మాంసం, చేపల మార్కెట్ లేక రహదారుల వెంట విక్రయిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి.. ఆదివారమైతే పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు.. పలమనేరులో చేపల మార్కెట్ కోసం రూ.15 లక్షలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినా మిగిలిన చోట్ల దయనీయ స్థితి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగర, పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి.

**బహిరంగంగా జంతువధ..**

మాంసం విక్రయాలు ఒక ఎత్తయితే.. కొందరు విక్రేతలు రహదారుల పక్కనే జంతువులను వధించడం సమస్యగా మారింది. పుత్తూరులో కార్వేటినగరం రోడ్డు, ఎన్జీవో కాలనీ, గేటుపుత్తూరు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, నగరిలో ఏకాంబరకుప్పం, నగరి ప్రధాన రహదారి, నగరి-నాగలాపురం రోడ్డు, పలమనేరులో గాంధీనగర్, ప్రధాన మార్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వ్యర్థాలను సైతం కాలువల్లో పడేస్తుండటంతో మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. ఆదివారమైతే ప్రతి వీధి వద్ద ఇదే పరిస్థితి. చేపల మార్కెట్లు తాత్కాలికంగా ఉన్నా ఆదివారం ఆయా వీధుల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసి ఆ వ్యర్థాలను అక్కడే వదిలి వెళ్తున్నారు. చేపలు శుభ్రం చేసే నీరంతా రోడ్డుపైనే పారుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

**భూమిపూజ చేసినా..**

జిల్లాలోని పుత్తూరు, నగరి, పలమనేరు మున్సిపాలిటీల్లో గత ప్రభుత్వ హయాంలో చేపల మార్కెట్లు కోసం రూ.15 లక్షల చొప్పున రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఒక్క పలమనేరు మున్సిపాలిటీలో మాత్రమే నిర్మించారు. పుత్తూరు, నగరిలో తెదేపా హయాంలో భూమి పూజ చేశారు. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వైకాపా రావడంతో ఆ టెండర్లు రద్దు చేశారు. మంత్రి హోదాలో రోజా భూమిపూజ చేశారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఇక మాంసం దుకాణాలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

**ప్రత్యేక దృష్టి సారిస్తాం..**

రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మాంసం దుకాణాలు ఏర్పాటు చేయరాదు. జంతువధశాల లేక ఇలా జరుగుతోంది. త్వరలోనే దీనిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు రాగానే ఏర్పాటు చేస్తాం. చేపల మార్కెట్ల ఏర్పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మించేలా చూస్తాం. -నాగేశ్వరరావు, కమిషనర్, పుత్తూరు

# భక్తులకు టోల్‌మోత

అహోబిలం : ఆళ్లగడ్డ మండల పరిధిలోని అహోబిలం గ్రామంలో వాహనాలకు సంబంధించి టోల్‌గేట్ రుసుము అధికంగా వసూలు చేస్తున్నారు. అయినా అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

**ఉత్సవం నేపథ్యంలో..**

అహోబిలంలో శుక్రవారం పార్వేటోత్సవం ప్రారంభమైంది. తన వివాహానికి ప్రజలను ఆహ్వానించేందుకుగాను స్వామివారు గ్రామాలకు పయనమయ్యారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాక తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఫలితంగా క్షేత్రం కిక్కిరిసింది. చాలామంది వాహనాల్లో వచ్చారు. ఇదే అదనుగా భావించిన టోల్‌గేట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధిక వసూళ్లకు పాల్పడ్డారు.

**కానరాని బోర్డులు**

సాధారణంగా పంచాయతీ నిర్ణయించిన ధరల ప్రకారం ఆటోకు రూ.75, కారు రూ.100, లారీ, బస్సుకు రూ.150 వసూలు చేయాలి. కానీ శుక్రవారం కార్లకు రూ.200 చొప్పున తీసుకోవడం గమనార్హం.




వాహనదారులకు ఇచ్చే రసీదులో పంచాయతీకి సంబంధించిన ముద్రలు కూడా కానరాలేదు. ఏ వాహనానికి ఎంత ధర ఉందో సూచించే బోర్డు సైతం ఏర్పాటు చేయలేదు. చివరికి నిర్వాహకులు అడిగినంత మొత్తాన్ని భక్తులు ఇస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విషయం మా దృష్టికి రాలేదని, పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కాకినాడ పోర్టులో జెట్టీ విస్తరణ

కాకినాడ : కాకినాడ డీప్ వాటర్ పోర్టును మరింత విస్తరించనున్నారు. ప్రస్తుతం ఉన్న జెట్టీకి అనుబంధంగా మరో రెండు చిన్నపాటి ఫింగర్ జెట్టీలను నిర్మిస్తారు. ఇందుకు దాదాపు రూ.200 కోట్ల వరకు వెచ్చించనున్నారు. సీఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం ఈ కొత్త నిర్మాణాల వల్ల సమీప గ్రామాలపై పర్యావరణ ప్రభావిత అంశాలపై ఫిబ్రవరి 6న మారిటైం బోర్డు కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారు. జెట్టీల విస్తరణతో సరకు రవాణాలో మరిన్ని మైలురాళ్లు అధిగమించడానికి అవకాశం ఉంటుందని సంబంధిత అధికారి తెలిపారు.

**అదనంగా 4 మిలియన్ టన్నుల రవాణా..**

కాకినాడ పోర్టులో ప్రస్తుతం ఏడు బెర్తులు ఉండగా 17.5 మిలియన్ టన్నుల సరకు రవాణా చేస్తున్నారు. ఇనుప ఖనిజం, బొగ్గు, అల్యూమినియం, బాక్సైట్, ఎరువులు ఈ పోర్టు ద్వారా దేశ, విదేశాలకు చేరవేస్తున్నారు. కొత్తగా విస్తరించబోయే జెట్టీ ద్వారా అదనంగా మరో 4 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు అవకాశం ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. పెరుగుతున్న సముద్ర వాణిజ్యం, సాగర గర్భంలో అన్వేషణ, సాగరమాల కింద కేంద్ర ప్రభుత్వం ఓడరేవు ఆధారిత పారిశ్రామికీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఇక్కడ మౌలిక సదుపాయాలకు మరింత అవకాశం కలగనుంది.



**360 మీటర్ల మేర పొడిగించి..**

ప్రస్తుతమున్న జెట్టీని 360 మీటర్ల మేర పొడిగిస్తారు. తద్వారా సరకు ఎగుమతి, దిగుమతుల సామర్థ్యం పెరగనుంది. జెట్టీకి తూర్పు దిశగా 275 మీటర్ల పొడవునా ఫింగర్ జెట్టీ నిర్మించనున్నందున ఎక్కువ నౌకలు ఒకేచోట నిలపొచ్చు. నౌకల దగ్గరకు పైపులు వేయడం, రాకపోకలకు అనువుగా ఉంటుంది. గ్యాస్, చమురు నిల్వల రవాణా, సరఫరాకు ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి. నౌకలు తిరిగి వెళ్లే సమయం, రవాణా ఖర్చులు తగ్గుతాయి. లాజిస్టిక్ హబ్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది. సాధారణంగా సముద్రంలో నిర్మాణాలు చేపట్టేముందు సమీప గ్రామాల్లో పర్యావరణ ప్రభావంపై అధ్యయనం చేసి నివేదిక ఇస్తారు. జెట్టీల విస్తరణలో భాగంగా పది కి.మీ పరిధిలో గ్రామాలపై 2024 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు విశాఖకు చెందిన సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇచ్చారు. పీఎం-10, పీఎం-2.5 వంటి ధూళి కణాలు పరిమిత స్థాయిలోనే ఉంటాయని.. గాలి, నీరు, శబ్ధ కాలుష్యాలకు ఆస్కారం లేవని పేర్కొన్నారు. ఈ నివేదికనే వచ్చే నెల 6న ప్రజాభిప్రాయసేకరణ సభలో వినిపించి, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

## విద్యలనగరానికి.. పచ్చని తోరణం

విజయనగరం : విజయనగరం జిల్లా కేంద్రాన్ని పచ్చగా మార్చుతున్నారు.. ఇప్పటికే తాగునీటి కొరతను అధిగమించేందుకు అత్యాధునిక రీఛార్జ్ పిట్‌లను ఏర్పాటు చేశారు.. మరోవైపు వేడిని, కాలుష్యాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీగా మొక్కలు నాటుతున్నారు. తాజాగా వాటికి రక్షణ చర్యలు చేపడుతున్నారు.

**40 ప్రాంతాల్లో..**

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం కరవైంది. వేలల్లో మొక్కలేసినట్లు చూపించినా.. క్షేత్రస్థాయిలో కానరాలేదు. ట్రీగార్డులు, శిలాఫలకాల పేరిట పెద్దఎత్తున దోచేశారనే ఆరోపణలొచ్చాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. నగరపాలికలో 40 ప్రాంతాలను గుర్తించింది. గతేడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనం- మనం కార్యక్రమం కింద ఆయా చోట్ల 50 వేల వరకు నాటాలని నిర్ణయించారు. ఇప్పటికే 3 వేల వరకు వేశారు.

**రక్షణ ఇలా..:** స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర, హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమాల కింద పెద్దచెరువు, కంటోన్మెంట్ ఉడాకాలనీ, ఎత్తుబ్రిడ్జి, బస్‌షెల్టర్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున మొక్కలేశారు. వాటిని రక్షించేందుకు ఇటీవల 1000 వరకు ట్రీగార్డులు చేయించారు. ఒక్కోదానికి రూ.2 వేల చొప్పున ఖర్చు చేశారు. ప్రస్తుతం ఏర్పాటు పనులు సాగుతున్నాయి.

**గతంలో దోచేశారిలా..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో 'జగనన్న హరిత నగరాలు' కార్యక్రమం కింద 2,650 మొక్కలకు గానూ రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించారు.

మెగా ప్లాంటేషన్ ద్వారా 10 వేలు నాటామని పేర్కొన్నారు. ఇవేవీ క్షేత్రస్థాయిలో కానరాలేదు.

కేవలం ట్రీగార్డుల కోసమే రూ.18.20 లక్షల వరకు వెచ్చించారు.

నామ ఫలకాల ఏర్పాటుకు మరో రూ.8.75 లక్షలను గుత్తేదారుకు ముట్టజెప్పారు.

**అవకాశాలివీ..**

నగరంలో 12 వరకు భారీ సెంటర్ డివైడర్లు, 100 వరకు ఉద్యానాలున్నాయి. మరో 12 చెరువులున్నాయి. వీటిల్లో నాటేందుకు అవకాశం ఉంది.

కోమటి చెరువు, పెద్ద చెరువు, బుచ్చెన్నకోనేరు, అయ్యకోనేరు, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో సుందరీకరణ చర్యల్లో భాగంగా పచ్చదనాన్ని పెంచారు. రక్షించాల్సిన అవసరం ఉంది

ఉడాకాలనీ, ప్రదీప్‌నగర్, అయ్యన్నపేట, కొత్తపేట నీళ్ల ట్యాంకు దారి, ఇందిరా నగర్, కంటోన్మెంట్, కలెక్టరేట్ నుంచి కామాక్షినగర్ మీదుగా గంట్యాడ రోడ్డు, బీసీ కాలనీ, వైఎస్సార్ నగర్, ఫోర్టు సిటీ పాఠశాల ప్రాంతాల్లో కొత్తగా వేయనున్నారు.

ఇప్పటికే ఉద్యాన శాఖను ఏర్పాటు చేశారు. ఏడీగా సంతోష్‌కుమార్ ఇటీవల విధుల్లో చేరారు. పనిచేసేందుకు 44 మంది సిబ్బందిని సైతం నియమించారు. నిత్యం రెండు ట్యాంకర్లతో నీళ్లు పోస్తున్నారు.

**పండ్ల రకాలే ఎక్కువ..**

ఇటీవల 1000 ట్రీగార్డులు వచ్చాయి. 50 వరకు పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేశాం. ప్రాంతాలకు అనుగుణంగా మిగిలినవి పెడతాం. కాలుష్యం తగ్గించడం, పచ్చదనం, నీడ పెంపులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే వర్షాకాలం నాటికి విడతల వారీగా 50 వేల వరకు మొక్కలు నాటుతాం. ఇందులో పండ్ల రకాలవే అధికంగా ఉన్నాయి. అయిదు వేల వరకు వచ్చాయి.

ప్రసాద్, ఈఈ, నగరపాలక సంస్థ

## సర్కారు భూమిపై కబ్జాదారుల కన్ను

కదిరి : కదిరి పట్టణ పరిధిలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కబ్జాదారుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. కదిరి రెవెన్యూగ్రామం బేరిపల్లికాలనీ సమీపంలోని సర్వేనంబరు 268లో దాదాపు 15సెంట్ల స్థలాన్ని అక్రమార్కులు రాత్రికి రాత్రే చదును చేశారు. బాహ్యవలయ రహదారికి ఆనుకుని ఉన్న ఈస్థలం మీదుగా దేవరచెరువు నుంచి పంట పొలాలకు నీరందించే కాలువను గట్లను ధ్వంసం చేసి భూమిని చదును చేసేశారు. జాతీయ రహదారి 42కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర 10 లక్షల వరకు పలుకుతోంది. పదిహేనుసెంట్ల భూమి కోటిన్నర రూపాయల పైమాటే. పట్టణానికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నా రెవెన్యూ అధికారులు దృష్టికి రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణదారుల పట్ల అధికారులు కఠినచర్యలు తీసుకోని కారణంగానే పెట్రేగిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. బేరిపల్లి వద్ద పొలాలకు



వెళ్లేదారి నుంచి ఉన్న నీటికాలువ వరకు ఉన్న స్థలంపై కన్నేసిన కబ్జాదారులు రాత్రివేళల్లో పొక్లెయిన్ సాయంతో చదును చేసేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం: మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి**

ప్రభుత్వభూమిని చదును చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారికి సూచించా. భూమి అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం.

## ఇరుకు గదుల్లో.. పసిమొగ్గలు మగ్గిపోవాలా?

పాలకొల్లు మండలం వాలమర్రులో 159వ నంబరు అంగన్‌వాడీ కేంద్రం ఇది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణం చేపట్టగా తరువాత వచ్చిన వైకాపా సర్కారు పనులను పూర్తి చేయడంలో వివక్ష చూపింది. దీంతో అసంపూర్తి భవనంలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.మార్టేరు, అత్తిలి, పాలకొల్లు గ్రామీణ, పోడూరు, బాలల సమగ్ర వికాసానికి బాటలు వేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు వైకాపా పాలనలో ప్రాభవం కోల్పోయాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను విస్మరించడంతో పాటు కొత్తగా ప్రారంభించిన పనులకు సైతం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక శాతం కేంద్రాలు అద్దె గదుల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

రూ.13.5 లక్షల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం చేపట్టిన పెనుమంట్ర-3 అంగన్‌వాడీ భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా మిగిలింది. 2023 జూన్‌లో ఈ నిర్మాణాన్ని పరిశీలించిన అప్పటి కలెక్టర్ ప్రశాంతి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడంతో చిట్టడవిని తలపిస్తోంది.

**ఇదీ పరిస్థితి..**

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,626 కేంద్రాలు ఉండగా వీటిలో 600 వరకు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. వీటికి పట్టణ పరిధిలో నెలకు రూ.6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాల హయాంలో చేపట్టిన 82 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. పెనుగొండ మండలం ములపర్రులో 166వ నంబరు కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నిధులను నిలిపేసింది. పెనుగొండలోని 135వ నంబరు కేంద్రానిదీ ఇదే పరిస్థితి. ఈ మండలంలో 71 కేంద్రాలకు గాను 25 అద్దె గదుల్లో కొనసాగు తున్నాయి.అత్తిలి, ఇరగవరం మండల్లాలోని ఈడూరు, కంతేరు, ఏలేటిపాడు గ్రామాల్లో భవన నిర్మాణాలను నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే వదిలేశారు.

పోడూరు మండలం జిన్నూరు శివారు భూపయ్యచెరువులో నిర్మించిన భవనానికి గుమ్మాలు, పైపులైన్ల ఏర్పాటు, విద్యుదీకరణ పనులు చేయించాల్సి ఉంది. ఈ మండలంలో మూడు భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. భవన నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు.

## మూడున్నర కోట్లు మురగబెట్టారు


ఏలూరు: 17వ లోక్‌సభలో ఏలూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన వైకాపా ఎంపీ కోటగిరి శ్రీధర్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని, లోక్‌సభ రద్దయ్యే నాటికి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులను పూర్తిగా వెచ్చించలేకపోయారు. నిధులు ఖర్చు చేసే విషయంలో ఆయన ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో మిగిలిపోయిన నిధులే అందుకు నిదర్శనం. ఖర్చుకాకుండా రూ.3.76 కోట్లు మిగిలిపోయాయి. ఈ నిధులను ప్రస్తుత 18వ లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేశ్‌కుమార్ వినియోగించొచ్చు.గ్రామాల్లో సామాజిక భవనాలు, పట్టణ, గ్రామీణంలో రహదారుల నిర్మాణాలు, క్రీడావసతుల కల్పనకు, మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు, ఆసుపత్రుల అభివృద్ధికి, పొలాల బాటలకు, కొల్లేరు గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణాలకు ఖర్చుపెట్టుకోవచ్చు. జిల్లాలో రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అయినా నిధులు ఖర్చు చేయలేదంటే ఎంపీకి చిత్తశుద్ధి కొరవడమే కారణమని చెప్పాలి. ఆయా పనులకు ఎంపీ ఆమోదం తెలపగానే జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)కి ప్రతిపాదనలు పంపితే మంజూరు పత్రాలు జారీ చేస్తారు. అధికారులు టెండర్లు పిలిచి వాటిని పూర్తి చేయాలి. అయితే 52 పనులకు కనీసం టెండర్లు పిలవలేదు. వాటి విలువ రూ.3.76 కోట్లు. గతంలో ఎంపీ శ్రీధర్ ప్రతిపాదించిన ఈ పనులు రద్దయిపోయాయి. ప్రస్తుత ఎంపీ ప్రతిపాదిస్తేనే టెండర్లు పిలిచి ప్రారంభిస్తారు.

**5 ఏళ్లలో రూ.22.66 కోట్ల పనులు..**

కోటగిరి శ్రీధర్‌కు ఎంపీలాడ్స్ కింద మొత్తం 251 పనులకు రూ.22.66 కోట్లు కేటాయించగా ఈ ఏడాది నవంబరు నాటికి 193 పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాటి విలువ రూ.17.60 కోట్లు. ఈ బిల్లులు మంజూరు చేశారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అవి పలు దశల్లో ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో అత్యధిక పనులకు కేటాయింపులు జరిపారు. ఏలూరు నగరంతో సహా పలు చోట్ల నిర్మించిన సామాజిక భవనాల వ్యయం పెరిగి పనులు పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఎంపీ లాడ్స్ నిధులు రూ.22.66 కోట్లు
పనుల సంఖ్య: 251
పూర్తయినవి 193
వెచ్చించిన వ్యయం రూ.17.60 కోట్లు
ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు 6
వెచ్చించాల్సిన వ్యయం రూ.1.29 కోట్లు

## పునాదుల్లో వదిలేశారు.. పూర్తయ్యాక మేల్కొన్నారు..



తిరుపతి : తిరుపతిలోని న్యూ మారుతీనగర్‌లో ఇటీవల నిర్మిస్తున్న ఆరు అంతస్తుల భవనమిది. ఇంకా పనులు పూర్తి కాకముందే సున్నం వేసి నగరపాలిక రెవెన్యూ విభాగాన్ని సంప్రదించి పన్ను కూడా వేసుకున్నారు. ఇప్పుడు ప్రణాళిక విభాగం అధికారులు వచ్చి నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించారని గోడలపై బీపీఎస్ అని రాశారు. ఇలా ఈ ఒక్క భవనమే కాదు.. నగరంలో సుమారు 3 వేల ఇళ్లను గుర్తించి బీపీఎస్ అని రాస్తున్నారు. నగరంలో ఎన్జీవో కాలనీలో ఓ భవనం అదనపు అంతస్తు నిర్మించారని ఇటీవల ప్రణాళిక విభాగపు అధికారులు గుర్తించారు. సిబ్బందితో వెళ్లి సెలవు రోజున పైఅంతస్తును కూల్చివేశారు. యజమాని బీపీఎస్ కోసం దరఖాస్తు చేసినా.. ఖాతరు చేయకుండా కూల్చేయడంతో ఆయన రూ.15లక్షల నష్టపోవాల్సి వచ్చింది. ఈ రెండు ఉదాహరణలే తిరుపతి నగరపాలిక పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుకు అద్దంపడుతున్నాయి. అక్రమ భవనాల విషయంలో తీసుకుంటున్న చర్యలు సరైనవే అయినా.. పునాదుల దశలో గుర్తించకుండా.. పూర్తయ్యాక రంగంలోకి దిగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అక్రమ భవనాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రభుత్వం వీటి విషయంలో కఠినంగా వ్యవహరిస్తుండటంతో ఇప్పుడు కూల్చివేతలు, బీపీఎస్ కోసం పరుగులు పెడుతున్నారు. అప్పుడు మామూళ్లు తీసుకొని.. ఇప్పుడు కూల్చివేతలు చేపట్టడంతో యజమానులు తలలు పట్టుకుంటున్నారు. పునాదుల దశలో భవన నిర్మాణదారులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ములో 10 శాతం తమకు ఇస్తే నిరభ్యంతరంగా ఇళ్లు కట్టుకోవచ్చని ఏమార్చుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఆ అధికారి కనుసన్నల్లోనే..**తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు, ఉద్యోగులు ఒక మాఫియాగా మారి దందాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న భవనాలు, నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేయకుండానే అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాల నిర్మాణాలు శరవేగంగా జరిగిపోయాయి. అప్పటి నేతలు, కార్పొరేటర్ల అనుమతితో వేల సంఖ్యలో అనధికారిక భవనాలు వెలిశాయి. ఈ వ్యవహారంలో అప్పట్లో పనిచేసిన ఓ పట్టణ ప్రణాళికాధికారి మాఫియాకు సారథ్యం వహించినట్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయనపై విచారణకు ఆదేశించి బదిలీ చేశారు. అయినా తన కంచుకోటను కాపాడుకోవడానికి తనకు అనుకూలంగా ఉన్న అధికారుల్ని నగరపాలికకు రప్పించుకుని సాగిస్తున్నట్లు చెబుతున్నారు.

## వంద ఎకరాల్లో దివ్య వృక్షాలు



తిరుమల : తితిదే ఆలయాలతో పాటు దేశవ్యాప్తంగా నిర్మించే ఆలయాలకు ధ్వజస్తంభాలు, రథాల నిర్మాణం కోసం అవసరమైన దివ్య వృక్షాలు పెంచడానికి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులు ఈ ప్రాజెక్టును తీర్మానించి ఆమోదించారు. దేశంలో తొలిసారిగా ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా దివ్య వృక్షాల పెంపకాన్ని తితిదే ప్రారంభించనుంది.

**పరీక్షలు చేసి**

పలమనేరులోని తితిదే గోశాల ప్రాంగణం ఐదు వందల ఎకరాలు ఉంది. ఈ ప్రాంతం వృక్షాలు పెంచడానికి అనువైందా? కాదా? అని గుర్తించేందుకు అటవీశాఖ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు ఆధ్వర్యంలో భూసార పరీక్షలు నిర్వహించారు. అన్ని విధాలా ఇది అనుకూలమైనదని తేలడంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. మొదట వంద ఎకరాల్లో వీటిని నాటనున్నట్లు అధికారులు తెలిపారు.

**శాస్త్రీయంగా..**ప్రస్తుతం తితిదే పెంచనున్న దివ్య వృక్షాలను ఆధ్యాత్మిక, జ్యోతిష విధానాలకు అనుగుణంగా ఎంపిక చేస్తారు. ధ్వజస్తంభాల కోసం టేకు, అగిశ లేదా ఇండియన్ కినో, టెర్మినేలియా, షోరియా జాతికి చెందిన వృక్షాలను పెంచుతారు.. ఇవి నిటారుగా, బలంగా, ఎక్కువ కాలం ఉండే స్వభావం కలిగి ఉంటాయి.

**తగ్గిపోతున్న వృక్ష సంపద**

ప్రస్తుతం అడవుల్లో ధ్వజస్తంభం ఏర్పాటు చేసేందుకు అవసరమైన వృక్షాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని అడవుల్లో ఉన్నా వాటిని తీసుకురావడం కష్టంగా ఉంది. పెరిగిన భవన నిర్మాణ అవసరాలకు వృక్షాలను పెద్దయెత్తున వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీవారి ఆలయంతో పాటు తితిదే పరిధిలోని 60కి పైగా ఉన్న ఆలయాల అవసరాలకు వీలుగా ఈ వృక్షాల పెంపకాన్ని చేపట్టనుంది.

## నగర వనాలతో ఆహ్లాదం.. ఆనందం



కదిరి : బడలికకు విశ్రాంతి.. ఒత్తిడికి ప్రశాంతత.. వారాంతాల్లో ఆనందంగా గడపటానికి ఆహ్లాదం ఎంతో అవసరం. అలాంటి వాతావరణాన్ని కల్పించేందుకు అటవీశాఖ నగరవనాలను (ఎకో పార్కులు) ఏర్పాటు చేస్తోంది. ఇందుకు నువైన ప్రదేశాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లాలో బుక్కపట్నం అటవీ రేంజీ పరిధి అమగొండపాళెంలో నగరవనం పూర్తయి అందుబాటులోకి తీసుకొచ్చారు. మరో నాలుగు నగరవనాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇందులో కదిరి సమీపంలోని బత్రేపల్లి జలపాతం వద్ద, పెనుకొండ, పరిసర ప్రదేశాల్లో మూడు చోట్ల ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.2 కోట్లతో వందల ఎకరాల్లో..**

జిల్లాలోని ఒక్కో నగరవనానికి (ఎకో పార్కు) రూ.2 కోట్లు అంచనా తయారు చేశారు. ఒక్కోదానికి రూ.1.40 కోట్లు విడుదల కాగా పనులు చేపట్టారు. బత్రేపల్లి అటవీ ప్రాంతంలో సుమారు 125 ఎకరాల విస్తీర్ణంలో పార్కు పనులు చేస్తున్నారు. అంతేస్థాయిలో పెనుకొండ ప్రాంతంలో నగరవనాలను తీర్చిదిద్దుతున్నారు. కదిరిలో శ్రీఖాద్రీశుడు వెలసిన ఆధ్యాత్మిక కేంద్రంతోపాటు యోగివేమన, తిమ్మమ్మమర్రిమాను, బత్రేపల్లి జలపాతం పరిసర ప్రాంతాలు చారిత్రక, పర్యాటక ప్రాంతాలుగా ఉన్నాయి. శ్రీకృష్ణదేవరాయల పాలనకు కేంద్రమైన పెనుకొండ చారిత్రక ప్రదేశం. ఇక్కడ నగర వనాలు యాత్రికులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచనున్నాయి.

**వసతులివీ..**అటవీ ప్రాంతంలో చుట్టూ దట్టంగా పచ్చని వృక్షాలు. ఆకర్షణీయమైన స్వాగత ద్వారం నిర్మిస్తున్నారు. వనమంతా చూసేలా వ్యూ పాయింట్, వాచ్ టవర్, లోపలికి వెళితే చుట్టూ కంచెతో కొలనులో నీటి వసతి, కాటేజీలు, పగొడసాస్, ఫుడ్‌కోర్టులు, మలమూత్ర విసర్జనశాలలు, నడక దారులు, ఆకర్షించేలా అందమైన మొక్కలు, పిల్లలకు ఆటస్థలంతో ఆహ్లాదం, ఆనందం పొందేలా వసతులు కల్పిస్తున్నారు.**వేసవికల్లా అందుబాటులోకి తెస్తాం : చక్రపాణి, జిల్లా అటవీశాఖాధికారి**జిల్లావ్యాప్తంగా నాలుగు ఎకో పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు 60 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. వేసవి ప్రారంభానికల్లా వాటిని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంతో అందరికీ అనందం పంచుతాం.

## పసివాళ్లు.. శుద్ధినీరందక వెక్కిళ్లు

ఆళ్లగడ్డ : అంగన్‌వాడీల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సురక్షిత జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శుద్ధజల యంత్రాలను(వాటర్ ప్యూరిఫయర్) అందించింది. వీటిలో కొన్ని పనిచేయక పోగా, మరికొన్ని నీటి వనరులు, పైప్‌లైన్ నిర్మాణం, నీటి ట్యాంకులు లేకపోవడంతో వృథాగా మారాయి. 'సక్షం' పథకంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సొంత భవనాలున్న 246 అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధజల యంత్రాలను నాలుగు నెలల క్రితం మంజూరయ్యాయి. మరమ్మతులు, నిర్వహణ లోపించడంతో యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి.

**అనారోగ్యం పాలవకుండా..**

కలుషిత తాగునీటితో టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్, కామెర్లు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నీటిలో ప్రమాదకరమైన క్రిములను, అపరిశుభ్రతను దూరం చేసేందుకు శుద్ధజల యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు బాలింతలు, గర్భిణులు శుద్ధజలం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంది. సక్షం పథకంలో భాగంగా నాణ్యమైన యంత్రాలు ఇచ్చినా నిరుపయోగంగా మారాయి.

**ముగింపు దశకు వచ్చినా..**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సక్షం పథకాన్ని 2021లో అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమం గడువు వచ్చే ఏడాదితో ముగియనుంది. గడువు ముగింపు దశకు వచ్చినా ఇప్పటికీ కనీసం



80 శాతం కేంద్రాల్లో యంత్రాలు పనిచేయక పోవడం గమనార్హం. దీతో లబ్ధిదారులకు సురక్షిత జలం అందని స్థితి నెలకొంది. సక్షం పరిధిలోని రాని కేంద్రాల్లో శుద్ధజలం ఎండమావిగానే మిగిలింది.

ఆళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నెలో కేవలం ఒకటిన్నర సెంటు విస్తీర్ణం ఉన్న శిథిల భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. శుద్ధజల యంత్రం, ఆండ్రాయిడ్ టీవీ, ఆట వస్తువులు మంజూరైనా వసతి సరిగా లేకపోవడతో పక్కన పెట్టేశారు.

ఆళ్లగడ్డ మండలం శాంతినగరం, ఉయ్యాలవాడ మండలం తుడుముల దిన్నె, సర్వాయిపల్లె, అల్లూరు, మాయలూరు కేంద్రాలకు యంత్రాలు మంజూరైనా ట్యాంకులు లేకపోవడం, నీటి గొట్టాల కనెక్షన్ పూర్తి లేకపోవడంతో వీటి సేవలు అందడం లేదు. దొర్నిపాడులో మూడు కేంద్రాలు ఉన్నా తాగు నీటి సేవలు అందడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రాలు: 3,558
బాలింతలు, గర్భిణుల సంఖ్య: 70,766
చిన్నారులు: 2,33,921
సక్షం కేంద్రాలు: 246

## వృద్ధులంటే చౌక.. బియ్యం ఇవ్వకుండా ధోకా

కర్నూలు: 65 ఏళ్ల వయో వృద్ధులు.. దివ్యాంగులు.. నడవలేని వారికి రేషన్ సరకులు ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని ప్రభుత్వం చెబుతోంది. నెలనెలా డీలర్లు తమ పరిధిలోని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకొని బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలర్ల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత కారణంగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పండుటాకులకు కష్టాలు తప్పడం లేదు. నవంబరు ముగిసినా వీరిలో సగం మందికే రేషన్ పంపిణీ చేశారు. డిసెంబరు 1 నుంచి సాధారణ రేషన్ పంపిణీ మొదలైనా తమను మాత్రం పట్టించుకోవడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,437 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులైన కార్డుదారులు 1,02,015 మంది ఉన్నారు.

వీరికి ప్రతినెలా 25 నుంచి నెలాఖరు వరకు ఇంటి వద్దే సరకులు పంపిణీ చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఇది సవ్యంగా అమలు కావడం లేదు.డిసెంబరు 2వ తేదీ నాటికి ఉమ్మడి జిల్లాలో 58,278 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. 43,737 మందికి ఇప్పటికీ ఇవ్వలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో గత్యంతరం లేక వృద్ధులే చౌకదుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నారు.

**నగదు అంటగడుతున్నారు**



అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల గడిచిపోయినా వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ ఇవ్వకుండా.. బియ్యానికి బదులు నగదు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చాలామంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని కిలోకు రూ.10 చొప్పున డబ్బులు ఇస్తున్నారు. మాకు డబ్బు వద్దు బియ్యమే కావాలంటే మాత్రం చౌకదుకాణాల వద్దకు రావాలని చెబుతున్నట్లు వృద్ధులు వాపోతున్నారు. కొందరు డీలర్లు ఒకటో తేదీ తర్వాతనే చౌకదుకాణాల వద్ద సరకులు పంపిణీ చేస్తున్నారు. అదీ రెండ్రోజులే. తర్వాత వెళ్తే బియ్యం అయిపోయాయని తిప్పి పంపుతున్నారు. వారికి రాజకీయ నేపథ్యం ఉండటంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు.సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన ఈ వృద్ధురాలి పేరు లక్ష్మీదేవమ్మ. రేషన్ కార్డులో ఈమె ఒక్కరే ఉన్నారు. ఒక్కనెల కూడా డీలరు తమ ఇంటి వద్దకు వచ్చి సరకులు ఇచ్చింది లేదని ఈమె చెబుతున్నారు. బియ్యం తెచ్చుకునేందుకు ఈమె అష్టకష్టాలు పడుతూ.. పాత సాయిబాబా థియేటర్ సమీపంలోని 87వ చౌకదుకాణానికి వెళ్లారు. ఈ-పోస్ యంత్రంలో వేలిముద్రలు వేశారు. ఈమెకు 5 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలరు మాత్రం బియ్యం లేవని చెప్పారని.. బియ్యానికి బదులుగా రూ.50 చేతికిచ్చారని ఈమె చెబుతున్నారు. అంతదూరం నుంచి ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టారు.

## అవిలాల.. నీటితో నింపాల

తిరుపతి : చెరువుల ఆధునికీకరణతో పర్యాటకులను ఆకర్షించడానికి తుడా శ్రీకారం చుట్టింది. తిరుపతి పరిసరాల్లోని 19, గూడూరులోని మరో చెరువు అభివృద్ధి నిమిత్తం రూ.89 కోట్లతో ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించింది. ముందుగా అవిలాల చెరువును అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు.

రూ.50 కోట్లతో పనులు: చెరువును నీటితో నింపేందుకు 2.40 కి.మీ. నిడివితో 14 మీటర్లకు పైగా వెడల్పు, నాలుగు మీటర్లకు పైగా ఎత్తు ట్యాంక్‌బండ్ నిర్మించాలి. ఇందుకు ఇప్పటికే రూ.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. అయినా సప్లయ్ ఛానళ్లు పూడిపోవడం, అన్యాక్రాంతం కావడంతో నీరు చేరడం అసాధ్యంగా మారింది. సప్లై ఛానళ్లను మరమ్మతుకు రూ.కోటి ఖర్చవుతుందని అంచనా.



**అడ్డంకులు ఇలా..**

నగరాన్ని ఆనుకుని 200 ఎకరాల్లో విస్తరించిన చెరువులో ఇప్పటికే 20 ఎకరాలు అన్యాక్రాంతమైంది. ఆక్రమణలతోడు జాతీయ రహదారి నిర్మాణంతో 180 ఎకరాలే మిగిలింది. రెండు దశాబ్దాలుగా చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు చేస్తున్న యత్నాలు జాతీయ హరిత ట్రైబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అవి బెడిసి కొడుతున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న తుడా అందుకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనితాజాగా నిర్ణయించింది.


**శాశ్వత పరిష్కారం దిశగా..**

డా.ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, తుడా కార్యదర్శి

అవిలాల, పేరూరు చెరువులు నిండితే తిరుపతిలోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. సప్లయ్ ఛానళ్లు పునరుద్ధరిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అవిలాల ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పర్యాటకం అభివృద్ధి చెందుతుంది.

## ఆశయం వ్యర్థం.. తప్పదు అనర్థం

పుత్తూరు: ఈ-వ్యర్థాలు సేకరించి సురక్షిత పద్ధతిలో రీసైక్లింగ్ చేసేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ-వ్యర్థాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించు కున్నారు.. ఈ కార్యక్రమం కోసం నగరాలు, పట్టణాల్లో అట్టహాసంగా ప్రారంభించిన సేకరణ కేంద్రాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు.. గతంలో సేకరించిన వ్యర్థాలను సైతం తీసుకెళ్లకుండా వదిలేశారు. దీంతో ఈ మహత్తర కార్యక్రమం ఆరంభ శూరత్వంగా మారింది. ఈ-వ్యర్థాల్లో కాడ్మియం, క్రోమియం, లెడ్, ప్లాస్టిక్ సేకరించి సంపద సృష్టించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే ఇళ్లలో ఈ- వ్యర్థాల ఉత్పత్తి పెరిగిపోయింది. అవి కాలుష్య కారకంగా మారడమే కాక వాటిలో విష కీటకాలు చేరి సమస్యలు నెలకొంటున్నాయి. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేలా సేకరించి వాటిని రీసైక్లింగ్ చేసేందుకు కొన్ని ప్రైవేటు సంస్థలు ముందుకొచ్చాయి. ఈ క్రమంలో జిల్లాలోని నగర పాలికలు,



మున్సిపాలిటీల్లో వీటిని ఏర్పాటు చేశారు.

**తొలుత అక్కడక్కడ మెరుగ్గానే..**

ఈ కార్యక్రమం ఆరంభంలో నగర, పురపాలికల్లో పాడైన టీవీలు, మిక్సీలు, కంప్యూటర్లు, చరవాణుల ఛార్జర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ కేంద్రాలకు అందజేశారు. కొద్దిరోజుల తర్వాత పౌరులు వాటిని తీసుకురావటం మానేశారు. యంత్రాంగం శ్రద్ధ చూపకపోవడంతో చెత్త సేకరణ సమయంలో వాటిని ఆ వాహనాల్లో వేసి డంపింగ్‌యార్డుల్లో వేస్తున్నారు. సరైన ప్రచారం లేక ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర మొక్కుబడిగా మారడంతో మంచి కార్యక్రమం నీరుగారింది. తిరుపతి జిల్లాలో ఇలా: తిరుపతి నగరపాలిక, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట ఇప్పటివరకు సేకరించిన ఈ-వ్యర్థాలు: నాలుగు టన్నులు


## చలించని యంత్రాంగం

తిరుపతి : రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు చలికి వణుకుతున్నారు. పాత భవనం.. గాలి, వెలుతురు నిమిత్తం ఏర్పాటు చేసిన కిటికీల నుంచి చొచ్చుకొచ్చే చల్లని గాలులతో రోగులు అల్లాడిపోతున్నారు. ఇనుప చువ్వలతో ఏర్పాటు చేసిన కిటికీలకు అద్దాల తెరలు కొన్ని చోట్ల లేకపోవడంతో చలిగాలి లోపలికి వచ్చేస్తోంది. ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

రుయా ఆస్పత్రిలో సుమారు 1,200 మంది రోగులు ఇన్‌పేషంట్లుగా వైద్యం పొందుతున్నారు. వారికి తగ్గట్టుగా వైద్యం, పడకలు ఉన్నప్పటికీ.. మౌలిక వసతులు మాత్రం పురాతనమైనవి. మేల్, ఫిమేల్ సర్జరీ వార్డులు, ఎంఎం వార్డు, జనరల్ సర్జరీ వార్డులు, ఈఎస్‌టీ వార్డులకు ఇరువైపులా పైన వెంటిలేటర్లు ఉన్నాయి. అందులో నుంచి చల్లగాలి వస్తుండటంతో గజగజ వణుకుతున్నారు. ఎముకల విభాగం వార్డు వరండాలో మరో యూనిట్ ఏర్పాటు చేసి పడకలు వేశారు. అక్కడున్న ఇనుప చువ్వల కిటికీలకు అద్దాల తెరలు లేక చల్లని గాలి చొచ్చుకొస్తోంది. రెండో అంతస్తులో ఉన్న వార్డులోని రోగులు చలికి వణుకుతున్నారు. శ్వాసకోశ వ్యాధుల విభాగం వార్డు ప్రాంగణంలో ప్రత్యేకంగా ఉంటుంది. అసలే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న రోగులు చల్లని గాలులు పీల్చలేక మరింత అవస్థలు పడుతున్నారు. రోగుల సహాయకుల కోసం భవనం లేక ఆరు బయట చలిలో గడుపుతున్నారు. చిన్నపిల్లల విభాగం ఐసీయూ వార్డుల వెలుపల చిన్నారుల తల్లులు, బాలింతల పరిస్థితి దయనీయంగా ఉంది. బయట వరండాలో వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇటీవల భవనం పైకప్పు అమర్చినప్పటికీ.. చుట్టూ వచ్చే చల్లని గాలులతో ఇబ్బంది పడుతున్నారు. ప్రసూతి ఆస్పత్రి ఆరు బయట రోగుల సహాయకులు చలికి..వర్షానికి వణికిపోతున్నారు.

# మహా ఆశలు..చర్చంతా గ్రేటర్ తిరుపతిపైనే..



తిరుపతి : తిరుపతి మహానగరం దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయి. సీఎం చంద్రబాబు ఆదేశాలతో నగరపాలక కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ ప్రతిపాదనలను ఈనెల 4న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం కోసం అమరావతికి దస్త్రం వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రేటర్ ఆలోచన ఆలస్యమైందని, ముఖ్యమంత్రి చొరవతో త్వరగా గ్రేటర్ ప్రకటన వెలువడాలన్న ఆశ జిల్లా వాసుల్లో కనిపిస్తోంది.

**అభివృద్ధి అవకాశాలు**

ఆధ్యాత్మిక నగరంగా ఉన్న తిరుపతిని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీగా ప్రకటించి చేయూతనిస్తుండటంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. వ్యాపార, వాణిజ్య, విద్య, ఉద్యోగ, ఉపాధి, పారిశ్రామిక, పర్యాటక, ఆధ్యాత్మిక అవకాశాలు అపారం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో వలసజీవుల సంఖ్య నానాటికీ పెరిగి ఇది మరింత పెరగనుంది. నగరంలో ఇళ్లు, ఇంటి స్థలాల లభ్యత కష్టతరంగా మారడంతో ఇప్పటికే 30 శాతం మంది శివారు, నగర పొలిమేరల్లోని పంచాయతీలకు తరలివెళ్తున్నారు. శివారు పంచాయతీల్లోని 95 శాతం మంది తిరుపతిలో వృత్తి, వ్యాపారం, ఉద్యోగం చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో యాత్రికుల సంఖ్య లక్షన్నరకు చేరనున్న నేపథ్యంలో 'గ్రేటర్' వసతులు తప్పనిసరి.

**ప్రతిపాదనలు ఇలా..**

ఇరుకు రోడ్లు, భవనాలతో నగర పరిధి విస్తరణే శరణ్యం అవుతోంది. తాజాగా తిరుపతి గ్రామీణ, రేణిగుంట, చంద్రగిరి, ఏర్పేడు, రామచంద్రాపురం మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలను కలుపుతూ 284 చ.కి.మీ. విస్తరణకు ప్రతిపాదించారు. హంద్రీనీవా, బాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు నీటి సరఫరా ఆలోచనలు కలిసిరానున్నాయి.

# చిక్కులకు చికిత్స.. వైద్యానికి రక్ష



ఆదోని : పశ్చిమ పల్లెలకు అత్యవసర చికిత్స అందాలంటే చిక్కులే. అపాయం తప్పించాలంటే.. వంద కి.మీ. ప్రయాణించాల్సిందే. ఆసుపత్రికి చేరుకునేలోగా దారిలోనే పలువురు మృత్యుఒడికి చేరిన ఘటనలెన్నో. ఇలాంటి చిక్కుముడులు విప్పేస్తూ.. ఆటంకాలను తప్పిస్తూ.. వైద్యవిద్య కళాశాల భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

**ప్రస్తుతం వంద కి.మీ. వెళ్లాల్సిందే**

ఆదోని డివిజన్ పరిధిలోని 17 మండలాలు.. 14 లక్షల మందికి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రే ఆధారం. వైద్యాలయంలో రోజువారీ ఓపీ 700–800, ఐపీ 30 వరకు ఉంటుంది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, మెదడు, కాలేయ వ్యాధుల బారిన పడిన వారితోపాటు రహదారి, అగ్నిప్రమాదాలు, పురుగు మందు, పాము కాటు ప్రభావిత తదితర కేసులు.. నిత్యం 10–15 వస్తుంటాయి. వైద్య నిపుణుల కొరతతో పలువురిని ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు.

ఇక్కడి నుంచి మరో వంద కి.మీ. దూరంలోని కర్నూలు, 80 కి.మీ. దూరంలోని బళ్లారికి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో పలువురి ప్రాణాలు పోయిన ఘటనలున్నాయి.

**ఆధునిక సేవలు అందించేలా..**వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. పీపీపీ (పబ్లిక్–ప్రైవేటు–పార్ట్‌నర్) విధానంలో పనులు చేపట్టాలని భావించింది. హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ సంస్థ ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులు దక్కించుకుంది.

త్వరలో సంస్థ బృందాలు ఆదోనిలో పర్యటించి పనులు ముమ్మరం చేసే అవకాశం ఉంది.

**ఆర్భాటం చేసి వదిలేసిన వైకాపా**

వైద్య కళాశాల నిర్మాణానికి ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో 167వ జాతీయ రహదారి పక్కనే 58.44 ఎకరాలను గత వైకాపా ప్రభుత్వం సేకరించింది. ఇందులో రూ.355.59 కోట్లతో ఎన్నికల ముందు హడావుడిగా ఆస్పత్రి, పరిపాలన విభాగం, వైద్య కళాశాల, విద్యార్థి, వైద్యుల వసతిగృహాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఏడాదిన్నరగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, రాష్ట్ర వాటా సర్దుబాటు చేయకపోవడం, ఇచ్చిన నిధులు ఇతరత్రా వాటికి మళ్లించడంతో వైద్య కళాశాల నిర్మాణంపై ప్రభావం చూపింది. భవన నిర్మాణం పూర్తికాక మునుపే వైద్య కళాశాలకు ప్రొఫెసర్లు, సహాయ ప్రొఫెసర్లను గత ప్రభుత్వం నియమించింది. వీరికి వసతి లేకపోవడంతో స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిని జీజీహెచ్‌గా మార్చి అందులోని గదులు కేటాయించింది. ఏడాదిపాటు తరగతులు లేకుండానే రూ.లక్షల జీతాలు చెల్లించింది. మరోవైపు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం ఆదోని కళాశాలను సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేసింది.

# పుర భవనం 14 ఏళ్ల కిందట పునాది



ఆళ్లగడ్డ : జిల్లాలో 14 ఏళ్ల కిందట అయిదు కొత్త పురపాలికలు ఏర్పాటు కాగా, వాటికి ఎక్కడా సొంత భవనాలు లేవు. దశాబ్దాలుగా పాత, అద్దె కార్యాలయాల్లోనే కొనసాగుతున్నాయి. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, గూడూరు మున్సిపాలిటీలు 2011లో.. బేతంచెర్ల నగర పంచాయతీ 2020లో ఏర్పాటైంది. ఏదైనా పురపాలక సంఘాన్ని కొత్తగా ప్రకటిస్తే మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. స్టార్టప్ గ్రాంట్స్ కింద ఒక్కో పురపాలి కకు రూ.2 కోట్లు మంజూరు చేస్తారు. ఇవి మంజూరైనా జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, గూడూరు పురపాలక సంఘాలకు కొత్త భవనాలు నిర్మించలేదు. వేల జనాభాకు ప్రాతినిధ్యం వహించే పురపాలక సంఘాలు ఏళ్లు గడుస్తున్నా అసౌకర్యాలతో కొట్టుమిట్టాడు తున్నాయి.

సిబ్బందికి ఇబ్బందిఆళ్లగడ్డలో కొత్త భవనానికి 2017లో ప్రతిపాదనలు సిద్ధం చేయగా రూ.2.25 కోట్లు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేస్తే.. అంత మొత్తాన్ని ఇవ్వలేమని అప్పటి అధికారులు తేల్చి చెప్పేశారు. దీంతో కొత్త భవన నిర్మాణం ప్రతిపాదన మూలకు చేరింది. ఆళ్లగడ్డలో కౌన్సిల్ సమావేశ గది 9 అడుగుల వెడల్పు 20 అడుగుల పొడవుతో ఉంది. ఇక్కడ 27 మంది కౌన్సిల్ సభ్యులు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు, కమిషనర్, ఆరుగురు పురపాలక సిబ్బంది.. ఇలా కనీసం 10 నుంచి 20 మంది వరకు ఇతరులు హాజరవుతుంటారు. ఇంత చిన్న గదిలోనే అంతమంది కూడా ఇబ్బందిగా కూర్చొనే పరిస్థితులు నెలకొన్నాయి.

నందికొట్కూరులో కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. గూడూరులో కొత్త భవన నిర్మాణం ప్రారంభించినా అసంపూర్తిగా నిలిచిపోయింది.

కొరవడిన సమన్వయం

మేజరు పంచాయతీల నుంచి పురపాలికగా మారిన వెంటనే కొత్త శాఖలు అందుబాటులోకి వస్తాయి. రెవెన్యూ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య, వీధి దీపాలు, మెప్మా, పట్టణ ప్రణాళిక, తాగునీరు, గృహ నిర్మాణం ఇలా పలు విభాగాలు ఉంటాయి.

ఇవేవీ లేకపోవడంతో పాత కార్యాలయాల్లోనే ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. స్టార్టప్ గ్రాంట్లలో వచ్చిన రూ.2 కోట్లలో రూ.50 లక్షలతో కొత్త కార్యాలయం నిర్మించాలి. 14 ఏళ్ల కిందట విడుదలైన ఈ డబ్బులకు ప్రస్తుతం కొత్త భవనం నిర్మించడం సాధ్యం కాదు. కనీసం రూ.4 కోట్లు నుంచి రూ.5 కోట్ల నిధుల అవసరం ఉంది.

## మంగలేటీ.. 'భూ'తాల లూటీ

నంద్యాల : రెండు కార్ల పంటలకు సాగునీటిని అందించే కాల్వ ఆక్రమణకు గురైంది. ఏళ్లుగా కొద్దికొద్దిగా ఆక్రమణలకు గురవుతూ రావడంతో చివరకు కాల్వ రూపు కోల్పోయే దుస్థితి నెలకొంది. భారీ వర్షం వస్తే కాల్వ పొంగిపొర్లి పొలాలను ముంచడంతోపాటు ఏకంగా గ్రామమే మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది.

**200 ఎకరాల ఆక్రమణ**

నారాయణపురం పరిధిలో 605, 606, 608, 612, 614, 615 తదితర సర్వే నంబర్లలో 17 మీటర్ల వెడల్పుతో మంగలేటి కాల్వ ఉంది. 1996 నుంచి వెలుగోడు రిజర్వాయరు ద్వారా తెలుగుగంగ కాల్వలకు నీటి విడుదల ప్రారంభమైంది. దీంతో పంట పొలాలకు 'కళ' వచ్చింది. మంగలేటి కాల్వకు కూడా అప్పటి నుంచే సాగునీటి విడుదల జరగ్గా.. కాల్వ ఆక్రమణకు గురవుతూ వచ్చింది. ప్రస్తుతం కాల్వ వెడల్పు మూడు మీటర్లు మాత్రమే ఉంది. దీంతో నిర్దేశిత పరిమాణంలో నీటిని తీసుకోలేకపోతోంది. 5 కి.మీ.ల పొడవునా కాల్వ వెంట ఆక్రమిత భూమి విస్తీర్ణం 200 ఎకరాల వరకు ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

**9 కి.మీ. పొడవునా..**

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి బండిఆత్మకూరు మండలం నారాయణపురం, సంతజూటూరు, చిన్నదేవళాపురం తదితర గ్రామాలకు 'కృష్ణా' వెనుక జలాలను అందించేందుకు 'మంగలేటి కాల్వ' ఉంది. టీజీపీ ప్రధాన కాల్వ నుంచి సంతజూటూరు వరకు 9 కి.మీ. పొడవునా ఈ



కాల్వ ఉంది. ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం గ్రామం వరకు 5 కి.మీ.ల పొడవునా కాల్వ ఆక్రమణకు గురైంది.

**నారాయణపురం జల దిగ్బంధం**

మంగలేటి కాల్వ ఆక్రమణలతో సాగునీరు విడుదల సమయంలో కాల్వ పొంగి పొర్లుతుంది. ఇదే సమయంలో భారీ వర్షం కురిసినా.. తుపాను సమయంలో కాల్వ పోటెత్తి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. సమీపంలోని నారాయణపురం గ్రామాన్ని దిగ్బంధం చేస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. తాగునీరు కలుషితం అవుతుంది. ఇక్కడి ప్రజలు ఇలా ఇబ్బందులు పడడం రెండు దశాబ్దాలుగా సాధారణంగా మారిపోయింది.

**పొలాలకూ దెబ్బ**

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం మీదుగా సంతజూటూరు వరకు 9 కి.మీ.ల పొడవునా మంగలేటి కాల్వ ప్రవాహం ఉంది. నారాయణపురంతోపాటు సమీప గ్రామ పొలాలు దెబ్బతింటున్నాయి. గ్రామానికి చెందిన 300 ఎకరాల పంట పొలాలు భారీ వర్షాల సమయంలో మునిగి రైతులు నష్టపోతున్నారు. గతనెల మొంథా తుపానుతో గ్రామంతోపాటు పొలాలు మునిగాయి.

## జామాయిల్ సాగు.. లాభాలు బాగు

తాళ్లూరు : రైతులు ఎంతో ఆశతో సాగు చేపట్టిన జామాయిల్ పంట ప్రస్తుతం కనక వర్షం కురిపిస్తోంది. నీటి వసతి తక్కువగా ఉండడం, పెట్టుబడులు పెట్టి పంట సాగుకోసం అధిక శ్రమను చేయలేని రైతులు జామాయిల్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

**జిల్లా పరిధి గ్రామాల రైతులు కూడా..**

తాళ్లూరు, విఠలాపురం, కొత్తపాలెం, బొద్దికూరపాడు, వెలుగువారి పాలెం, తదితర గ్రామాల రైతులతోపాటు జిల్లా పరిధిలోని చీమకుర్తి, మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి, టంగుటూరు, జరుగుమల్లి, సంతనూతలపాడు, తదితర మండ లాల పరిధిలో విస్తారంగా సాగులో ఉంది. పెట్టుబడులు చాలా తక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు పట్ల అసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లా పరిధిలో సుమారు నలభైవేల ఎకరాల్లో సాగవుతోంది. తొలి ఏడాదిలో కేవలం రూ.20వేలు వంతునే పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. తదుపరి రెండేళ్లలో అవసరమైనమేర శ్రమతో పంటను కాపాడుకోవడంతో ప్రస్తుతం కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కో ఎకరాలో సాగు ఖర్చులు, కౌలు, ఇతరత్రా పెట్టుబడులన్నీ కలిపి మొత్తం రూ. 50వేలమేరకు రైతులు ఖర్చు చేశారు. గత రెండు, మూడేళ్ల కాలంలో గిట్టుబాటు ధరలు దక్కక రైతులు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం ఊహించిన రీతిలో పుష్కలంగా లాభాలు వస్తుండడంతో ఆనందంగా ఉన్నారు.

**భూముల స్థితిగతుల ఆధారంగా..**

ఒక్కో ఎకరాలో రైతుల భూముల స్థితిగతులు ఆధారంగా 25 నుంచి 40 టన్నుల వరకూ దిగుబడులు వస్తున్నాయి. సరాసరిగా 25 టన్నుల మేరకు అధిక మంది రైతులు దిగుబడులు సాధించ గలిగారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు టన్ను ధర రూ.ఐదువేల వంతున రైతులకు చెల్లిస్తున్నారు. కూలీలకు అవుతున్న ఖర్చులు, వాహనాల బాడుగలు, ఇతరత్రా ఖర్చులు పోగానే ఆమేర ధరలు దక్కుతున్నాయి. దీంతో ఎకరాలో రూ. 1,25,000ల వరకూ వస్తుండగా పెట్టుబడులు పోగా నికరాదాయం రూ. 75 వేలుపైగా దక్కుతోంది. ఇతర పంటలు దెబ్బతిని నష్టాలను చవిచూసి ఆందోళనలో ఉన్న రైతాంగానికి సుబాబుల్ పంట బాగా ఊరటనిస్తోంది.

## బిందు సేద్యం.. మొక్కకు ప్రాణం

కంభం : సాగును ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రాయితీపై అందజేస్తోంది.

**రాయితీలు ఇలా...**ఎస్సీ, ఎస్టీల్లో 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు వంద శాతం, ఇతర చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలు కలిగిన మధ్య తరగతి రైతులు 90 శాతం, 10 నుంచి 12.5 ఎకరాలు కలిగిన పెద్ద రైతులకు 50 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి భూమి పత్రాలు (పాస్ పుస్తకాలు), ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నంబర్‌తో సంప్రదించాలి. రైతు వాటా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయినప్పటికీ, అర్హులైన రైతులు ముందుకు వస్తే ఏడాది పొడవునా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు మంజూరు చేస్తామని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారి శ్వేత తెలిపారు. లక్ష్యం... 10 వేల హెక్టార్లు జిల్లా వ్యాప్తంగా 2025–26 ఏడాదికి 10 వేల హెక్టార్లలో బిందు సేద్య పరికరాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటి వరకూ సగం లక్ష్యం కూడా పూర్తి చేయలేదు. 4805 హెక్టార్లకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. మరో 5194 హెక్టార్లకు బిందు సేద్యం పరికరాలు అందజేయాల్సి ఉంది. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

## ట్రెండ్‌లో చేరిన 'పెద్ది' బ్యూటీ

ఇటీవల 2016 జం 2026 ఫోటోల ట్రెండ్ పెద్ద చర్చగా మారింది. మృణాల్ ఠాకూర్ కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలో ఈ ఫోటోల ట్రెండ్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. జనవరి 2026లో మృణాల్ తన ఇన్?స్టాలో కొన్ని పాత వీడియోలు, కొత్త సెల్ఫీలను షేర్ చేస్తూ ఈ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. 2016 నాటి తన పాత వీడియోలను వెతికితే కేవలం మూడు మాత్రమే దొరికాయని, అవి చూడటానికి ఇబ్బందిగా..నవ్వు తెప్పించే(క్రింజ్ గా)లా ఉన్నాయని సరదాగా చెప్పుకొచ్చారు. తన గ్యాలరీలో ఉన్న కొన్ని లేటెస్ట్ సెల్ఫీలను కూడా షేర్ చేశారు. నేను ఈ ట్రెండ్‌ను ఆలస్యంగా ఫాలో అవుతున్నానా? అని మృణాల్ తన అభిమానులను అడిగారు. ధనుష్‌తో పెళ్లి వార్తలు ఒకవైపు ఊదరగొడుతున్న సమయంలో మృణాల్ అవేవీ పట్టించుకోకుండా తన పాత జ్ఞాపకాలను పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నట్లు ఇది స్పష్టం చేసింది. కరీనా కపూర్ తన 2016 నాటి బేబి బంప్ ఫోటోలను షేర్ చేయడంతో ఈ ట్రెండ్ అప్పట్లో బాగా వైరల్ అయింది. మృణాల్ కూడా ఆ ట్రెండ్‌లో భాగమయ్యారు. ఆ తర్వాత జాన్వీకపూర్ సోదరి ఖుషీ కపూర్ క్రింజ్ ఫోటోలను షేర్ చేయ?గా సోషల్ మీడియాలో డిబేట్ మొద?లైంది. 16 జనవరి 2026న ఖుషీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో -2026 ఒక కొత్త 2016- అనే వైరల్



ట్రెండ్?లో భాగంగా ఈ పోస్ట్ పెట్టారు. ఖుషీ కపూర్ 2016 నాటి తన పాత ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ .. 2016 నుంచి కేవలం మూడు క్రింజ్ వీడియోలు, 2026లో అలాంటివే కొన్ని సెల్ఫీలు షేర్ చేస్తున్నానని రాసారు. ఖుషీ తన టీనేజ్ రోజుల్లో (2016లో) సరదాగా తీసుకున్న మూడు వీడియోలను షేర్ చేశారు. అవి ఇప్పుడు చూస్తే తనకు -క్రింజ్-గా అనిపిస్తున్నాయని ఖుషీ చమత్కరించారు. ప్రస్తుతం సంవ?త్స?రం 2026లోను తను తీసుకున్న కొన్ని అందమైన సెల్ఫీలను కూడా జత చేస్తూ, ఈ ట్రెండ్?లో పాల్గొనడానికి నేను ఆలస్యం చేశానా? అని అడిగారు. 2016లో చాలా కూల్‌గా ఉండేదాన్ని అని కూడా ఖుషీ పేర్కొంది. దీనికి జాన్వీ కపూర్ -షాక్డ్- అంటూ రియాక్ట్ అయ్యారు. ఖుషీ పోస్ట్ చూసిన వెంటనే త?న? అక్క జాన్వీ కపూర్ చాలా సరదాగా స్పందించారు. అసలు అందరూ ఎందుకు ఈ 2016 ట్రెండ్ ఫాలో అవుతున్నారో అర్థం కాక, జాన్వీ ఇలా కామెంట్ చేశారు. అసలు అందరూ ఇది ఎందుకు చేస్తున్నారు? అని రాసారు. జాన్వీ చేసిన కామెంట్ నెటిజన్లను బాగా ఆకట్టుకుంది. అసలు ఈ 2016 ట్రెండ్ ఏంటి? అంటే వివరాల్లోకి వెళ్లాలి. జనవరి 2026 ప్రారంభంలో సోషల్ మీడియాలో -2026 ఈజ్ ది న్యూ 2016-- అనే ట్రెండ్ మొదలైంది. పదేళ్ల క్రితం (2016లో) తాము ఎలా ఉన్నామో చూపిస్తూ, అప్పటి పాత స్నాప్‌చాట్ ఫిల్టర్లు, ఫ్యాషన్ సెన్స్, ఇతర జ్ఞాపకాలను సెలబ్రిటీలు షేర్ చేస్తున్నారు. ఖుషీ కపూర్‌తో పాటు అనన్య పాండే, సోనమ్ కపూర్, అలియా భట్, కరీనా కపూర్ కూడా ఈ ట్రెండ్‌లో పాల్గొని తమ పాత ఫోటోలను షేర్ చేశారు.

## ధనుష్, మృణాల్ పెళ్లి వార్తలు.. ఇది అసలు నిజం!

సోషల్ మీడియాలో సెలబ్రిటీల వ్యక్తిగత విషయాల గురించి నిత్యం ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. ముఖ్యంగా స్టార్ హీరోలు లేదా క్రేజీ హీరోయిన్ల మధ్య ఏదైనా అనుబంధం ఉందనే చిన్న క్లూ దొరికినా, అది నిమిషాల్లో వైరల్ అయిపోతుంది. గత కొద్ది రోజులుగా కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ చుట్టూ ఇలాంటి వార్తలే చక్కర్లు కొడుతున్నాయి. వీరిద్దరి మధ్య ఏదో ఉందనే ప్రచారం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఊహాగానాలు కేవలం డేటింగ్ దగ్గరే ఆగకుండా ఏకంగా పెళ్లి వరకు వెళ్లడం విశేషం. ముఖ్యంగా రాబోయే వాలెంటైన్స్ డే నాడు వీరిద్దరూ రహస్యంగా వివాహం చేసుకోబోతున్నారనే పోస్టులు నెట్టింట హల్చల్ చేశాయి. కేవలం సన్నిహితులు, అతి తక్కువ మంది స్నేహితుల మధ్యే ఈ వేడుక జరగబోతోందని ప్రచారం సాగింది. ధనుష్ సోదరీమణులను మృణాల్ సోషల్ మీడియాలో ఫాలో అవ్వడం వంటి అంశాలు ఈ రూమర్లకు మరింత బలాన్నిచ్చాయి. అయితే ఈ వార్తల్లో



ఎంతవరకు వాస్తవం ఉందనే విషయంపై ఇప్పటివరకు ఎవరూ స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఒక క్లారిటీ వచ్చింది. ధనుష్ మృణాల్ ఠాకూర్ టీమ్స్ ను ఇటీవల ప్రముఖ మీడియా సంస్థ సంప్రదించి ఈ పెళ్లి వార్తలపై వివరణ కోరింది. వారు ఇచ్చిన సమాధానంతో ఈ వైరల్ వార్తలకు ఒక్కసారిగా బ్రేక్ పడింది. బాలీవుడ్ ప్రముఖ మీడియా సంప్రదించగా, ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే వార్తలు కేవలం ఒక జోక్ అని వారి పబ్లిసిస్ట్ టీమ్స్ కొట్టిపారేశాయి. వాస్తవానికి అలాంటిదేమీ లేదని, ప్రస్తుతం వస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని వారు స్పష్టం చేశారు. పెళ్లి వార్తలను వీరు కేవలం ఒక ఫన్నీ రూమర్‌గా మాత్రమే చూస్తున్నట్లు తెలుస్తోంది. ధనుష్, మృణాల్ ఒకరి సినిమాల వేడుకల్లో మరొకరు కనిపించడం వల్ల ఈ గాసిప్స్ పుట్టుకొచ్చాయి. గతంలో 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీమియర్‌కు ధనుష్ వెళ్లడం, అలాగే ధనుష్ సినిమా పార్టీల్లో మృణాల్ కనిపించడం వంటి పరిణామాల వల్ల నెటిజన్లు వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని భావించారు. కానీ ఇప్పుడు వారి టీమ్స్ నుంచి వచ్చిన అధికారిక ప్రకటనతో ఈ చర్చకు తెరపడినట్లయింది. ఏదేమైనా సెలబ్రిటీల విషయంలో అధికారిక సమాచారం రాకముందే ఇలాంటి వార్తలు ప్రచారం కావడం సర్వసాధారణం. ప్రస్తుతం ఈ ఇద్దరు స్టార్లు తమ తదుపరి ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. పెళ్లి అనేది ప్రస్తుతానికి వారి ప్లాన్స్‌లో లేదని అర్థమవుతోంది. మరి ఈ క్లారిటీ తర్వాత అయినా ఈ రూమర్లకు ఎండ్ కార్డ్ పడుతుందో లేదో చూడాలి.




## నయనతారకు పోటీగా రష్మిక!





దక్షిణాది చిత్ర పరిశ్రమలో నెంబవర్ హీరోయిన్ ఎవరు అంటే లేడీ సూపర్ స్టార్ నయనతార పేరే వినిపిస్తోంది.ప్రఖ్యాత తమిళ, తెలుగు పరిశ్రమల్లో న?య?న్ ఇమేజ్ ఎంతో ప్రత్యేకం. ఎంత మంది హీరోయిన్లు ఉన్నా మరెంత మంది కొత్త భామలు నిత్యం దిగుతమతి అవుతున్నా నయనతారను ఇంచు కూడా కదపలేకపోయారు. చిత్ర పరిశ్రమలో నయన్ తనని తాను అలా బిల్డ్ చేసుకుంది. తాను ప్రాధాన్యత ఇచ్చేది డబ్బుకు కాదు..అంతకు మించి అంటూ ఎన్నో సందర్భాల్లో ప్రూవ్ చేసుకుంది. ఇదే నయన్ క్రేజ్ కి ఓ స్పెషల్ రీజన్ గా చెప్పొచ్చు. మరో ఏడాది రెండేళ్ల పాటు నయనతారకు ఎలాంటి పోటీ ఉండదు. కానీ రెండేళ్ల తర్వాత సన్నివేశం మారే అవకాశం ఉంది. లేడీ సూపర్ స్టార్ కు పోటీగా నేషనల్ క్రష్ రష్మికా మందన్నా తయారవుతుందనే గెస్సింగ్స్ తెరపైకి వస్తు న్నాయి. -పుష్ప- విజయంతో రష్మిక పాన్ ఇండియాలో ఎంతగా ఫేమస్ అయిందో తెలిసిందే. అదే క్రేజ్ తో బాలీవుడ్ లో నూ బిజీ నటిగా మారింది. నెటి జనరేష్ హీరోయిన్లలలో అత్యధిక పారితోషికం అందుకుంటోన్న నటిగా గుర్తింపు దక్కించుకుంది. ప్రత్యేకించి సౌత్ లో ఎనలేని క్రేజ్ ని సొంతం చేసుకుంది. సొంత పరిశ్రమ కన్నడలో వివాదాస్పదం అవ్వడానికి పరోక్షంగా ఈ క్రేజే కారణం అన్నది అంతే వాస్తవం. ఇదే క్రేజ్ తో సౌత్ లో ఎన్నో కొత్త అవకాశాలు క్యూ క?డుతున్నాయి. కానీ రష్మిక మాత్రం సౌత్ సినిమాల్ని లైట్ తీసుకుంటుంది. తమిళ, తెలుగులో గొప్ప అవకాశాలైతే తప్ప కమిట్ అవ్వడం లేదు. న?య?న?తార కూడా కొంత కాలంగా ఇదే విధానంలో సినిమాలు చేస్తోంది. బాలీవుడ్ లో మాత్రం ఎలాంటి అంతరం లేకుండా పని చేస్తోంది. అలాగే రష్మిక లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటే ప్రయత్నాలు సీరియస్ గానే చేస్తుంది. ఇప్పటికే -ది గర్ల్ ఫ్రెండ్- తో మంచి విజయాన్ని అందుకుంది. ఆ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. త్వరలో -మైసా- అనే హారర్ థ్రిల్లర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇలాంటి హిట్ రష్మిక ఖాతాలో పడితే సౌత్ లో ఇమేజ్ రెట్టింపు అవుతుంది. నయనతార కూడా లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేస్తోంది. కానీ వాటితో మార్కెట్ లో ఇంపాక్ట్ చూపించలేక పోతుంది. ఈ రెండు జానర్లలో నయన తార-రష్మిక లను పోలిస్తే రష్మిక బెస్ట్ గా కనిపిస్తోంది. నేషనల్ క్రష్ ఇలాగే కొనసాగిస్తే నయనతార స్థానానికి ఎసరు పెట్టడం ఖాయమే.

## సంక్రాంతి బాక్సాఫీస్ రిపోర్ట్: సేఫ్ జోన్‌లోకి వెళ్తున్నదెవరు?



టాలీవుడ్ సంక్రాంతి ఫైట్ ఇప్పుడు పీక్ స్టేజ్‌కు చేరుకుంది. పండగ సెలవులు ఆల్మోస్ట్ ముగుస్తున్న తరుణంలో బాక్సాఫీస్ లెక్కలు చాలా ఇంట్రెస్టింగ్ మలుపులు తీసుకుంటున్నాయి. థియేటర్ల వద్ద హడావుడి ఎలా ఉన్నా, బయ్యర్లు సేఫ్ జోన్ లోకి వెళ్ళారా లేదా అన్నదే ఇప్పుడు అసలైన పాయింట్. ప్రతి సినిమా తనదైన రీతిలో రికవరీ సాధిస్తూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ వైపు పరుగులు తీస్తోంది. సెలవుల ఎఫెక్ట్ తో కొన్ని సినిమాలు ఊహించని రీతిలో పుంజుకున్నాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు భారీ ప్రీ రిలీజ్ బిజినెస్ జరుగుతుంది కాబట్టి, రికవరీ మార్క్ కూడా అంతే పెద్దగా ఉంటుంది. చిన్న సినిమాలకు తక్కువ టార్గెట్ ఉండటంతో అవి త్వరగా ప్రాఫిట్ జోన్ లోకి ఎంటర్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. లేటెస్ట్ ట్రేడ్ అంచనాల ప్రకారం, ఏ సినిమా ఎంత శాతం రికవరీ సాధించిందో చూస్తే, ఈ సంక్రాంతి విన్నర్ ఎవరనేది దాదాపు క్లారిటీ వచ్చేసినట్టే కనిపిస్తోంది. అందరి ఫోకస్ మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాపైనే ఉంది. ఈ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే తన బ్రేక్ ఈవెన్ టార్గెట్‌లో ఏకంగా 95 శాతంకి పైగా రికవరీ పూర్తి చేసుకుని టాప్‌లో నిలిచింది. ఫ్యామిలీ ఆడియన్స్ సపోర్ట్ ఇలాగే కొనసాగితే, మరో రెండు రోజుల్లోనే ఈ సినిమా అన్ని ఏరియా లో కూడా క్లీన్ హిట్ స్టేటస్ అందుకుని ప్రాఫిట్స్ లోకి ఎంటర్ అవ్వడం ఖాయం. మెగాస్టార్ తన మాస్ పవర్ తో బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాస్తున్నారు. ఇక యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' ఈ పండగకు అసలైన సర్ ప్రైజ్ ప్యాకేజీగా మారింది. కేవలం 4 రోజుల్లోనే ఈ సినిమా 75 శాతం రికవరీ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తక్కువ బడ్జెట్ తో వచ్చి భారీ వసూళ్లు రాబడుతుండటంతో, బయ్యర్లు ఈ సినిమా విషయంలో చాలా హ్యాపీగా ఉన్నారు. మరోవైపు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్' ఎనిమిది రోజుల తర్వాత 65 శాతం రికవరీ మార్కు దగ్గర ఉంది. భారీ టార్గెట్ ఉండటంతో ఈ సినిమా సేఫ్ జోన్ లోకి రావడానికి ఇంకాస్త కష్టపడాల్సి ఉంటుంది. శర్వానంద్ నటించిన 'నారీ నారీ నడుమ మురారి' కేవలం 3 రోజుల్లోనే 50 శాతం రికవరీ సాధించి పర్వాలేదనిపిస్తోంది. కామెడీ ఎమోషనల్ కంటెంట్ కావడంతో ఈ వీకెండ్ లో ఈ సినిమా పుంజుకునే అవకాశం ఉంది. ఇక మాస్ మహారాజా రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' 5 రోజుల తర్వాత 40 శాతం రికవరీ మార్కు వద్ద నిలిచింది. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ కావాలంటే రాబోయే రోజుల్లో వసూళ్ల వేగం పెరగాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఉన్న ట్రెండ్ చూస్తుంటే, మెగాస్టార్ చిరంజీవి నవీన్ పోలిశెట్టి,శర్వానంద్ సినిమాలు సంక్రాంతి విన్నర్లుగా నిలవడం పక్కాగా కనిపిస్తోంది. రికవరీ శాతాన్ని బట్టి చూస్తే, 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమానే ఈ ఏడాది సంక్రాంతి బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్ గా నిలిచేలా ఉంది. బాక్సాఫీస్ వద్ద ఈ పోరు సెలవులు ముగిసే వరకు ఇలాగే కంటిన్యూ అయ్యేలా కనిపిస్తోంది.

## హ్యాట్రిక్ కి ఒక్క అడుగు దూరంలో!

అందాల మీనాక్షి చౌదరి మంచి విజయంతో కొత్త ఏడాదిలోకి గ్రాండ్ గా అడుగు పెట్టింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన -అనగనగా ఒక రాజు- తో డీసెంట్ హిట్ అందుకుంది. ఇందులో మీనాక్షి పాత్రకు మంచి పేరొచ్చింది. మరి ఈ విజయంతో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి. గత ఏడాది సంక్రాంతికి కూడా అమ్మడు -సంక్రాంతికి వస్తున్నాం-తో భారీ విజయాన్నే అందుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా 300 కోట్ల వసూళ్లనే సాధించింది. కానీ ఆ తర్వాత నటిగా మాత్రం బిజీ కాలేకపోయింది. అక్కడో కారణం ఉంది. హీరోయిన్ పరంగా ఆ సినిమా క్రెడిట్ అంతా ఐశ్వర్యా రాజేష్ కొట్టేసింది. కానీ ఆ సక్సెస్ తో ఐశ్వర్య కూడా బిజీ కాలేదు. మరి తాజా సక్సెస్ తోనైనా మీనాక్షి బిజీ అవుతుందా? అన్నది చూడాలి. కానీ లైనప్ పరంగా చూస్తే మీనాక్షి చౌదరి హ్యాట్రిక్ విజయానికి ఒక్క అడుగు దూరంలో ఉంది. -సంక్రాంతికి వస్తున్నాం-, -అనగనగా ఒక రాజు-తో బ్యాక్ టూ బ్యాక్ విజయాలు అందుకుంది. అమ్మడి ఖాతాలో మరో విజయం



పడితే హ్యాట్రిక్ నమోదైనట్లే. అందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా నటిస్తోన్న మిస్టికల్ థ్రిల్ల?ర్ -వృషకర్మ-లో హీరోయిన్ గా నటిస్తోంది. కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. -విరూపాక్ష-తో ఫ్లాప్ ల్లో ఉన్న సాయితేజ్ కు సరికొత్త ఇమేజ్ తీసుకొచ్చిన దర్శకుడతను. -విరూపాక్ష- బాక్సాఫీస్ వ?ద్ద 100 కోట్ల వసూళ్లను సాధించింది.ఆ తర్వాత మరే సినిమా డైరెక్ట్ చేయకుండా -వృషకర్మ-పైనే పని చేసాడు. ఈ సినిమా ను కూడా కార్తీక్ చెక్కుతున్నాడు. చైతన్యకు బ్లాక్ బస్టర్ ఇవ్వాలనే కసితో పనిచేస్తున్నాడు. ఇందులో నాగచైతన్య సాహసకుడి పాత్రలో కనిపించనున్నాడు. మీనాక్షి చౌదరి పాత్రకు అంతే ప్రాధాన్యత ఉంది. దీంతో ఈ సినిమా విజయం సాధిస్తే మీనాక్షి ఖాతాలో హ్యాట్రిక్ నమోదవుతుంది. మీనాక్షి బ్యూటీ రేసులో వెనుకబడటానికి ప్రధాన కారణం ఒకటుంది. అమ్మడు గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుం ది. పెదవి ముద్దులు..ఇంటిమేట్ సీన్స్ అంటే నో చెబుతుంది. డీసెంట్ రోల్స్ మినహా ప్రయోగాలకు వెనుకాడుతుంది. కానీ ఉన్న కాంపిటీషన్ లో వెనక్కి తగ్గితే అవకాశాలు అందుకోవడం కష్టం అని తెలిసినా ఛాన్స్ తీసు కోవడం లేదు. మరి కొత్త ఏడాది ఏమైనా కొత్తగా ఆలోచిస్తుందేమో చూడాలి.

## సారా అర్జున్ ఫేవరెట్ తెలుగు హీరో ఎవరో తెలుసా?

ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ మొదలుపెట్టి.. పదుల సంఖ్యలో సినిమాలు చేసి ప్రేక్షకులను అలరించిన సారా అర్జున్.. దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియిన్ సెల్వన్ సినిమాలో ఐశ్వర్యరాయ్ చిన్నప్పటి పాత్రలో నటించి.. నటిగా అందరి దృష్టిని ఆకట్టుకుంది. అలాంటి ఈమె తొలిసారి బాలీవుడ్ లో రణవీర్ సింగ్ హీరోగా ఆదిత్యాధర్ దర్శకత్వంలో వచ్చిన ధురంధర్ సినిమాలో హీరోయిన్ గా నటించి, ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా ప్రభాస్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల క్రేజ్ ను కూడా వెనక్కి నెట్టింది అని చెప్పవచ్చు. అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తెలుగులో గుణశేఖర్ దర్శకత్వంలో వస్తున్న యుఫోరియా అనే సినిమాలో నటిస్తోంది. ఈ మేరకు ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ ను తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో పాల్గొన్న సారా అర్జున్ తనకు ఇష్టమైన తెలుగు స్టార్ హీరో ఎవరో చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో భాగంగా యాంకర్ మాట్లాడుతూ.. తెలుగులో మీ ఫేవరెట్ హీరో ఎవరు ? అని అడగగా.. చాలామంది ఉన్నారు అని చెప్పుకొచ్చింది సారా అర్జున్. అయితే ఒక్కరి పేరు మాత్రమే చెప్పాలని యాంకర్ అడగగా.. రౌడీ హీరో విజయ్ దేవరకొండ అంటే తనకు చాలా ఇష్టమని చెప్పి రౌడీ హీరో అభిమానులను ఆశ్చర్యపరిచింది ఈ లేటెస్ట్ సెన్సేషనల్ యంగ్ హీరోయిన్ సారా అర్జున్. మొత్తానికి



అయితే విజయ్ దేవరకొండ అంటే ఇష్టమని చెప్పడంతో వీరిద్దరి కాంబోలో సినిమా వస్తే చూడాలని ఉంది అని అప్పుడే అభిమానులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా సారా అర్జున్ చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే సారా అర్జున్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ యుఫోరియా సినిమా విషయానికి వస్తే.. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ గుణశేఖర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో నాజర్, గౌతమ్ మీనన్, ఆదర్శ్ బాలకృష్ణ, భూమిక చావ్లా తదితరులు కీలకపాత్రలు పోషించారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో సమాజంలో యువత డ్రగ్స్ వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు, క్రైమ్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించినట్లు డైరెక్టర్ చెప్పుకొచ్చారు. తాజాగా విడుదల చేసిన ట్రైలర్లో ఇలాంటి ఎలిమెంట్స్ ను ఎక్కువగా చూపించారు. అమ్మాయిలపై రేప్ అటెంప్ట్, మైనర్ క్రైమ్, పోక్సో ఇలా కరెంటు టాపిక్స్ ను తీసుకొని ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే స్పష్టం అవుతుంది. ముఖ్యంగా ఈ ఒక్క ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసిందని చెప్పవచ్చు. ఈ చిత్రాన్ని గుణ హ్యాండ్ మేడ్ ఫిలిమ్స్ బ్యానర్ పై నీలిమ గుణ నిర్మిస్తున్నారు. కాలభైరవ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇకపోతే సమంతతో శాకుంతలం లాంటి పాన్ ఇండియా డిజాస్టర్ తర్వాత గుణశేఖర్ నుంచి వస్తున్న ఈ సినిమా ఎలాంటి సక్సెస్ అందుకుంటుందో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536